జనవరి 16-31, 2022

సంపుటి 02, సంచిక 06

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక





'జై జవాన్ జై కిసాన్' నినాదంతో జవాన్లు,
రైతుల గుండెల్లో ధైర్యం నింపిన మాజీ ప్రధానమంత్రి,
స్వాతంత్ర్య సమరయోధుడు,
భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor,
Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# తంగేడు

## విషయ సూచిక





09 **తెలుగులో అనువాదాల అవశ్యకతను** వివరించే **ఎలనాగ** వ్యాసం...



25 సామాజిక బాధ్యునిగా సాహితీ సృష్టి చేసిన **వేణు సంకోజు**తో **ముఖాముఖి**



11 **బంగారు కలల కోసం** విషాద పరిణామం వివరించిన **దేశరాజు** కథ



05 మతం - తమ మతం అర్థం తెలుసుకున్న రైతు జాతి కథ. **కాంచనపల్లి చిన వెంకటరామారావు చెరువొడ్డున...**




15 **రచనలో సామాజిక కోణం** విశ్లేషించిన **సువర్ణ వినాయక్**



19 భారతదేశం అతి స్వేచ్ఛను కథీకరించిన **రామాచంద్ర మౌళి కల్లోలం** కథ



46 మొగులు మెత్తపడితేనే ఆకాశం నుంచి వర్షం అని రచనా మర్మాన్ని తెలియజేసే **అన్నవరం దేవేందర్** కవిత **సృజన**



02 ఆమని కోసం కలలు కనే కోయిల మౌనరాగాలు చిత్రించిన **తుమ్మూరి** కవిత **“కలలు కనే కోయిల”**

మనిషి అనేక రూపాలు చెప్పే **రాధాకృష్ణమాచార్యులు ‘నా పేరు మనిషి’** కవిత... పేజీ 04

తెలంగాణ నటుడు **అజీత్ ఖాన్**ని ఆవిష్కరించిన **పొన్నం...** పేజీ 39

మానవీయ సాహసాన్ని కవితగా చూపిన **వేణుగోపాల్...** పేజీ 45

పోలీసుల బాధ్యతను మన ముందుంచిన కథ **పోలీస్ వారియర్...** పేజీ 31

తెలంగాణ మహాకవికి **హరగోపాల్ శాసనాధార వివరణ...** పేజీ 35

చెదరిపోని మనస్సును పూయిస్తే అంటున్న **నవీన్‌రెడ్డి గజల్...** పేజీ 38

**పండుగ** పరిమళాన్ని చెప్పిన **శ్రీదేవి** కవిత... పేజీ 42

**ఇంకా...**

సాహితీశిఖరం, దృశ్యసాహిత్యం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

కవిత



# కలల కోయిల

**తుమ్మూరి రాంమోహన్ రావు**, 97015 22234

ఒక్క ఋతువుకై
ఐదు ఋతువుల నిరీక్షణ

వసంతం దాటి
శిశిరం వెళ్లేదాకా
దాని ఆనవాలు ఒక రహస్యం

అసలే సిగ్గరి
అందునా చీకటి దుస్తులు
ఎలమావి గుబురులో
కొత్త రాగాల మౌన సాధన

ఋతుపంచక ప్రాకృతిక పరిణామమంతా
అరుణచక్షువులలో నింపుకుంటూ
నిద్రాయోగం అనుభవిస్తూ
ఆమనికై కలలు కనే కోయిల

దాని కలంతా
వనం చివురించాలని
పుడమి పులకించాలని
ప్రకృతి పరవశించాలని
ప్రపంచం కళకళలాడాలని
అపుడు విశ్వరాగమాలాపించాలని

హంసలాగా
తెల్లని రెక్కలు లేకుంటేనేం
నెమలి లాగా పురివిప్పి తైతక్కలాడకుంటేనేం
పావురాయిలాగా ప్రేమ సందేశాలు మోయకుంటేనేం
పంచెవన్నెల చిలుకల్లాగా ముద్దుమురిపాలు
పంచకుంటేనేం

అది కృష్ణ పక్షికదా!
అమృతగీతాలాపన దాని కర్తవ్యం
గేహంలేదు దేహం కనిపించనీయదు
పిల్లా పీచూ బాదరబందీ పెట్టుకోదు
దాని దంతా రసరాజ్య స్వప్న లోకమే
అందుకే దాని వేదిక రసాలభూజం

సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-31 జనవరి, 2022

సంపుటి 02 సంచిక 06



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# ఒక సిరాచుక్క...

మహాకవి కాళోజి మాటలు వింటే పులకించిపోతాం. ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళ కదలిక అని చెప్పిన ఈ చిరువాక్యంలో ఎంత భావగాంభీర్యం, ఆపోశన, దాగి ఉన్నాయో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. ఈ మాట చూస్తే ఎలాంటి భాషాడంబరం గాని కృతకాలంకారాలు గాని కనిపించవు. కాని ఈ సరళ వాక్యంలో దాగిన గాఢత మనల్ని ఆశ్చర్యపరుస్తుంది.

అనుభవం పదబంధాలను అలంకారాలను మించినది. అనుభవం నుంచి వచ్చే మాటకు అలంకారాలు తోడైతే మరింత సౌందర్య స్ఫోరకమే. అట్లా కాకపోయినా ఆ మాట తన అర్థంతోనే మనల్ని కట్టిపడేస్తుంది. అనేక అర్థాల పద సముదాయం కాకుండా ఒకే ఒక అక్షరం కూడా అర్థస్ఫోరకంగా నిలిచిన సందర్భాలు మనకు కనబడతాయి. రమాకుమారుడు అంటే మన్మథుడు అని అర్థం. ఈ పదంలో ముందు నుంచి ఒక్కొక్క అక్షరాన్ని తొలగిస్తూ 'మా కుమారుడు', 'కుమారుడు', 'మారుడు', 'రుడు', చివరికి 'డు' అనే అక్షరానికి కూడా 'మన్మథుడు' అనే అర్థం ఉంది. ఒక్కోసారి అవసరాన్ని బట్టి ఊ, ఆ, హా లాంటి ఏకాక్షరాలనే వాడి మన భావాన్ని చెబుతాం. సందర్భాన్ని బట్టి ఇవి ఎంత గొప్ప అర్థాన్నిస్తాయో గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. తెలుగు వర్ణమాలలో మొదటి అక్షరమైన అ కు బ్రహ్మ, శివుడు, విష్ణువు అనే అర్థాలున్నాయని చెబుతారు. అట్లాగే ఈ ఊ అనే ఏకాక్షరాలు కూడా సందర్భాన్ని బట్టి అర్థవంతం కావడం మనం చూస్తున్నాం. క అనే ఒకే హల్లుకు అంతగా వ్యస్తప్రయోగం లేకపోయినా బ్రహ్మ, విష్ణువు, పక్షి, ఆత్మ, నీరు వంటి అర్థాలున్నాయి.

తెలంగాణలో అ, ఇ కి బదులుగా గా, గీ లాంటి ఏకాక్షరాలు భావ వినిమయానికి బాగా ఉపయోగపడతాయి. గా, గీ, గటు, గిటు లాంటి ప్రయోగాలు గ్రామ్యాలుగా కనిపించినా మన:కంపనాలకి సరైన వ్యక్తీకరణలుగా నిలిచాయి. గ్రామ్యమే పండిత భాషకు మూలమనే ప్రతిపాదన ఎలాగూ ఉన్నదే కదా.

ఇక కాళోజీ అల్పవాక్యంలో ప్రకటించిన అనల్పార్థ విషయానికి వస్తే సాహిత్యం లేక కవిత్వం శక్తిని చాటడానికి ఇదో తిరుగులేని ఉదాహరణ. ఫ్రెంచి ఉద్యమం, రష్యా, బోల్విక్ విప్లవం, భారత స్వాతంత్ర్యోద్యమం నిన్నమొన్నటి తెలంగాణ ఉద్యమం వరకు అక్షరం పాత్ర ఎంత స్మరించుకున్నా తరగనిది. ప్రాచీన లాక్షణికులు సృజనకారులను "కవీర్మనీషి పరిభూ:స్వయంభూ:' అని దైవంతో సమానం అని చెబితే ఆధునికులు కవులు ఎన్నుకోబడని శాసనకర్తలు అని నిర్వచించి కవి లేక సృజనకారుని మహాశక్తిని అంచనా వేశారు. కవుల చిరువాక్యాలు ఏకాక్షర సాధక అర్థాలు నుడికారాలుగా, సామెతలుగా చలామణి అవుతూ సామాజిక జీవనానికి పద నిర్దేశం చేస్తున్నది తెలిసిందే.

తన భాషా పాటవాన్ని సమాజోపయోగకరంగా మార్చగలిగేవాడు సృజనకారుడు. సృజనకారుని స్థాయికి ఎదిగిన పాఠకుడుంటే సృజన, దాని అల్పవాక్యాలలో ఏకాక్షర ప్రయోగాలలో దాగిన శక్తిని అంచనా కట్టి దారి దీపం కాగలుగుతాడు.

జై తెలంగాణ - జై జాగృతి...

కవిత కల్వకుంట్ల

కవిత

# నా పేరు మనిషి



డా॥ టి. రాధాకృష్ణమాచార్యులు, 98493 05871

నా పేరు మనిషి
బహు నామాలతో పిలుస్తారు నన్ను
నన్ను చూసే చోటూ, పనితో కలిపీ

పచ్చని అడవిలో
ఆకూ అలము నన్ను
చుట్టేసుకుంటే
ఆటవికంగా కనులు కట్టేసి చూస్తే

అప్పుడు నా పేరు అడవి మనిషి
నీలి నీలి మేఘంలో
మెరిసి కురిసే వాన నన్ను

తాకితే
కనుల విందుగా చినుకు సెగలైతే
అక్కడ నా పేరు వాన మనిషి

అందాల వాసన మట్టితో
బంధాలు అల్లుకున్న నన్ను పిలిచే
చేతులు పట్టిన కొడవలి గడ్డి కోస్తే
అదే అక్కడ నా పేరు పొలం మనిషి

మజాగా నాజూగ్గా చెక్క బల్లతో
అక్షరతీగలు నన్ను గట్టిగా పట్టితే
బలపమో, సిరా కలమో వాక్యమైన
అప్పుడు నా పేరు చదువు మనిషి

సుందర కవితగానో, కథగానో
చిత్తు కాగితం
ముడతల్లోపుట్టే నేను
వివిధ పత్రికల్లో అవి
అచ్చులో వస్తే
అప్పుడు నా పేరు సృజన మనిషి

కన్నీళ్ళే పని పనికీ రాలిన కష్టం
చెమట వాసనలో కృషి రాసే కావ్యం
విలువలు నేర్పిన
వృత్తులన్నీ జీవిస్తే
అప్పుడు నా పేరు విలువల మనిషి

అనంతమైనది దిగంతాల వ్యాపించిపోతే
అమూల్యమైనది హద్దులన్నీ చేరిపేస్తే
అనూహ్య ఊహల్లో భావ స్వేచ్ఛ ప్రోదిచేస్తే
అప్పుడు నా పేరు కవన యానంలో మనిషి

నాటి కథ

# చెరువొడ్డున

**మతాలు మానవులకు చీలిక తెస్తున్న వైనం చెప్పిన కథ...**



కాంచనపల్లి చిన వెంకట రామారావు

ఈ యేడు చెర్లోకి నీళ్ళు ఐదడుగులే వచ్చినై. ఉన్న భూములు యే విధంగా సాగు కావాలన్న ఆలోచన ప్రతి రైతు మెదట్లో మెసులుతున్నది. ఈ యేడు పంటలు పండకుంటె ముందుకు కరువు... లెవీ ఖుష్ ఖరీదు గల్లాలు పోగా యెవనింట్లో గూడా కారుకు సరిపోయె గింజలు కూడా మిగులవు. యెటుబోయి అందర్నీ దేడ్నాగిచ్చి పోషించవలసిన భారం రాంరావు దొరవారి వారిదే.

ఉన్న ఐదు యెకరాల పారకంలో రాంరావు దొరవారి మూడు యెకరాల కెట్లయినా నీళ్ళు ఇవ్వవల్సిందే. అది మాత్రం తప్పదు" అన్నాడు లతీఫ్ నెత్తి గోక్కుంటూ.

యేట పదడుగుల నీళ్ళు వస్తుండబట్టి వారి భూములకు అవి యెక్కడున్నా నీళ్ళు బెట్టితే ఎవరికేమనిపించలేదు. కాని యీ యేడు నీళ్ళు ఐదడుగులే వున్నై" అన్నాడు పెద్ద రైతు వెంకయ్య.

"దొరవారి సగం భూములు సేద్యమయితే తక్కిన పొలాలకు నీళ్ళు దొరుకుతవన్నాడు?" రెండెకరాల యినాంలో పదో పాలు చాకలి రామడు.

"పిల్లి మెళ్ళో గంట యెవరు గట్టాలె దొరవారిని సగం భూములే సేద్యం చేసి మన సగం భూములకైనా నీళ్ళు చాలేటట్లు చెయ్యమని యెవరడుగాలే?" అన్నాడు పెద్ద మాదిగ ముత్తయ్య.

ఆ సంగతె తేలాలలన్నారు చెరువొడ్డున గూర్చున్న రైతులంతా.

దాత సంవత్సరం మానేటి కరువులో ఉన్న కాస్త నీళ్ళు దొరవారి పొలాలకే పెట్టినాం. వెనుకటి నుంచి వారి పొలాలు పారినాక తక్కినవారి పొలాలు పారటం రివాజు. కరువుకైనా కాలానికైనా ఆదుకుంటున్నాడు ధర్మప్రభువు. దాత కరువులో తిండిగింజలిచ్చి బ్రతికించిందా మారాజే' అన్నాడు... కోటయ్య.

పోయిన మన పెండ్లాల పుస్తెలు ఇచ్చిన రూపాయికి సేరు బియ్యం మరిపించలేవన్నాడు.' ఒక మూలనున్న ముసలి రైతు.

'ఇంక సాగుచేసే కాలమే రాలేదు. ఇప్పుడేం తొందర' అన్నారు అందరిని సర్దుకపోవటంలో ఆరితేరిన సర్వయ్య వగైరాలు. వీళ్ళిటు రైతులకు, అటు గ్రామాధికార్లకు మంచిగా వుంటూ ఏ ఎండకా గొడుగు పట్టటంలో ఘనులు.

ఈ సంగతి చిన్నగా గడిలోకి పాకింది. దొరవారి సేరిదారు వెంకయ్య లతీఫ్ వగైరాలను సంప్రదించడానికి వచ్చాడు. 'ఈ యేడు దొరవారి పొలాల విషయం తాతల నాటి నుండి వచ్చే రివాజుకు వ్యతిరిక్తం జరుపదలిచినట్లు దెలుస్తున్నది యేం సంగతి' అన్నాడు.

ఉన్న రివాజు నుల్లంఘిస్తే ఏం చిక్కో గ్రామ దేవతలకు కోపం వస్తుందేమో. దాని వల్ల గత్తర, అమ్మతల్లి రావచ్చుననన్న అనుమానాలు బుట్టినై. ఆ యనుమానాలను వృద్ధులు బలపరిచారు. పెండ్లి చేసినాడు దొరవారి మామూలు (కట్నం) ఐదు రూపాయలు పంపించక పోయేసరికి పాల్గొనే ముండమోసిన వెంకయ్య బిడ్డ సంగతులు యింకా ఇటువంటివెన్నో విషయాలు ముందరబడ్డయి. కాని రైతులంతా ఏమైనా కానీ యీ యేడు న్యాయం ప్రకారం తమ పొలాలు పారకంలో చేరాల్సిందే అని నిశ్చయించుకున్నారు. ముఖ్యంగా తమ అందరితో లేవీ ఖుష్ ఖరీదు పడేక గల్లాలు పోయించి తనొక్క గింజ కూడా పొయ్యకపోవటం, వచ్చిన లేవీ వగైరా డబ్బును సేల్సు సొసైటీ షేర్సు కింద ముజరా పెట్టించి షేర్ల తన పేర కొనుక్కోవటం, షేర్ల కింద పోగా మిగిలిన డబ్బును మింగి కూర్చోవటం, అడిగినా ఇవ్వకపోతే ఈ సంగతులు దెల్పుతూ ఇచ్చిన దరఖాస్తుల కింతవరకూ అతీగతి లేకపోవడం కండ్ల ముందాడినై. తిండి గింజ లెవ్వరి దగ్గరా లేనిది చూచి రూపాయికి నాల్గు సేర్ల ప్రకారం ధాన్యమమ్మిన దొరవారి దయ యింకా బాగా హెచ్చరించింది. తమ పొలాలు సేద్యం కాకపోతే పచ్చి కరువు తాండవమాడ్తుందన్న భయం రివాజును సేరిదారు మాటలను లక్ష్యపెట్టనివ్వలేదు. వీళ్ళంతా కట్టగట్టి ఒకటైనారు. సరె

మంచిది చూచుకుందాంలే అని మీసం మెలేసినారు దొరవారు.

2

ఉపాయాల మీద ఉపాయాలు ఊహించాడు. ఊరుకుంటాడా, లేకుంటే? ఈ యేడు తాననుకున్న ప్రకారం చెర్వు నీళ్ళు పారకపోతే కొన్ని వేల రూపాయల నష్టం వస్తుంది. రైతు ముండా కొడుకులు బలిసిపోతారు. ఆలోచించి, ఆలోచించి లతీఫ్‌సా అన్న కొడుకు హసనల్లీ మీదకు మీదికి దృష్టిపోయింది. హసనల్లీ చిన్నగా అటిటుబడి చదువుకొని మజ్లిస్ సంస్థ తరఫున ప్రచారకుడుగా పనిచేస్తున్నాడు. మజ్లిస్ అధ్యక్షుడు ఖాజీ షర్ఫుద్దీన్ సాహెబు. ఈయన పెద్ద జాగీర్దారు కూడా.

హసనల్లీ ఊళ్ళో మాల మాదిగలను మతం మార్పించినాడు. దొరవారి వెట్టి వగైరా బందు చేయించి తానే దొర ఐనాడు. ఇందువల్ల ఎంతో నష్టపడ్డ దొరవారు రైతులతో కట్టు గట్టించి మతం మార్చుకున్న వాళ్ళతో పని తీసుకోకుండా చేసినాడు. మతం తిండి బెట్టం మానుకొని ఉన్న కూట్లో మన్నుబడే స్థితి వచ్చింది. హసనీల్ల మాట ఎవరూ వినలేదు. పాపం హసనల్లీకి ఊరు విడిచి వెళ్ళిపోయేదాకా పరిస్థితులు విషమించినై. ఈ మధ్యలో ఖాజీసాకు రాంరావుగార్కి కత్తులు కత్తులు దెగేటంత పనైంది. చివరకు రాజీ ఐంది. ఖాజీసా హసనల్లీని వాపసు పిలిపించుకునేటట్లు, రాంరావుగారు ఖాజీసా జాగీరు రైతులను వెంటేసుకొని బందోబస్తుకై సర్వే చేసిన పైరవీ వదులుకునేటట్టు ఒడంబడికలు చేసుకున్నారు. ఒకళ్ళ రైతుల కొకళ్ళు ఉసికొల్పకుండా ప్రశాంతంగా తమ హుకూమతు సాగించుకునేటట్లు ఆపత్కాలంలో పరస్పరం సాయం జేసుకునేటట్లు గూడా షర్తులు జరిగినై. ఈ విధంగా ఒకానొకనాడు వెనకటికి కొండంత కథ ముగిసింది. కాని యివాళ హసనల్లీ అవసరం పడ్డది పిలిపించు కున్నారు దొరవారు హసనల్లీ రావడమే ఆలస్యం ఒకడొకడుగా తనవాళ్ళను చీలదీసేడు. ఇదంతా మీకెందుకు మీ భూములకు నీరొచ్చే ఏర్పాటు నేను చేస్తాను. తక్కిన రైతుల సంగతి మనకవసరం లేదు. మనతో మాత్రం దొరవారు విరోధం పెట్టుకోరు. ఎందుకంటే కింది నుంచి మీది దాకా అంతా మనవాళ్ళే. అధికార్లు, మా మజ్లీస్ సదరు అధ్యక్షుడు సా॥ మంత్రి పేషి మున్షీకి పి.ఏ. దగ్గరి చుట్టం. ఖాజీసాతో సిఫారసు చేయించితే దొరకు తగిన శిక్ష అవుతుంది. అన్ని కచేరీలల్లో పలుకుబడి గల మన మజ్లీస్ వకీళ్ళున్నారు. మజ్లీస్ ద్వారానే మన బ్రతుకు వాళ్ళ బ్రతుకు కూడా. మనం యేలికలం గులాములతో కలుసుకుంటే గులాములమే ఐపోతాం. ముందు శాసనసభకు మీ దొర మా ఖాజీ సా॥ రైతుల ప్రతినిధులుగా ఎన్నికైపోతారు. ఎన్నిక కాకపోతే ఇంకెట్లనన్నా వాళ్ళు అక్కడికి పోతారు. అప్పుడు మీ కోసమని ప్రత్యేకంగా ఖానూన్‌లు తయారు జేయించుతా. ఎక్కడికి పోయినా మన వాళ్ళడిగినంత మందున్నరు. అని తలాతోకాలేని సంగతులు దొరవారి దగ్గర తిన్న డబ్బు హలాల్ గావటానికి బోధించాడు. కండ్లకు



ప్రత్యక్షంగాని దొంకతిరుగుడు సిద్ధాంతాలు ఇవేమి తెలిసినా తెలియకున్నా చడీ చప్పుడు లేకుండా తమ పొలాలకు నీళ్ళు దొరుకుతాయన్న విశ్వాసం వారి నోరు పడేసింది. అనవసరంగా ఊరి పంచాయతీ తమకెందుకు యెవని చెయ్యి వాడు కడుక్కుంటే చాలుననుకున్నాడు. హసనలీ గొప్ప దేవుడైపోయాడు అటు దొరవారికీ ఇటు వీళ్ళకూ, ఎన్నడూ లేనిది బక్రీద్ పండగకు వెట్టి బక్రాలు (మేకలు) వసూలైనై. దొరవారనుగ్రహం వల్ల ఎన్నడూ పీర్ల సవారీలు అసోయి దూలా అని ఆడ వచ్చిన రైతులను, జీతగాళ్ళను తరిమి వేశారు. వాళ్ళ స్థానంలో ఖాజీసా బృందం తయారయింది. ఊళ్ళో ముస్లీములు 'ఇదేమన్యాయం మా వూళ్ళో మేమంతా కలిసి పీర్ల పండుగ జేసుకుంటాము. వాళ్ళ పండుగలు కూడా మేమంతా కలిసి చేసుకుంటాం' అని యెదిరించినా హసనల్లీ ఖాజీ సా॥ బృందం కుల తప్పు బెడ్తామని దబాయించి నోరు మూయించారు.

3

రైతులంతా అనుకున్న ప్రకారం చెరువు తూములు దియ్యడానికి పోతున్నారు. లతీఫ్ వగైరాలను రమ్మన్నారు. హసనలీ చేసిన తెరచాటు రాజీ వున్నది. కనుక దొరవారికి వెనకటి నుంచి వస్తున్న హక్కులో దఖలియ్యటం మంచిది కాదు. ఊరు కట్టు తప్పిపోతుంది. ఇవాళ ఒకనాటి మాట గాదు. ఈ రివాజును తప్పించిన మనం, ఇంకో రివాజును తన్ని పారెయ్యటానికి తయారైతం భూమి పుట్టినప్పట్నుంచి, రాజ్యం పుట్టినప్పట్నుంచి వున్న రివాజులు దేవుడేర్పాటు చేసిన ధర్మాలతో సమానం. అవి యెప్పట్టోలిగే సాగవలసిందే అని వాదించి హసనల్లీ చెప్పిన పాఠం సరిగ్గా అప్పగించారు. వీళ్ళు రంగు దిప్పటంతో తక్కిన వాళ్ళకు మాత్రం ఆశ్చర్యం కాలేదు. ఏమైనా కాని మేం మాత్రం పోయి నీళ్ళు బెట్టుకుంటాం. మమ్ముల తిండికి మాడ్చి చంపే రివాజును మేమెందుకు మన్నించాలె? ఇది మా చావు బ్రతుకుల సంగతి. ఈ రివాజు ఈనాటితో పూర్తిగా హతం కావలసిందేనన్నారు. తక్కిన రైతులు. ఈ సంగతి గడిలోకి పాకింది. హసనల్లీకి తెలిపారు దొరవారు. పొలిమేర మీద వున్న ఖాజీ సా॥కు కబురు పోయింది. వెళ్ళిన హసనల్లీ లతీఫ్ వగైరాలను కూడగొట్టి మనం జేసుకున్న రాజీ ప్రకారం మన దోస్తుకు సాయం చెయ్యాలన్నాడు. ఏం సాయమన్నారు విన్నవాండ్లంతా. నీళ్ళు బెట్టుకునేవాండ్లను రొకాయించాలె, దొర మనుషులతో పాటు మనం కూడా గుతుపలేసుకొని పోవాలె. వాండ్లు నీళ్ళు బెట్టుకోకుండా ఆపితే, దొరకూ ఆయనతోబాటు మీకు నీళ్ళు దొరుకుతాయి. పెరుగన్నం బట్టి ప్రమాణం చేసిన దొర మాటలు నమ్మి ఆయనకు సాయం చెయ్యాలె" అన్నాడు. హసనల్లీ. వెంకయ్య వగైరాలంతా వినేటట్లు లేదు. ఈ యేడు భూములు సేద్యం కాకపోతే పచ్చి కరువొస్తుంది. కిందటేడు రసల్ గిర్దావరు (ఫుడ్ ఇన్‌స్పెక్టర్) దావ్యామా అందరిండ్లలో ధాన్యం ఊడ్చించి తన ఇంట్లో మిగిలిందనుకున్న ధాన్యం రూపాయికి నాల్గు సేర్లమ్మితే కొనలేక కష్టాలు పడ్డాము. వాండ్లు మోరు దోపితనానికి దిగితే కొట్లాటవు తుంది ఏం చెయ్యాలన్నారు లతీఫ్.

'ఒక్కొక్కణ్ణి వట్టి నరకాలె' అన్నాడు హసనలీ. ఒక చంకనున్న ఖురాను, ఒరలో ఉన్న కత్తి ఊగిపోయాయి. ఇంట్లో గూచొని మన తలకాయలు గోయించి తన పొలాలకు నీళ్ళు బెట్టుకుంటారు దొర" అన్నాడు గఫూర్. 'అవును' అన్నాడు లతీఫ్.

'అవును మేమందరం బ్రతికి వస్తే గదా మా పొలాలకు నీళ్లేసేది' అన్నారంతా.

హసనలీ గిప్పన మైకం విడిపోతుండే సరికి మధ్యన అందుకున్నాడు. మనం సిపాయిలం. మనను చూస్తేనే భయపడి పోతారు. కొట్టుకునేటంత పనిగాదని యుద్ధరంగంలో అర్జునుని కోసం కృష్ణుడు పడ్డంత కష్టపడ్డాడు. చివరకు అంతపని గానివ్వనని చంకలో పుస్తకం ముట్టి ప్రమాణం చేశాక గాని నమ్మకం కుదరలేదు.

లతీఫ్ వగైరాలను రమ్మన్నారు. హసనలీ చేసిన తెరచాటు రాజీ వున్నది. కనుక దొరవారికి వెనకటి నుంచి వస్తున్న హక్కులో దఖలియ్యటం మంచిది కాదు. ఊరు కట్టు తప్పిపోతుంది. ఇవాళ ఒకనాటి మాట గాదు. ఈ రివాజును తప్పించిన మనం, ఇంకో రివాజును తన్ని పారెయ్యటానికి తయారైతం భూమి పుట్టినప్పట్నుంచి, రాజ్యం పుట్టినప్పట్నుంచి వున్న రివాజులు దేవుడేర్పాటు చేసిన ధర్మాలతో సమానం. అవి యెప్పట్టోలిగే సాగవలసిందే అని వాదించి హసనల్లీ చెప్పిన పాఠం సరిగ్గా అప్పగించారు.

4

పొరుగూరి ఖాజీసా॥ కబురందటమే ఆలస్యంగా వేంచేశారు. గలా మిలాయించు కున్నారు దోస్తులిద్దరూ. కచేరీ వ్యవహారాలు వదులుకున్నప్పటి నుండీ కలిసింది ఈనాడే.

"మీ కాపద వచ్చిందంటే వుండలేకపోయినా" నన్నాడు ఖాజీసా॥

"లంజకొడుకులకు గట్టి పాఠం చెప్పాలె. ఇవాళ మా దగ్గరి రివాజు పోతే రేపు మీ జాగీర్లో కూడా రివాజులన్నీ బందైపోతై" అన్నాడు రాంరావుగారు.

"పోలీసుల సాయమెందుకు పిల్పించలేదు"

ఈ మామ్లాలో పోలీసులకు జోక్యం కల్గించుకొనే వీల్లేదు. ఖానూనులున్నాయి అని గడగడా తన ఖనూన్ (లా) పాండిత్యమంతా గస్తీలు మురాసి లాల యుక్తం గుమ్మరించారు రాంరావుగారు.

పదేండ్ల నుంచి పైరవీకారీ చేస్తుంటే ఇంతమాత్రమైనా పట్టుబడకపోతే యేమన్నమాట.

నాటి కథ

'అజీ మారాజ్ డబ్బు బారేస్తే అంతా ఖానూనే కొండమీది కోతి దిగివస్తుంది. రెండు వేల రూపాయలట్టా బారెయ్యండి నేను బోయి రిజర్వు పోలీసులనే బట్టుకొస్తా. పోలీసుల్లో పెద్ద అధికారి మా షడ్డకుని బావమరిది దగ్గర చుట్టం'.

"సిఫారసులు దేవటంలో మీ ప్రజ్ఞ నాకెరికే. కాని యిప్పుడంత అవసరమేం లేదు. మన చేతగాకపోతే గదా పోలీసుదాకా పోవటం' అని సర్దినాడు రాంరావుగారు.

బిర్యానీ తయ్యారయిందన్న వార్త వచ్చింది లోపల్నుంచి రైతులు తూములు దీస్తున్నారన్న వార్త వచ్చింది బయటినుంచి హసనలీకి సైగ అయ్యింది. ఖాజీసా॥ బలగం లతీఫ్ వగైరాలతోపాటు తయారైయ్యాడు హసనల్లీ. మూడు జాడీల దేశీ సారా, ఆరు మేకలు అంతకుముందే హతమైనై. ఖాజీసా॥ దొరవారి కోసం వెలగల విదేశీ సారాలు లోపల యెదురుచూస్తున్నాయి. వాళ్ళటూ, వీళ్ళిటూ ఎవళ్ళ డ్యూటీకి వాళ్ళు పోయారు.

5

శత్రుపక్షంలో వున్న లతీఫ్ వగైరాలను తూచారు రైతులు. ఎంగిలి మెతుకుల మహత్యమన్నారు కొందరుండలేక, హసనలీ అన్నాడు తూములు దియ్యవద్దు దగ్గరికి బోతే కొబ్బరికాయలు పగిల్నట్లు తలకాయలు పగుల్తయని గోగ్గారకచాలు గోసినట్లు తలకాయలు గోస్తనని కత్తి జూయించారు. ఇన్నాళ్ళకి రైతులు కారుకష్టాలనుభవించి అనుభవించీ సంప్రదాయాల కుళ్ళు మడుగులో ముక్కులుచిబ్బిళ్ళు పడి ఉక్కిరిబిక్కిరై బాధపడలేక సంకెళ్ళను దెంచుకోవడానికి సిద్ధమైనారు. పచ్చి కరువు వస్తుందన్న భయం యిదివరకు దొర గల్పించిన కటిక చీకట్లు మరిచిపోలేదు. ఈ రివాజులు హతమైతే మానవుల వలె బతుకుతాం. లేకుంటే అట్లైనా చావే ఇట్లైనా చావే యేదో ఒకటి తేల్చుకుందామనుకున్న రైతులు ఉత్త కత్తి జూపుల్లకే భయపడే కాలం పోయింది.

**ఇన్నాళ్ళకి రైతులు కారుకష్టాలనుభవించి అనుభవించీ సంప్రదాయాల కుళ్ళు మడుగులో ముక్కులు చిబ్బిళ్ళు పడి ఉక్కిరిబిక్కిరై బాధపడలేక సంకెళ్ళను దెంచుకోవడానికి సిద్ధమైనారు. పచ్చి కరువు వస్తుందన్న భయం యిదివరకు దొర గల్పించిన కటిక చీకట్లు మరిచిపోలేదు. ఈ రివాజులు హతమైతే మానవుల వలె బతుకుతాం.**

'ఖాజీ సా॥ కుక్క మొరుగుతున్నదిరా' అన్నాడెవరో ఒక మూల నుంచి. ఈ కుక్కను చెరువు తూములు గాయటానికి కిరాయకు దెచ్చుకున్నాడురా మన దొర అన్నాడింకెవరో.

'రెండు తంతేసరి కుయ్యం కుయ్యమని తోక ఝూడిస్తుంది' ఇంకెవరో అన్నారు.

తూములు దియ్యనే తీశారు. నీళ్ళు రయ్యిమని కట్టలు దెంచుకొని పారుతున్నాయి. హసనల్లీ వీరావేశముతో కత్తి దిప్పుకుంటూ వెంకయ్యను నరకటానికురుకుతున్నాడు. రైతుల్లో నుండొకడు కర్ర గురి చూచి కొట్టాడు. హసనలీ మణికట్టుకు బలమైన దెబ్బ తగలింది. చేతి కత్తి వూడి గఫూరుకు తగిలింది. ఎగిరి గంతెయ్యబట్టి గాని లేకుంటే కాళ్ళు రెండూ తెగిపొయ్యేవే. ఉభయపక్షాలు యుద్ధానికి దిగినై. కొట్టుకోటంలో ఊరి రైతు లతీఫ్ తల బగిలింది. ఇటు నెత్తురుబారుతున్నది. అటు నీళ్ళు బారుతున్నాయి. గఫూరు చేతిలో కర్ర పారేసి లతీఫ్ తల బట్టుకున్నాడు. ఇదే అదునని ఇంకో కర్ర గఫూరు మీదికి లేచింది. ఆగండి, ఆగండి అని అరుస్తున్నాడు గఫూరు, ఆపండి పాడు కొట్లాట' అంటూ వెంకయ్య గఫూరు మీద పడబోయే కర్రకు అడ్డంబెట్టి తప్పించాడు. లతీఫ్ దగ్గరికి పోయిన వెంకయ్య తన నెత్తి రుమాలు దీసి కట్టుగట్టాడు. నెత్తురు దర్శనంతో అందరికీ దిమ్మ దిరిగి దిగాలుపడి చూస్తున్నారు. గఫూరు కంట నీరుబెడుతూ 'ఎవరి కోసమని మన లతీఫ్ తల బగిలినట్లు' అన్నాడు. 'మనకు కరువు దెచ్చి పెట్ట చూచిన దొర కోసం' అన్నాడు వెంకయ్య. అంతా అవునంటే అవునన్నారు. ఇంకా మైకం వదలని ముస్లిం రైతులు ఏమనకుండా నిర్విణ్ణులై చూస్తున్నారు.

గఫూరందుకున్నాడు : 'మొన్నటిదాకా కొట్లాడుకున్న ఖాజీసా' రాంరావు లొక్కటైనారు. నిన్నటిదాకా కలిసివున్న మనం పగోండ్లమైనాం. ఇదంతా హసనలీ గాడి మాయ. మాట్లాడరేంరా గాడ్దులు' అన్నాడు వెంకయ్య. "ఖాజీ సా॥ దొరలిద్దరు ఒక్కటైనారు. వాళ్ళకు మతం అడ్డురాలేదు. బతుకుదెరువాలోలించుకుంటే మతం మనలో చీలికలు దేవడానికని వచ్చింది" అన్నాడు గఫూరు.

మూల్గుతూ లతీఫందుకున్నాడు. 'దొరది, హసనల్లీగానిది, కాజీ సా॥ ది వీళ్ళందరిదీ ఒక మతం. నాదీ, వెంకయ్యదీ, మన అందరిదీ ఒక మతం. వాళ్ళది దోపిడీ మతం. మనది బతుకుదెరువు మతం'. 'తన్నండి హసనల్లీగాణ్ణి' తన్నండి అంటే తన్నండి అన్నారు. ఊరు గుతపలన్నీ ఒక్కటై దొరల బలగం మీదికి లేచినై. ఈ సంగతి మొదటే ఊహించుకున్న హసనల్లీ మొదటి దెబ్బకే దేవేంద్రలోకం బోయినంత పనై, చెట్ల చాటుకు నక్కి పరారైనాడు. ఈ సంగతంతా చూస్తున్న ఎదురు బలం గుతుపలు పారేసి దండాలు బెట్టి బతిమిలాడుకున్నది. రైతులందరి మళ్ళకు నీళ్ళు బారినై. అందరికీ బాగా పంటలు పండినై. ఈ యేడు కరువు వాసనగూడా రాలేదు. అందరికీ బాధ గల్పించిన రివాజు హతమై రూపుమాపింది 'చెరువొడ్డున'.

**(మన వూళ్ళో కూడానా...?! కథల సంపుటి నుంచి)**

వ్యాసం

# అనువాదాల అవసరం, అనువాదాలకు ఆదరణ

**అనువాదాల ప్రచురణకు ఆర్థిక వనరుల అవశ్యకత తెలియజేసే వ్యాసం...**



ఎలనాగ
98669 45424

ప్రపంచీకరణ నేపథ్యంలో చాలా పరిణామాలు సంభవించి, అన్ని రంగాల తీరుతెన్నులు మార్పునకు లోనయ్యాయి. ఇవాళ ప్రపంచం ఒక చిన్న గ్రామం. అందులోని ఒక వాడ నుండి మరొక వాడకు చేరుకునేందుకు, సమాచారాన్ని చేరవేసేందుకు మునుపటిలాగా ఎక్కువ సమయం పట్టదు. ఈ పరిస్థితికి అనుగుణంగా మారకుండా ఉండేందుకు సాహిత్యానికి మినహాయింపేమీ లేదు. కాబట్టి, అందులోని ప్రాథమ్యాలను కూడా మనం చర్చించుకోవడం అవసరం. ఇది అనువాదాల యుగం కాబట్టి, అనువాదాల గురించి మాట్లాడుకోవడమూ ముఖ్యమే.

అనువాదాల గురించి మాట్లాడు కోవాల్సివస్తే, టి. హెచ్. గ్రిఫిత్ అనే ఆంగ్ల పండితుడు 1889-99ల మధ్య వేదాలను అనువదించాడు. అదేవిధంగా రామాయణాన్ని కూడా తర్జుమా చేసి 1870లో ప్రచురించాడు కె.ఎమ్. గంగూలీ అనే భారతీయుడు మహాభారతాన్ని ఆంగ్లంలోకి అనువదించాడు. ఎమ్. ఎన్. దత్ అనే మరో భారతీయుడు భాగవతాన్నీ, విల్కిన్స్ అన్న ఆంగ్లేయుడు భగవద్గీతనూ అదే భాషలోకి అనువదించారు. ఇక కాళిదాసు రచనలకు సర్ విలియమ్ జోన్స్, హాస్కర్‌లు ఆంగ్లానువాదం చేశారు. ఇంకా, విష్ణుశర్మ రచించిన పంచతంత్రాన్ని ఆర్థర్ విలియమ్ రైడర్ ఇంగ్లిష్‌లోకి తర్జుమా చేశాడు. పదమూడవ శతాబ్దంలో పాల్కురికి సోమనాథుడు రచించిన బసవపురాణాన్ని భీమకవి కన్నడంలోకి భాషాంతరీకరించాడు. అది మంచి ఆదరణను, విజయాన్ని పొందింది. దాన్ని పండితులు మెచ్చుకున్నారు. అంతే కాకుండా మరికొందరు తెలుగు కవులు మరిన్ని తెలుగు రచనలను కన్నడంలోకి అనుదించేందుకు అది ప్రేరణనిచ్చింది. ఈ బసవపురాణాన్ని సి. పి. బ్రౌన్ ఆంగ్లంలోకి అనువాదం చేశాడు. ఈ అనువాదాలన్నీ జరగకపోతే మన తెలుగుభాష గొప్పతనం గురించి, తెలుగు సాహిత్యపు గరిమ గురించి, తెలుగు సంస్కృతి ఔన్నత్యాల గురించి ప్రపంచానికి అంటే ఇతర దేశాలకు, ముఖ్యంగా పాశ్చాత్య దేశాలకు తెలిసివుండేదా? తెలిసివుండేది కాదు. కాబట్టి, అనువాదాలు గొప్పవి.

కవిత్రయం, గోన బుద్ధారెడ్డి, బమ్మెర పోతన వీళ్ల మహాభారత, రామాయణ, భాగవతాలను సంస్కృతంనుండి తెలుగులోకి అనువదించడం మంచిదయింది. ఆ పని జరగడం మన అదృష్టం. ఎందుకంటే, అది జరగకపోయివుంటే ఆ గ్రంథాలను మనం తెలుగులో చదవగలిగేవాళ్లం కాము. అవి సంస్కృతంలోనే ఉండేవి. అటువంటి సంస్కృత గ్రంథాలను చదివి పూర్తిగా అర్థం చేసుకోగలిగే శక్తిసామర్థ్యాలు మనలో ఎందరికి ఉన్నాయి? వందమందిలో ఒక్కరికి కూడా లేవు! కాబట్టి అనువాదాలు ముఖ్యమైనవి.

ఇక అనువాదాలు ఒక ప్రాంతపు సరిహద్దులను భాష పరంగా, సంస్కృతి పరంగా విస్తరింపజేస్తాయి, లేదా వెడల్పు చేస్తాయి. భౌగోళికమైన, రాజకీయమైన సరిహద్దులు మనకు కొన్ని ఉండవచ్చు గాక. కానీ, మన రాష్ట్రంలో లేదా దేశంలో అనువాదాలు విరివిగా జరిగితే, మన భాష గురించీ సంస్కృతి గురించీ ఇతర ప్రాంతాల వారికి తెలుస్తుంది. ఇది చిన్న విషయమా? కాదు, ప్రాధాన్యాన్ని సంతరించుకున్న విషయం. కాబట్టి, అనువాదాలు గొప్పవి. ప్రాచీన కాలంలో సంస్కృతం నుండి తెలుగులోకి వచ్చిన రచనలు దాదాపు అన్నీ అనుసృజనలే! తెలుగులో స్వతంత్ర రచనలు వచ్చేందుకు చాలా కాలం పట్టింది.

తెలుగు సాహిత్యరంగంలో ఇప్పుడు అనువాదాల పరిస్థితి ఎలా ఉన్నదో చూద్దాం. ప్రాచీనకాలం నుండి నేటివరకు ఇతర భాషల నుండి ముఖ్యంగా ఇంగ్లిష్ నుండి తెలుగులోకి తర్జుమాలు ఎన్నో జరిగాయి, ఇప్పుడు జరుగుతున్నాయి, భవిష్యత్తులో కూడా జరుగుతాయి. ఈ విషయంలో మనకు సమస్య గానీ చింతించాల్సింది గానీ ఏమీ లేదు. అంత మాత్రాన ఆ పని ఆగిపోవాలని అనడం లేదు. ఇతర భాషల నుండి తెలుగులోకి

వ్యాసం

తర్జుమాలు ఎప్పటికీ జరుగుతూనే వుండాలి. అప్పుడే మన సాహిత్యం నిరంతరం పరిపుష్టం అవుతూ వుంటుంది. మనకు ఉన్న పెద్ద సమస్య తెలుగు నుండి ఇతరభాషలలోకి జరుగుతున్న, లేదా జరగాల్సిన అనువాదాల సంఖ్య గురించే. అది అతితక్కువగా ఉండటం ఎంతో నిరాశను, దిగులును కలిగిస్తున్నది. ఈ విషయంలో పొరుగు రాష్ట్రాలతో పోల్చి చూసుకుంటే మనం చాలా వెనుకబడి వున్నాం. తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ మొదలైన ఇతర దక్షిణభారత భాషలలోంచి రచనలు ఆంగ్లంలోకి ఎక్కువగా వెళ్లాయి. మన తెలుగుతో పోల్చి చూసుకుంటే స్వతంత్ర రచనలు, అనువాద రచనలు కలుపుకుని ఒక తెలుగు పుస్తకాలు వేయి ప్రతులు అమ్ముడు కావడం ఎంతో గగనం ఈ రోజుల్లో! అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. మరాఠీ పుస్తకాలు పదివేల ప్రతులదాకా అమ్ముడవుతున్నాయట! తెలుగువారిలో పుస్తకాలను కొని చదివే అలవాటు ఎక్కువగా లేకపోవడం నిజంగా చాలా దురదృష్టకరమైన విషయం. కాబట్టి, తెలుగునుండి ఆంగ్లంలోకి అనువాదాలు పెద్దసంఖ్యలో జరగాల్సిన అవసరముంది. కానీ జరగడం లేదు కనుక, విచార పడవలసిన పరిస్థితి.

ఈ విషయంలో ఈ మధ్య కొంత మెరుగుదల సంభవించి, పరిస్థితి ఒకింత ఆశా జనకంగా కనిపిస్తున్నదని చెప్పవచ్చు. అదేమంటే, మూడు నాలుగు దశాబ్దాల క్రితం తెలుగునుండి ఆంగ్లంలోకి అనువదించగలిగేవాళ్లు చాలా తక్కువగా అంటే చేతివేళ్ల మీద లెక్క పెట్టగలిగినంత మంది మాత్రమే ఉండేవారు. కానీ ఇప్పుడు పదిహేను, ఇరవై మంది వరకు ఉండవచ్చు, రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుకుని చూస్తే. వారంతా ఈ వ్యాసరచయితను కలుపుకుని తమ తమ అనువాద నైపుణ్యాన్ని మరింతగా పెంచుకునే అవకాశం ఉంది.

ఇక మరో ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే, తెలుగులో అనువాదాలకు




ఆదరణ వుందా అని. ఈ ప్రశ్నను రెండు విధాలుగా పరిశీలించి జవాబు చెప్పవచ్చు. పాఠకుల నుండి ఆదరణ అన్నది ఒకవిధమైతే, ప్రచురణసంస్థల నుండి ఆదరణ అన్నది రెండవది. అట్లా చూసినప్పుడు, పాఠకుల నుండి ఆదరణ బాగానే ఉన్నదనిపిస్తోంది. ఈ విషయాన్ని గణాంకాల ద్వారా వివరించి నిరూపించడం అంత సులభం కాదు. అయితే, పుస్తకాల అమ్మకానికి సంబంధించిన గణాంకాలను చూపి నిరూపించాలని ప్రయత్నించడం అంత కరెక్టు కాదేమో. ఎందుకంటే, మన తెలుగు పాఠకులలో పుస్తకాలను చదివే ప్రతివ్యక్తి వాటిని కొని చదవడు! ఇది అత్యంత దురదృష్టకరమైన విషయం. కొందరు మిత్రుల దగ్గరినుండి తీసుకుని చదవవచ్చు, మరికొందరు గ్రంథాలయాల్లో తీసుకుని చదవవచ్చు. ఆన్‌లైన్‌లో పి.డి.ఎఫ్. రూపంలో తెప్పించుకుని చదివేవాళ్లు ఉంటారు. అనువాద గ్రంథాలను కొనకూడదు అని స్వీయ నిర్బంధం పెట్టుకునే చదువరులు ఉంటారా? అనుమానమే. పైగా ఏ అనువాదకుడైనా సాధారణంగా మంచి స్థాయి ఉన్న మూలగ్రంథాన్నే తర్జుమా కోసం ఎంపిక చేసుకుంటాడు కాబట్టి, ఆదరణకు అర్హమైన అనువాద రచనలే అధికం అని భావించవచ్చు. కానీ, అనువాద స్థాయి మరీ తక్కువగా ఉంటే మాత్రం ఆదరణకు నోచుకోకపోవచ్చు.

ఇక ప్రచురణ సంస్థల నుండి ఆదరణ విషయానికి వస్తే ఈ సంస్థలు ప్రభుత్వానికి చెందినవి కావచ్చు, లేదా ప్రైవేటువి కావచ్చు వాటి నుండి ఆదరణ అధ్వాన్నంగానే వుంది. ప్రస్తుతం అనువాదాలు చేయించడంలో సాహిత్య అకాడమీలు, విశ్వవిద్యాలయాలు ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి. ఇవి చేస్తున్న కృషి ఫరవా లేదు అన్నట్టుగా వుంది. అయితే వీటి కృషి సరిపోదు. ప్రాచీన తెలుగు సాహిత్యం ఆంగ్లంలోకి ఓ మోస్తరు పరిమాణంలో వెళ్లిన మాట నిజమే కానీ, మధ్యకాలపు, ఆధునిక కాలపు తెలుగు సాహిత్యం అనువాదం కావల్సింది ఎంతో వుంది. దీనికి కారణం ఈ సంస్థల పనితీరు అని చెప్పాల్సివుంటుంది. ఈ వ్యాసకర్త ఆంగ్లంలోకి అనువదించిన కాళోజీ కథలను ప్రచురించేందుకు హైదరాబాదు మహానగరంలోని ఏ సాహిత్య సంస్థ ముందుకు రాలేదు! రాకపోవడమే కాకుండా ఒకరిద్దరు, మీరు ఈ అనువాదం ఎందుకు చేశారు? చేయాల్సింది కాదు, అనడం పరిస్థితి యొక్క దయనీయత తాలూకు తీవ్రతను సూచిస్తుంది.

దీన్ని అధిగమించాలంటే, అనువాదాలకోసం ఒక మంచి వేదిక (platform or forum) అవసరం. అది పెద్దదిగానే కాక బలమైనది కూడా అయివుండాలి. దాన్ని స్థాపించేందుకుగానీ నడిపించేందుకు గానీ ఒకరిద్దరు వ్యక్తులు సరిపోరు. నలుగురైదుగురు కూడా సరిపోకపోవచ్చు. దానికి డబ్బు, సిబ్బంది, సరంజామా మొదలైన ఎన్నో వనరుల అవసరమౌతాయి. సంపన్నులైన వదాన్యులు కొందరుంటారు. వారిదగ్గర డబ్బు పుష్కలంగా ఉంటుంది. వారికి సాహిత్యం పట్ల, అనువాదాల పట్ల ఆసక్తి, మమకారం కూడా ఉండవచ్చు. వారిని కలిస్తే ఆర్థిక వనరులు కొంతవరకు సమకూరవచ్చు. ఇట్లాంటి చర్యలను తక్షణమే ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైంది.

**(ఇది అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) వారు 11-12-2021 నాడు హైదరాబాదులో నిర్వహించిన సాహిత్య సదస్సులో నేను చేసిన ప్రసంగానికి అక్షర రూపం.)**

కథ

# బంగారు కలలు

**ఉద్యమంలో మధ్యతరగతి మనోభావాలు చిత్రించిన కథ...**



దేశరాజు
99486 80009

(ఉగాది కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ...)

అది 2009వ సంవత్సరం ముగియడానికి చివరి నెల మొదలై పట్టుమని పది రోజులైనా కాని రోజు..

''అయితే, ఇక మనం అన్నీ సర్దుకోవాల్సిందేగా?''

రాత్రంతా ఎక్కడో తిరిగి అర్ధరాత్రి దాటాక ఇంటికొచ్చిన భర్తకు తలుపు తీసి, నిద్రమత్తులోనే అతడి భార్య అడిగింది.

అటువంటి ఆలోచనలేమీ లేని అతడు నివ్వెరపోయాడు. అతడి నుంచి సమాధానం రాకపోవడంతో కళ్లు కాస్త తెరిచి భర్త అవతారం గమనించింది. ముఖంలో ఆనందం వెల్లివిరుస్తోంది. చొక్కాపై, ప్యాంట్‌పై రంగులు పడ్డాయి. తలపై పూల రేకులున్నాయి.

“ఊ.. అదన్న మాట సంగతి. మనల్ని గెంటేస్తుంటే సిగ్గులేకుండా వాళ్లతో కలిసి సంబరాలు చేసుకుని వస్తావా?” అని కాస్త విసుగు ప్రదర్శించి బెడ్ రూమ్‌లోకి వెళ్లిపోయింది. అతడు కూడా గది గుమ్మం వరకు వెళ్లి పడుకున్న పిల్లలను ఓసారి చూసి, మరో బెడ్ రూమ్‌లోకి వెళ్లి బట్టలు మార్చుకుని, ఫ్రెష్ అయి వచ్చి మంచంపై వాలాడు. తాగిన మత్తు ఒత్తిడి చేస్తున్నా, దాచుకోలేని ఆనందం అతడిని నిద్రబోనీయడం లేదు. ఫోన్ తీసుకుని వాట్సప్ ఓపెన్ చేశాడు. అన్ని మెసేజెస్‌లోనూ అదే ఆనందం, అవే ఫొటోలు, అలాంటివే దృశ్యాలు. నెమ్మదిగా ఫోన్ పక్కన పెట్టేశాడు. మెల్లగా నవ్వుకుంటూ ఎవరినో కౌగిలించుకుంటున్నట్టు చేతులు రెండూ పెనవేసుకుని, చిర్నవ్వుతో దీర్ఘశ్వాస తీసుకున్నాడు. సీలింగ్‌కు తిరుగుతూ వేలాడుతున్న ఫ్యాన్‌ను చూస్తూ “ఎన్నాళ్ల కల ఇది” అనుకున్నాడు.

‘ఒక ఉద్యమాన్ని నెత్తికెత్తుకుని, దాన్ని సాధించి, తమ జీవిత కాలంలోనే సాకారం చేసుకున్న వాళ్లు గతంలో ఎక్కడైనా ఉన్నారా?’

మళ్లీ తనే ‘మనం ఉన్నాం కదా, ఈ అపూర్వ విజయాన్ని ఆస్వాదిస్తున్నాం కదా’ అనుకున్నాడు. ఇలాగే ఏవో, ఇంకేవో ఆలోచనానందాలలో తలమునకలవుతూ తెల్లవారుజామున ఎప్పుడో నిద్రలోకి జారుకున్నాడు.

* * *

ఆలస్యంగా లేచి హడావిడిగా ఆఫీసుకు వెళ్లి అక్కడ పనుల్లో పడి తేరుకునేసరికి సాయంత్రమైపోయింది. తన క్యాబిన్ లోంచి అతడు బయటకు వచ్చి చూస్తే కొంతమంది ముఖాలు దిగాలుగా, కొంతమంది ముఖాలు ధీమాగా కనిపించాయి. అందరూ వెళ్లే మూడ్‌లో ఉంటారు కాబట్టి ఎవరినీ డిస్టర్బ్ చేయలేదు. ఆఫీస్ బాయ్ వస్తే మామూలుగానే “ఏంటి సంగతులు?” అన్నాడు.

“ఏముంటుంది సార్, ఎవడి శునకానందం ఆడిది” అన్నాడు చనువుగా.

“ఏమైంది?” అన్నాడు లాప్ టాప్ బ్యాగ్ భుజానికి తగిలించుకుంటూ.

“ఏముంటది సార్, వచ్చిందని సంబరపడ్డమో లేదో.. ఇల్లలకగనే పండగైతదా అని ఆళ్లు సంకలు గుద్దుకుంటున్నారు”

“ఒకసారి ప్రకటించాక ఇక పండగే అయితాది”

“అట్ట కాదుట సార్, మళ్లీ మారుస్తరట” అన్నాడతను.

వాడి అమాయకత్వానికి నవ్వుకుంటూ “చట్టం, రాజ్యాంగం అని కొన్ని ఉంటాయి..” అంటూ ఏదో చెప్పబోయాడు.

“అయన్నీ ఏముందిలే సార్, ఆళ్లు ఉన్నాయంటే ఉన్నట్టు.. లేవంటే లేనట్టే కద సార్” అన్నాడు.

వీడితో వాదించే టైమ్ ఇది కాదు అనుకుంటూ “ఏం ఫికర్ పడకు, మస్తు చలాయిద్దువ్” అంటూ ఓసారి అతడి వీపు తట్టి బయటపడ్డాడు.

సరాసరి రోజూ తన మిత్రుడిని కలుసుకునే బార్ అండ్ రెస్టారెంట్‌కు చేరుకున్నాడు. సాధారణంగా తనకంటే ముందే వచ్చే మిత్రుడు ఆ రోజు ఆలస్యంగా వచ్చాడు. అతడి ముఖం కూడా అంత హుషారుగా లేదు. ‘రాత్రి

నిద్రలేకపోవడం వల్లనేమో' అనుకుంటూ...

"ఏంట్రా లేటు? ఆఫీసుకు వెళ్లకుండా ఇప్పటి వరకు ఇంటి దగ్గరే పడుకున్నావా ఏంటి?'' అన్నాడు నవ్వుతూ.

"నీకలాగే ఉంటుంది బాబూ.. ఇవాళ ఆఫీసుకి ఎవరూ రాలే. అంటే, వచ్చారు. కానీ, అంతా బయటే తిరుగుళ్లు. పనంతా నేనే చేసుకోవాల్సి వచ్చింది'' అన్నాడు.

"అదా సంగతి, ఏదో డల్‌గా కనిపిస్తుంటే రాత్రి డోస్ ఎక్కువైందేమో అనుకున్నా''

"అందుకు కాదురా, మళ్లీ ఏదో మెలిక పడిందటగా?''

"ఇంకేం మెలికరా? ఒకసారి ప్రకటించేశాక ఇక అంతే''

"లేదురా, మీ వాళ్లు అంత తొందరగా వదిలిపెడతారా? 'నేని'లు నూనెలు, 'పాటి'లు ఘనాపాఠీలు ఏకమవుతున్నారని, అడ్డుకుంటారని అంటున్నార్రా'' అన్నాడు దిగులుగా.

"మీ వాళ్లంతా ఇంత అమాయకులు కాబట్టేరా ఇంతకాలం పట్టింది. కాకపోతే.. నువ్వు కూడా ఏంట్రా అలా మాట్లాడతావ్? బాధ్యతగల పదవిలో ఉన్న వ్యక్తి ప్రకటించినప్పుడు కాదని మళ్లా ఎట్లా అంటారు? రాజ్యాంగాలు, చట్టాలు ఏమీ ఉండవేరా?''

"అరె ఎక్కడున్నవ్ రా నువ్వు. మీవాళ్లనుకుంటే అయన్నీ ఏముందిరా?'' అన్నాడు.

తనేదో అనబోయాడు. కానీ, మిత్రుడి ముఖంలో కోపం చోటుచేసుకోవడం చూసి ఆగిపోయాడు.

"నువ్వని కాదులేగానీ, మీ వాళ్లు భలే అమాయకత్వం నటిస్తార్రా. కాకపోతే, ఇంతకుముందు లేవేరా చట్టాలు. నీళ్లలో, చదువుల్లో, ఉద్యోగాల్లో మాకు ఎంతంత ఇవ్వాలో రాసుకోలేదా, మీ చట్టాల్లో. మరి, ఇచ్చిన్రా అట్లనే?'' అంటూ ఆవేశంగా నిలదీశాడు.

స్నేహితుడి ఆవేశంలోని నిజాయితీకి తలొగ్గి, తిరిగి కోప్పడకుండా మౌనంగా ఉండిపోయాడు.

"ఇక్కడదాకా వచ్చాక, ఆపలేరు. కాకపోతే ఇంకాస్త డిలే చేస్తారు. అంతే'' అని అనునయంగా ఏదో చెప్పబోయాడు.

"వస్తదిరా, ఏడకిపోద్ది. ఇప్పటికే సానమంది పోయిన్రు. లేటయినకొద్దీ ఇంకెంతమంది పోతరో లెక్కబెట్టుకుంటుండాల. మా చెల్లిది ఇంటర్ అయిపోవస్తోంది. దానికి మంచిగ సీటు వస్తుందనుకున్నా. మా తమ్ముడిని అప్పుడెప్పుడో ఆడినీ, ఈడినీ పట్టుకుని ఆఫీసులో కుదిర్చా కదా. ఆడిది ఇక పర్మినెంట్ అయిద్దనుకున్నా'' అని గట్టిగా నిట్టూర్పు విడుస్తూ, "ఇట్లా ఎంతమంది.. ఎన్ని ఆశలు పెట్టుకున్నరో'' అన్నాడు.

మిత్రుడి కంట్లో సన్నటి నీటిపొర అతడి దృష్టిని తప్పించుకు పోలేదు. ఇద్దరూ బతుకు తెరువు కోసం నగరానికి వచ్చినవారే. కాకపోతే, ప్రాంతాలు వేరు. అతడిది బహు దగ్గర, ఇతడిది చాలా దూరం. ఇప్పుడున్న సామాన్యమైన స్థితికి రావడానికే ఇద్దరూ సమానంగానే కష్టపడ్డారు. కానీ, అతడికి ఎప్పుడూ ఎక్కడో అక్కడ ఏదో అడ్డంపడుతూనే ఉంటుంది. ఒకరకంగా చూస్తే ఆ మిత్రుడి అర్హతలు కూడా ఎక్కువే. ముంబై, చెన్నై లాంటి పట్టణాల్లో ప్రొఫెషనల్ కోర్సులు చేశాడు. ఢిల్లీలో ట్రైనింగ్ తీసుకున్నాడు. అందుకే, అతడి మాట్లాడే భాష అతడి ప్రాంతాన్ని పట్టివ్వదు. అప్పుడప్పుడు మాత్రం కొంచెం ఆ యాస దొర్లుతుంది. ఆ మాటే అంటే..

"ఎన్నో పోగొట్టుకున్నంరా,

**ఇద్దరూ** బతుకు తెరువు కోసం నగరానికి వచ్చినవారే. కాకపోతే, ప్రాంతాలు వేరు. అతడిది బహు దగ్గర, ఇతడిది చాలా దూరం. ఇప్పుడున్న సామాన్యమైన స్థితికి రావడానికే ఇద్దరూ సమానంగానే కష్టపడ్డారు. కానీ, అతడికి ఎప్పుడూ ఎక్కడో అక్కడ ఏదో అడ్డంపడుతూనే ఉంటుంది. ఒకరకంగా చూస్తే ఆ మిత్రుడి అర్హతలు కూడా ఎక్కువే. ముంబై, చెన్నై లాంటి పట్టణాల్లో ప్రొఫెషనల్ కోర్సులు చేశాడు.



కథ

"అవమానించి చంపుతుంటే భాష మాత్రం మిగులుద్దేరా?" అంటాడు బాధగా.

ఇద్దరూ లేచి బయటకు వచ్చారు. రాత్రి తళుకుబెళుకులతో ధగధగలాడుతున్న నగరాన్ని ఇద్దరూ నిశ్శబ్దంగా చూశారు.

"నిన్నంతా ఎంత గోలగా ఉండెరా, ఇప్పుడు చూడు.." అన్నాడు.

"అరె, ఏం కాదులేరా. వస్తుంది. నువ్వేం దిగులు పెట్టుకోకు" అని స్నేహితుడిని కౌగిలించుకున్నాడు.

ఎందుకో, ఎప్పుడూ కంటే బరువుగా అనిపించాడు-బహుశా, దుఃఖ భారం వల్లనేమో.

ఎక్కిన్ కిక్‌తో, దిగని దిగుళ్లతో ఇద్దరూ ఇళ్లకు బయల్దేరారు.

* * *

"ఆగిపోయిందటగా?" అంది కొంచెం వెటకారంగా చూస్తూ నిద్రమత్తులేని ఆనందం తాండవిస్తున్న ముఖంతో.

"టూమచ్ అబ్బా. ఆగిపోతే నీకు ఒరిగేదేముంది. అక్కడ వాళ్లు ఎంత మంది ఎన్ని ఆశలు పెట్టుకున్నారు. ఎన్ని ప్రాణాలు పోయాయి. అసలు ఇవేమీ ఆలోచించవా."

"నా మీద ఎగురుతావెందుకు? నేనా ఆలోచించాల్సింది - ఇచ్చేవాళ్లు, తీసుకునేవాళ్లు గానీ. మధ్యలో నాదేముంది? అక్కడికి వాళ్లందరినీ నేనే మర్డర్ చేసినట్టు మాట్లాడతావ్. నీకు బుర్రలేదు, వాళ్లకీ లేదు" అంది.

"నువ్వు ఊరికే వాగద్దు" అని గట్టిగా అరిచి, పిల్లలు లేస్తారేమోనని సంశయించి.. గొంతు తగ్గించి "నన్నేమైనా అంటే అను. మధ్యలో వాళ్లనెందుకు అనడం?" అన్నాడు.

"అంటాను, నిన్నూ అంటాను.. వాళ్లనీ అంటాను. నేనొక్కత్తినే కాదు. మా ఆఫీసులో కొలీగ్స్ అంతా కూడా అంటున్నారు. వాళ్లకి ఒక సీ షోర్ లేదు, పెద్ద రైల్వే జంక్షన్ లేదు, మంచి డ్యామ్స్ ఏమీ లేవు. ఇంకం ఎలా జనరేట్ అవుతుంది. హౌ ద గవర్నమెంట్ రన్?" అంటూ ఆమె తన వాదనలకు తెరతీసింది. "ఇవేమీ ఆలోచించకుండా, మాది మాక్కావాలె అంటే. ఇచ్చెయ్యడానికి ఇదేమైనా చాక్లెట్టా? లేక ఏమైనా పొలం గట్టు తగాదానా? ఎన్ని ఆలోచించాలి" ఆమెకు కడుపులో ఉన్న అక్కసంతా కక్కేయాలని ఉంది. ఇటువంటి సమయాల్లో వాదనకో, చర్చకో దిగడం వివేకం కాదని అతడికి తెలుసు.

ఇంతలోనే ఆమె మళ్లీ అందుకుంది. "అంటే అన్నామని అంటారుగానీ, అసలు వాళ్లంత బద్దకస్తులు ఇంకెవరూ ఉండరు తెలుసా? ఒక్కళ్లు కూడా పొద్దున్నే లేవరు? సుబ్బరంగా చదువుకోరు. చదువుకుంటే ఎందుకు రావు ఉద్యోగాలు? ఎవ్వరూ కూడా ఊరు దాటి పోరు. అన్నీ గుమ్మంలోకే రావాలంటే వస్తాయా? వాళ్లంతా 'ఖానా పీనా సోనా' బ్యాచ్" అంది అతడి మౌనాన్ని అలుసుగా తీసుకుని.

అతడిలో కోపం బుసబుసా పొంగింది. ఆమె అన్న అన్ని మాటలకు అతడు సమాధానం చెప్పగలడు. కానీ, ఆమెకు వినే ఉద్దేశం లేదు. అందుకని "సర్లే నిద్రమత్తులో ఏదేదో వాగుతున్నావ్. పిల్లలు లేస్తారు. పోయి పడుకో" అన్నాడు, సాధ్యమైనంత వరకు కోపాన్ని గొంతులోనే తొక్కిపెడుతూ.

"యధా రాజా తథా ప్రజ అని ఊరికే అన్నారా?" అని సాగదీస్తూ ఆమె వెళ్లిపోయింది.

అవి కేవలం తన భార్య అభిప్రాయాలు మాత్రమే కాదని అతడికి తెలుసు. మొన్నమొన్నటి వరకూ వీళ్లంతా 'ఇస్తే ఇవ్వనీ', 'ఇస్తే మనకు పోయేదేముందిలే', 'అయినా ఇచ్చినప్పుడు కదా' అని లోపల్లోపల అనుకుంటూ పైకి మద్దతు పలికినట్టు నటించారు. 'తీరా విషయం తేలిపోయేసరికి, వీళ్ల అసలు రూపాలు బయటపడుతున్నాయి' అని ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడు.

* * *

ఆ రోజు ఆదివారం. యథాప్రకారం బంధువులు, పరిచయస్తులు, అనుకోకుండా మనం ఉండే ప్రాంతం వైపు వచ్చినవారు మన ప్రైవసీపై దాడి చేసే వాళ్ళం.

ఆ రోజు అలాగే జరిగింది. ఆమె పిన్ని అల్లుడు వాళ్లు ఎందుకో ఇటువైపు వస్తూ మధ్యాహ్నం భోజనానికి వాళ్లింటికి ఇంటికి వచ్చారు. మామూలు మాటలు, మర్యాదలు పూర్తయ్యాయి.

"ఏంటింత దూరం వచ్చారు?" అడిగాడతను.

అతను చెప్పేలోగానే అతడి భార్య అందుకుంది.

"ఏం లేదండి. ఎప్పుడో మా పెళ్లప్పుడు మా నాన్నగారు ఇక్కడ దగ్గర్లో చిన్న ప్లాట్ తీసుకున్నారు. ఫర్వాలేదు, బాగానే పెరిగింది. ఇప్పుడు అమ్మేద్దామని" అంది.

"అదేంటి? ఇప్పుడేమవసరం వచ్చింది గనుక. పిల్లలు ఇంకా చిన్నవాళ్లే కదా" అన్నాడతను.

ఆమె భర్త ముందుకు వచ్చి "అవసరం కాదండి, స్థలాల ధరలు ఇంక పెరగవండి. కాస్త ఆగితే కొన్న రేటయినా వస్తుందాని డౌట్. అందుకనే.." అంటూ ఏదో చెబుతున్నాడు.

**"టూమచ్ అబ్బా. ఆగిపోతే నీకు ఒరిగేదేముంది. అక్కడ వాళ్లు ఎంత మంది ఎన్ని ఆశలు పెట్టుకున్నారు. ఎన్ని ప్రాణాలు పోయాయి. అసలు ఇవేమీ ఆలోచించవా." "నా మీద ఎగురుతావెందుకు? నేనా ఆలోచించాల్సింది - ఇచ్చేవాళ్లు, తీసుకునేవాళ్లు గానీ. మధ్యలో నాదేముంది? అక్కడికి వాళ్లందరినీ నేనే మర్డర్ చేసినట్టు మాట్లాడతావ్. నీకు బుర్రలేదు, వాళ్లకీ లేదు" అంది. "నువ్వు ఊరికే వాగద్దు" అని గట్టిగా అరిచి, పిల్లలు లేస్తారేమోనని సంశయించి.. గొంతు తగ్గించి "నన్నేమైనా అంటే అను. మధ్యలో వాళ్లనెందుకు అనడం?" అన్నాడు.**

కథ

అతడికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

కానీ, ఆయన భార్య వంటింటి లోంచి వింటి నుంచి విడిచిన బాణంలా దూసుకు వచ్చి "ఆయనకి ఇలాంటి విషయాలేమీ తెలియవు లేరా. అమ్మెయ్యాలనుకుంటే మాత్రం ఇదే సరైన సమయం. మనవైపెక్కడైనా కొత్తది కొనుక్కోవచ్చు. అన్నట్టు, మొన్న వదిన ఫోన్ చేసింది. అక్కడ విశాఖపట్నంలో, కాకినాడలో రేట్లు ఊరికే పెరిగిపోతున్నాయట. ఓ యాభయ్యో, వందో అటూ ఇటైనా తీసేసి మనవైపు తీసుకున్నావనుకో" అంది.

"అదే అనుకుంటున్నా. అందుకే ఓసారి చూసి, మాట్లాడి వెళదామని వచ్చా" అన్నాడతను.

'వీళ్ల ద్వంద్వ వైఖరికి అతడు ఆశ్చర్యపోయాడు. ఒకవైపు విడిపోదు అంటారు. మరోవైపు విడిపోతుందేమోనని ఏర్పాట్లు చేసేసుకుంటున్నారు' అనుకుంటూ నిట్టూర్చాడు.




★ ★ ★

అనుమానాలు, సందేహాలు రాజ్యాంగం, చట్టాలపై చర్చలు సాధ్యాసాధ్యాలపై వాదనలు.. కొన్నిచోట్ల, కొన్నిసార్లు అవి శృతిమించి గొడవలుగా మారడం, మరికొన్నిసార్లు ఆత్మహత్యలుగా తేలడం. ఇవన్నీ వారి స్నేహానికేమీ అడ్డం పడలేదు. అప్పుడప్పుడు ఎవరో ఒకరు హద్దు మీరినా, మరొకరు అదుపులో ఉండి సర్దుకుపోతున్నారు. జరుగుతున్న సంఘటనలతో విచారంలో కూరుకుపోతున్న మిత్రుడిని చూస్తే అతడికి ఎక్కువ బాధ కలిగింది. 'లక్షలాదిమందితో వ్యవహారం, కొందరు నేతలకు నవ్వులాటగా ఉందేమిటి?'అని తనలో తనే అనేకసార్లు ప్రశ్నించుకున్నాడు. "అదేదో ఆటలాగా ఒక్కోసారి ఒక్కోరు పైచేయి సాధిస్తున్నారు. కానీ, లక్షలాది ప్రాణాలు ఎంత విలవిలలాడిపోతున్నాయో వాళ్లు పట్టించుకోవడం లేదు"ని మిత్రుడు వాపోయాడు. అప్పుడతనికి తెలీదు అదే నిజమవుతుందని.

**ముందు దుఃఖంలో కూరుకుపోయిన మిత్రుడిలో తర్వాత ఆవేశం కట్టలు తెంచుకుంది. 'తమ్ముడి శవాన్ని తీసుకుని ఢిల్లీ పోతానని, ధర్నా చేస్తానని.. ఏం సమాధానం చెబుతారో నిలదీస్తా'నని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అతడిని ఊరడించడం కష్టమయ్యింది. చాలామంది నాయకులు వచ్చి సానుభూతి ప్రకటించారు. తర్వాత కార్యక్రమాలన్నీ యథాప్రకారం ముగించారు.**

రెండ్రోజుల తర్వాత, ఓ రోజు పొద్దున ఫోన్ "ఒరేయ్.. అంతా నాశనమై పోయిందిరా" అంటూ మిత్రుడు ఫోన్‌లోనే బావురుమన్నాడు. "నా శవాన్ని చూశాకైనా ప్రత్యేక రాష్ట్రం ఇస్తారని ఆశిస్తున్నా" అంటూ చీటీ రాసిపెట్టి మిత్రుడి తమ్ముడు ఊర్లో ఉరిపోసుకున్నాడు. వెంటనే బయల్దేరి ఊరు చేరుకుని మిత్రుడిని అక్కున చేర్చుకున్నాడు.

ముందు దుఃఖంలో కూరుకుపోయిన మిత్రుడిలో తర్వాత ఆవేశం కట్టలు తెంచుకుంది. 'తమ్ముడి శవాన్ని తీసుకుని ఢిల్లీ పోతానని, ధర్నా చేస్తానని.. ఏం సమాధానం చెబుతారో నిలదీస్తా'నని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అతడిని ఊరడించడం కష్టమయ్యింది. చాలామంది నాయకులు వచ్చి సానుభూతి ప్రకటించారు. తర్వాత కార్యక్రమాలన్నీ యథాప్రకారం ముగించారు.

స్నేహితుడికి తోడుగా ఆ రాత్రికి అతడు అక్కడే ఉండిపోయాడు. కళ్లు మూసినా, తెరిచినా.. స్నేహితుడి కుటుంబమే కళ్లముందు కదలాడుతోంది. 'ఒక మరణం.. ఒక విషాదం కుటుంబాన్ని ఎంత అలజడికి లోను చేసింది. భర్తలేని ఆ తల్లి కళ్లలో దిగులు మేఘాలు కమ్ముకున్నాయి. చెల్లెలి చూపులు విషాదాన్ని చిమ్ముతున్నాయి. మిత్రుడు రేపు ఏమైపోతాడో తెలియనంత ఆందోళనలో ఉన్నాడు. కుటుంబాలను కుదిపేసే ఇలాంటి మరణాలను మనం చాలా సాధారణమైన సింగిల్ కాలమ్ వార్తగా చదివేస్తూంటాం. ఇంత దుఃఖాన్ని ఏ అక్షరాలు మాత్రం ఎత్తిపట్టగలవు' అనుకుంటూ నిట్టూర్చాడతను. 'ఈ దుఃఖం ఇంకా ఎన్ని కుటుంబాలను కాటేయడానికి వేచి ఉందో' అన్న ఊహే అతడిని కలచి వేసింది. పక్కనే పడుకుని శూన్యంలోకి చూస్తున్న స్నేహితుడి భుజంపై భరోసాగా చేయి వేశాడు.

ఆ చీకటిని తొలగించే బంగారు కలలు కంటూ వాళ్లిద్దరూ రెప్పవేయకుండా ఆ రాత్రికి కాపు కాస్తూ ఉండిపోయారు.

సమాజం

# అంతర్మథన మాలిక సుదూర తీరాలు

**కటుకోజ్వల రచనా సంవిధానంలోని వాస్తవికతను అంచనా వేసిన వ్యాసం...**




సువర్ణ వినాయక్
96186 76215


భాష విభిన్న వ్యవహార రూపాల్లో ఉంటుంది. వీటిలో ఎన్నో ప్రక్రియలు, ఎన్నో వైవిధ్యాలు, ఎన్నో ప్రత్యేకతలు. ఐతే పాఠకుల్ని కట్టి పడేసి మరోలోకంలోకి తీసుకెళ్లేవి కథలు. పాట భావోద్వేగాన్ని, శ్రవణానందాన్ని కలిగిస్తే కథ అనుభూతి ప్రధానంగా, పాత్రలతో మమేకమయ్యేలా చేస్తుంది. నాటకం ప్రదర్శనా యోగ్యతతో అలరిస్తుంది. ఇలా ప్రతి ప్రక్రియకు కూడా వాటికే పరిమితమైన ప్రత్యేకతలు న్నప్పటికీ, అధిక సంఖ్యలో పాఠకులను తమతో పయనించేలా, మమేకమయ్యేలా చేసేవి కథలు మాత్రమే అని భావించక తప్పదు.

కథలకు మానవ జీవితమే ముడిసరుకు. కథలు సమకాలీన అంశాలను బంధిస్తాయి. చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తాయి. భవిష్యత్తుకు బాటలు వేస్తాయి. మానవ సంబంధాలను ఆవిష్కరించడంలో ఆలోచనలను పెంపొందించి అంతర్మథనానికి లోనయ్యేలా చేస్తాయి కూడా! కథకులు తమ పరిసరాలను, సమకాలీన సమాజం లోని పోకడలను, పరిణామాలను నిశితంగా పరిశీలించి వస్తువుగా మల్చుకొని కథలకు ప్రాణం పోస్తారు. అందుకే కథలను చదువుతున్నప్పుడు అనుభూతికి లోనుకావడంతో పాటు పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసి అన్వయించుకోవడమూ చేస్తుంటాం! ఇది కథలకున్న గొప్ప లక్షణం కూడా! ఒకరకంగా సాహిత్యం అంటే హితాన్ని చేకూర్చునది అనే నిర్వచనానికి కూడా తగినట్లుగా కథలు తమ పాత్రను పోషిస్తున్నాయనవచ్చు.

ఆబాలగోపాలాన్ని ఆకర్షించేవి కథలు అనేది జగద్విదితమే! అంటే కథలు చెప్పే వారిని పిల్లలు ఇష్టపడుతుంటారు కూడా. పిల్లలకు చెప్పే ఏ విషయాన్నైనా కథల రూపంలో చెబితే అది పిల్లల అవగాహనను, ధారణను కూడా వృద్ధి పరుస్తుందనేది విద్యారంగంతో అనుబంధం ఉన్నవారికి విదితమే! సాధారణ రచయితలతో పోలిస్తే ఒక ఉపాధ్యాయుడు కథా రచయితగా మారినపుడు చేకూరే ప్రయోజనాలు అధికమనే నేను భావిస్తాను. ఎందుకంటే నిత్యం తమ పిల్లలు, వారి తల్లిదండ్రులు, అధికారులు, ప్రజలు, స్నేహితులు.. ఇలా విభిన్న వర్గాలతో అనివార్యంగా ప్రతిచర్యలు పొందే అవకాశం ఉంటుంది. వారిమధ్య సంబంధాలు, వారి ప్రవర్తనలు, పర్యవసానాలను నిశితంగా అర్థం చేసుకునే వీలుంటుంది. వీటితోపాటు సమాజంలోని విభిన్న వర్గాల మధ్య సంబంధాలు, మానవ స్వభావాలు, వారి ప్రవర్తనలను కూడా నిశితంగా పరిశీలిస్తుంటారు. ఈ నేపథ్యంలో వచ్చిన కథలు సహజంగానే జీవిత సమస్యలను, సజీవ చిత్రాలను ప్రతిబింబిస్తుంటాయి. వీటికి న్యాయం చేకూర్చుతూ, ఆలోచింపజేస్తూ కథా రచనలను చేస్తున్నవారిలో కటుకోజ్వల మనోహరాచారి ఒకడు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ ప్రవృత్తి రీత్యా మంచి రచయిత. సుదూరతీరాలు పేరుతో తను రాసిన కథలను సంకలనంగా తీసుకురావడం అభినందనీయం.

వీటిలోని వస్తువులన్నీ మన దైనందిన జీవితంలోని సంఘటనలుగా గోచరిస్తుంటాయి. శైలి కూడా సరళంగా, సూటిగా ఉండి కథలన్నీ ఆలోచనా త్మకంగా, సందేశాత్మకంగా ఉండడం గమనార్హం. ప్రతి కథ కూడా మనకు ఎక్కడో ఒకదగ్గర ఎదురైన లేదా చూస్తున్న, తెలిసిన సంఘటనగానే అనిపిస్తుంది. అందులో లీనమయ్యేలా చేస్తుంది. ఈమధ్య కాలంలో చోటు చేసుకున్న సంఘటనల ఆధారంగా రూపొందిన కథలుగా తోస్తాయి. దాదాపు ప్రతి కథకూడా ఒక సందేశాన్ని అందించేలా ఉన్నది.

తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో పెట్టడం వల్ల కలిగే పరిణామాలను, తాము ఏమి పోగొట్టుకున్నామో, తమ పిల్లలకు అందించాల్సింది ఏమిటో

సమాజం

తెలియజేసే కథ కాంతిదూతలు. పిల్లలను హాస్టళ్లలో ఉంచి బాగా చదివిస్తున్నా మనే భ్రమలో వారిని యంత్రాలుగా ఎలా మారుస్తున్నామో, దాని ప్రభావం వల్ల వారు తమ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు చేర్చే నైజాన్ని పుణికి పుచ్చుకోవడం, తల్లిదండ్రులు అవసానదశలో ఉన్నా స్పందన కరువైన సంతానంగా మారిన వైనం గురించి పసిమనసులు కథలో చూడవచ్చు. గ్రామాలు, పల్లెలు పచ్చదనానికి ప్రతీకలని, బాంధవ్యాలకు నెలవని, మమతానురాగాల కోవెలలనీ భావించి పుట్టిన గ్రామానికి వెళ్లి, అక్కడి మారిన పరిస్థితులను, కలుషితమైన ప్రవర్తనలను గురించి బాధపడి తిరిగి ఆ పల్లె వైభవాన్ని ఆవిష్కరించడానికి పట్నం వదిలి పల్లెకు మకాం మార్చాలని నిర్ణయించుకున్న ఒక విద్యాధికుడి అంతర్మథనయే పల్లెతనం కథ.

తెలిసీ తెలియని తనంతో.. వయస్సు ప్రభావంతో తల్లిదండ్రుల మాటలను అపార్థం చేసుకొని ఆకర్షణకు లోనయ్యి, వ్యామోహానికి, ప్రేమకు తేడా తెలియక మోసపోయిన విద్యార్థిని కథ ఆత్మీయులు. తమ ఆరోగ్యం, భద్రత కోసం తల్లిదండ్రులు చేసే నియంత్రణను




అపార్థం చేసుకొని, వ్యామోహం ఉచ్చుకు లోనై నిండు జీవితాలను బుగ్గిపాలు చేసుకొంటున్న యువతీ యువకులకు ఇది ఒక కనువిప్పు. సాహిత్య చమత్కారాన్ని సమయస్ఫూర్తిగా వినియోగించి సమస్యకు నివారణను చూపించిన కథ కావ్యకన్యక. రాయలవారి జీవితంలోని చిన్న అంశాన్ని స్వీకరించి ఊహాత్మకంగా చిత్రించిన విధానం అభినందనీయం.

ఉపాధ్యాయులు బాధ్యత కేవలం బోధించడం మాత్రమే కాదని, పిల్లల నేపథ్యాన్ని, వారి కుటుంబ స్థితిగతులను అర్థం చేసుకొని తదనుభూతితో వ్యవహరించడం ఎందుకవసరమో విడమరచి చూపించిన కథ బడిబాట. బాధ్యతలేని, ఉద్యోగం లేని కొడుకూ, పెండ్లీడుకొచ్చిన కూతురు.. వీటన్నింటి కోసం జీవితాన్ని త్యాగం చేసి మరణంతో పరిష్కారం చూపిన త్యాగి కథనే పరిత్యాగి. కథ చదువుతున్నంత సేపూ మధ్యతరగతి కుటుంబాలలోని వేదనలు కళ్ల ముందు కదలాడుతూ ఉంటాయి. సొంతిల్లు లేని చిరుజీవితాలలో మరణం సంభవిస్తే ఎదురయ్యే విషమ, కఠిన పరిస్థితిని కళ్లకు కట్టినట్లుగా వివరించిన కథనే చేయూత.

ఈ మధ్య కాలంలో జరిగిన యదార్థ ఘటన ఆధారంగా రాసిన కథనే ప్రేమపాశం. నిజమైన ప్రేమను పంచేవారు తల్లి, తండ్రి, గురువే అని తెలిపి, ఏ సంబంధం లేని అన్య వ్యక్తులు ప్రదర్శించేది ప్రేమ కాదని.. అది ఆకర్షణ. కామం మాత్రమేనని నేటి యువతకు విడమర్చి అర్థం చేయించిన కథ ఇది. ప్రేమ పేరుతో, అభ్యుదయ భావాలతో ప్రవర్తిస్తున్నామనే భ్రమలో నేటి యువతులు ఎలా మోసపోతున్నారో చెప్పిన తీరు ప్రశంసనీయం.

డాలర్ల సంపాదన కోసం తమ సంతానానికి ఉన్నత చదువులు చెప్పించి, హోదా కోసమో, పేరుకోసం తమ పిల్లలను విదేశాలకు పంపి, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న కష్టాలను, వారి ఆవేదనలను తెలియజేసే కథ దూరతీరాలు. తమ పిల్లలు విదేశాలలో బాగా సంపాదిస్తున్నారని, తమకు ఏ లోటూ లేదని భావించి. తాము అనారోగ్యం బారిన పడితే పరామర్శించడానికి గానీ, పలకరించడానికి గానీ రాలేకపోయిన సంతానం గురించి గుండెల్లో గూడు కట్టుకున్న ఆవేదనను పంచుకోవడానికి కూడా తోడులేని పరిస్థితుల్లో ఉన్న నేటి తల్లిదండ్రులకు కనువిప్పు కలిగిస్తుందీ కథ. తన ఉన్నతికి తానే కారణమని తన కృషితోనే తాను ఉన్నత స్థితికి చేరుకొన్నానని భావించి భ్రమించే కొడుకుకు తన ఉన్నతికి తండ్రి కారణమని తెలియజెప్పే కథ క్షమించవా? ప్రేరణ ద్వారా లేదా రెచ్చగొట్టడం ద్వారా లేదా దండించడం, ఆలోచింపజేయడం ద్వారా ఒక వ్యక్తిలోని ప్రతిభను వెలికితీయవచ్చు. లక్ష్యసాధన దిశగా పరుగులు పెట్టించవచ్చు అని తెలిపే

**నిజమైన ప్రేమను పంచేవారు తల్లి, తండ్రి, గురువే అని తెలిపి, ఏ సంబంధం లేని అన్య వ్యక్తులు ప్రదర్శించేది ప్రేమ కాదని.. అది ఆకర్షణ. కామం మాత్రమేనని నేటి యువతకు విడమర్చి అర్థం చేయించిన కథ ఇది. ప్రేమ పేరుతో, అభ్యుదయ భావాలతో ప్రవర్తిస్తున్నామనే భ్రమలో నేటి యువతులు ఎలా మోసపోతున్నారో చెప్పిన తీరు ప్రశంసనీయం.**

వ్యక్తిత్వ వికాస సూత్రాన్ని తెల్పిన కథ ఇది. తన కుమారుడికి చెప్పిన దానికంటే రెచ్చగొడితే కసితో కృషి చేస్తాడని గ్రహించిన తండ్రి అతనికి పరోక్షంగా ప్రేరణ కలిగించిన కథ. మొదటినుండీ తండ్రిని ద్వేషించి చివరకు కనువిప్పు కలిగి పశ్చాత్తాపపడిన వైనాన్ని చిత్రించిన తీరు అభినందనీయం.

సగటు కాలేజీ విద్యార్థుల ప్రవర్తనను ఆవిష్కరించిన కథ సక్కుబాయి ఓ బాయ్‌ఫ్రెండు. బాయ్ ఫ్రెండు కలిగి ఉండడం ఓ స్టేటస్ సింబల్‌గా భావించి తమ జీవితాలను పెడత్రోవకు మరల్చుకునే విధానాన్ని చక్కగా చిత్రించాడు. కరోనా విపత్కర పరిస్థితులలో లాక్డౌన్ సమయంలో మందుకోసం ఇబ్బందిపడిన విధానాన్ని సున్నితమైన హాస్యంతో మేలవించిన కథనే మందుభాగ్యుడు.

ఇలా ప్రతికథ కూడా మనకు ఒక కథలాగా కాక మనచుట్టూ జరుగుతున్న సంఘటనలను గుర్తుకు తెస్తాయి. అనుభూతికి లోనయ్యేలా చేస్తాయి. సాధారణంగా కథలలో సమస్యను చిత్రించి వదిలివేస్తుంటారు. కాని మనోహర్ సమస్యలను గుర్తించి, చిత్రించి, పర్యవసానాల్ని వివరించి, చివరగా ఆ సమస్యలకు పరిష్కారం చూపడం అభినందనీయం. ఈ కథలు వయోభేదాలకు అతీతంగా అందరూ చదవాల్సినవి.

**తన ఉన్నతికి తానే కారణమని తన కృషితోనే తాను ఉన్నత స్థితికి చేరుకొన్నానని భావించి భ్రమించే కొడుకుకు తన ఉన్నతికి తండ్రి కారణమని తెలియజెప్పే కథ క్షమించవా? ప్రేరణ ద్వారా లేదా రెచ్చగొట్టడం ద్వారా లేదా దండించడం, ఆలోచింపజేయడం ద్వారా ఒక వ్యక్తిలోని ప్రతిభను వెలికి తీయవచ్చు. లక్ష్యసాధన దిశగా పరుగులు పెట్టించవచ్చు అని తెలిపే వ్యక్తిత్వ వికాస సూత్రాన్ని తెల్పిన కథ ఇది.**

వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనందున బాలలను చైతన్యపరిచేందుకు, వారికి స్ఫూర్తి కలిగించేలా, వారిలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించే విధంగా, సమకాలీన అంశాల పట్ల అవగాహన పెంపొందించేలా మరిన్ని ఇతివృత్తాలతో విలువైన కథారచనలు చేపడతాడని ఆశిస్తున్నాను. పాఠ్యపుస్తక రచయితగా, శిక్షకుడిగా, విషయ నిపుణుడిగా కూడా సేవలందిస్తున్న మనోహర్ బహుముఖ ప్రజ్ఞాశాలి. తన విషయ నిపుణత, నైపుణ్యం, మేధోశక్తి విద్యార్థులను భావిభారత ఆలోచనాత్మక పాఠకులుగా తీర్చిదిద్దడంలో ఉపకరిస్తాయని విశ్వసిస్తున్నాను.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్తు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# ఋతు వర్ణన

గంగుల శాయిరెడ్డి

గంగుల శాయిరెడ్డి 1890లో శివారెడ్డి, రామక్క దంపతులకు జనగామ జిల్లా జీడికల్ గ్రామంలో జన్మించారు. జీడికల్ గ్రామంలోని సంప్రదాయ వీధిబడిలో అక్షరాలు నేర్చుకున్న శాయిరెడ్డి, చిన్నతనంలోనే మహాభారతము, భాగవత రామాయణములను బట్టించుకున్నాడు. రామదాసు, అన్నమయ్య, రాకమచర్ల వెంకటదాసులు రాసిన కీర్తనలను ఆలపించేవారు.

గ్రామీణ నేపథ్యంలో నిసర్గమైన వాతావరణంలో శ్రమైక జీవనంలో వున్న అత్యధిక కష్టాలు, అత్యల్ప సుఖాల చిత్రణ ఆయన రచనలో కనిపిస్తుంది. రచనలను కొనసాగిస్తూనే మరోవైపు తెలంగాణ ఉద్యమంలో, నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొని, జైలు జీవితం గడిపారు. ఈయన 'కాపుబిడ్డ' కావ్యానికి సురవరం ప్రతాపరెడ్డి, గాడిచర్ల హరిసర్వోత్తమరావుల నుండి ప్రశంసలు లభించాయి. 1916 నుంచి 1926 వరకు ఆలేరు, పెంబర్తి, కొలనుపాకలతో సహా స్వగ్రామంలోనూ వీధి బడులు నడిపి చిన్నారులను తీర్చిదిద్దారు.

## వసంత ఋతువు

ముద్దుల బోయెడు మోదుగు వనమెల్ల
నెత్తురు పూలచే నిండుచుండ
పూదేనె గ్రోలగా పులుగుల గుమిగూడు
కలహించి ఉరులలో గ్రాలుచుండ
వట్టె కట్టెలు గట్టి వనవహ్ని లోబడి
కంచెల గట్టులు గాలుచుండ
ఎలుకల పాముల కెటుదారి లేకను
మంటలో పడి అవి మడయుచుండ
తుమ్మ కాయలు దినుటకై తోకలెత్తి
కురియ లావులు మేకలు గుమ్ముకొనగ
అవని దినమును గాంచెను అరుణకాంతి
కర్షకా నీదు ఘోరాల గాంతురెవరు!

## శరదృతువు

గుంట గుల్జేరాకు కొడవలిపై రాసి
తిలకముల్ నేర్చెడి వెలదులదిగొ
రామతులసి దెంచి రాగమ్ము చేకూర
నమలుచునునట్టి నాతులదిగొ
దూసర పులి చేరు దోరపండ్లను దూసి
పరుల బట్టల రుద్దు పడతులదిగొ
కరిమి కాయలు పరికి బలుసు పండ్లను మెక్కి
ఆనంద మొందెడి అతివ లదిగొ
పండ్లచే గొట్టుకొనుచున్న పడతులదిగొ
గంతులను వేసి ఆడెడు కన్న లదిగొ
హాలికా స్త్రీలు ముని కన్యలైరి గనుమ
కనుల పండుమ కర్షకా కాదె నీకు.

కథ

# కల్లోలం

**చైనా దురాగతాన్ని చెబుతూ మనల్ని హెచ్చరించే కథ...**



ప్రొ॥ రామా చంద్రమౌళి
93901 09993

వకుళ ఉలిక్కిపడి స్పృహలోకొచ్చింది.

ఒళ్ళంతా చెమట.. నైటీ తడిచి ముద్దై.. ఆవిరిలో స్నానించి ఒళ్ళు తుడుచుకోకుండా.. లోపలి.. ఆత్మలో నుండి.. ద్రవిస్తూ, ఘనీభవిస్తూ, మంచుగా.. పొగగా.. లోయల్లోనుండి ఆకాశంలోకి గాలై తేలిపోతూ.,

ఎక్కడుంది తానిప్పుడు.?

ముప్పై ఆరేళ్ళ వకుళ.. చిన్నప్పటి నుండి చదువు.. చదువు.. చదువే లోకమై, చదువే ఊపిరై.. చదువే ప్రాణమై.,

ఎన్నో యూనివర్సిటీలు.. మరెన్నో దేశాలు.. ఎన్నో ప్రాంతాలు.. ఇంకెన్నో జాతులు, నాగరికతలు, ఆక్రమణలు, ఉల్లంఘనలు, కిరీటాలు, నిచ్చెనలు, పాములు, అధికార పీఠాలు, కుట్రలు, పడదోయడాలు, అణచివేతలు, హత్యలు, మనుషులు మాయమైపోవడాలు, యుద్ధాలు, యుద్ధనీతి, యుద్ధరీతి, యుద్ధానంతర స్మశాన ప్రశాంతత, రాజ్యాలు, రాజ్య విస్తరణలు, కవోష్ణ రక్తప్రవాహాలు, నిశ్శబ్ద వ్యూహాత్మక ఘటన ప్రతిఘటనలు.,

అంతిమంగా విజయమే పరమావధిగా.. సుదీర్ఘ క్షితిజ సమాంతర రేఖపై.. ఒక ప్రజ్వలిత అగ్నిగోళమై.. వెలుగు.. వెలుగు.. వెలుగు.

వెలుగే శాశ్వతమా.. వెలుగును కన్న చీకటే శాశ్వతమా.?

వకుళ అప్పటినుండీ ఎవరో తరుముతూ తరుముతూ వచ్చీ వచ్చీ మాయమై.. తను విషణ్ణయై.,

తను ఒక అంతర్జాతీయ ప్రసిద్ధ మీడియా కంపనీకి 'ఎక్స్‌ఫర్ట్, ఇండో-ఫసిఫిక్ స్ట్రాటజిక్ అఫ్పైర్స్‌గా'.. చాలా ఒత్తిడిలో ఉందామె.

'విస్తరణ.. ఆక్రమణ.. కబళింత'... ఈ మూడు చర్యలూ ఒకటేనా అని ప్రశ్నించుకుందామె.

జవాబు దొరకలేదు. చకచకా ఒక గ్లాసు మంచినీళ్ళు తాగి.. కళ్ళను చికిలించి.. నులుముకుని పూర్తిగా మేలుకుంది.

అప్పుడామె కళ్ళముందు జనరల్ సెక్రెటరీ, చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీకి గ్జి జిన్‌పింగ్ ముఖం స్పష్టంగా కనిపించి మెలమెల్లగా రూపం కరిగిపోతూ ఒక కోరలు చాచిన పులిగా, మళ్ళీ అది డిసాల్వై గర్జిస్తున్న సింహంగా, తన పాదముద్రలను తన తోకతో తనే తుడిచేసుకుంటూ పరుగెత్తుతూ మాయమౌతున్న తోడేలుగా.. కనిపిస్తూ కనిపిస్తూ.. విచ్చుకుపోతున్న పొగమంచులా.,

ఒక అనిశ్చితి అంతా.

హాంగ్‌కాంగ్, మయన్మార్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్, టిబెట్, జిబౌటీ, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషిఏటివ్, సిల్క్ రోడ్స్, చివరి అధ్యాయంగా ఆక్రమణకూ, కబళింతకూ గురై విలవిల్లాడుతున్న హిందూ మహాసముద్రమూ కళ్ళముందు కదలాడి.. వకుళ చిగురుటాకులా కంపించిపోయింది.

ఇవన్నింటి మధ్య ఒక ఇండియా.

ఎంత ప్రయత్నించినా నిద్ర రావడంలేదు. అటుఇటూ బొర్లి ఇక అశాంతిని భరించలేక లేచి కూర్చుని కిటికీ దగ్గరికి నడిచి.. ఆకాశంలోకి చూసింది వకుళ. తెల్లవారుతోంది ఎర్రగా. అత్యధిక మేధోవలసలతో కునారిల్లుతున్న భారతదేశ ఆంతరంగిక స్థానిక స్థితిగతులు ఎట్లున్నాయోనని తనలోకి తాను తొంగి చూసుకుంది వకుళ. టకటకా ల్యాప్‌టాప్ తెరిచి ఆన్ చేసింది.

ప్రపంచంలో అత్యధిక ప్రామాణికమైన ఔషధాలను తయారు చేయడంలో భారతదేశ స్థానమెంత.. అని ప్రశ్న.

భారతదేశానికి ' ఫార్మా హబ్ ' అని పేరుంది.

ప్రపంచ స్థాయిలో భారతదేశం అతి పెద్ద మూడవ ఔషధ తయారీదారు.

ఐతే.. ఇందులోని డొల్లతనమెంతంటే..' యాక్టివ్ ఫార్మాస్యుటికల్ ఇంగ్రేడియంట్స్ అని పిలువబడే పారసిటమాల్, అమాక్సిల్లిన్, ఐబుప్రొఫెన్, పెన్సిలిన్ జి, లెవొడోపా, స్ట్రెప్టోమైసిన్, కార్బిడోపా, వాంకొమైసిన్, జెంటామైసిన్,

ప్రొగెస్టెరోన్ ముడిపదార్థాలకు మాత్రం భారతదేశ ఔషదపరిశ్రమ 70%, కొన్నింటి విషయంగా ఐతే పూర్తి 100% చైనా మీదనే ఆధారపడి ఉన్నై. బల్క్ డ్రగ్స్, డ్రగ్ ఇంటెర్మీడియేట్స్ అని వ్యవహరింపబడే చైనా సరఫరా చేస్తున్న పదార్థాల విలువ దాదాపు 3.84 బిల్లియన్ డాలర్లు ప్రతి సంవత్సరానికి . భారతదేశానికి కావలసిన బల్క్‌డ్రగ్స్‌లో మొత్తం 12% సరఫరా చేస్తున్న చైనాపైన మనం ఆధారపడి ఉండడం నిజంగా సిగ్గుచేటైన విషయమే. ఇది ఒక రకంగా వ్యూహాత్మక తప్పిదమే. ఇక్కడి ప్రసిద్ధ ఫార్మసిస్ట్‌లూ, తత్సంబంధ వ్యాపారులూ మొన్న కోవిడ్ సమయంలో ఈ చైనా బల్క్ డ్రగ్ సప్లై లేకపోవడంతో విలవిల్లాడిపోయారు. ఒక ఉత్పత్తి విషయంలో ప్రపంచస్థాయి ఖ్యాతిగల దేశం ఆపద సమయంలో చైనాపై మాత్రమే ఆధారపడడం.. నిస్సహాయతతో దిక్కులు చూడ్డం.. కించిత్తు ఆలోచించ దగ్గ న్యూనతేగదా.

1990లో భారతదేశం చైనాకంటే ధనిక దేశం. కాని ఇప్పుడు అంటే 2019 నాటికి చైనా జిడిపి భారతదేశం కన్నా 4.61 రెట్లు ఎక్కువ. ఎందుకు. ఈ 30 ఏళ్ళలో చైనా ప్రపంచ ప్రథమస్థాయి ఆర్థిక అగ్రరాజ్యంగా ఎట్లా ఎదుగగల్గింది. 1977లో అధికారంలోకి వచ్చిన డెంగ్ షాపింగ్ మావో కాలంలో జరిగిన అనేకానేక పరిపాలనాపరమైన తప్పులను సవరించి, సంస్కరించి.. చైనాలో అత్యధికంగా లభించే మానవ వనరులను నిబద్ధతతో కూడిన ఒక అపూర్వ శక్తిగా మలచి 1980 లలో షెంజెన్ నగరంతో సహా 14 తీరప్రాంత నగరాల్లో ప్రారంభించిన 'స్పెషల్ ఎకనామిక్ జోన్స్'... పెట్టుబడిదారులకు అనేక పన్ను రాయితీలు కల్పించి ఒక విప్లవాత్మక పారిశ్రామికీకరణతో దేశంలో అప్పుడున్న 88.23% పేదరికాన్ని ఇప్పటి గ్జి జిన్‌పింగ్ వచ్చేనాటికి 0.7% శాతానికి తగ్గే పాలనా సమర్థతను కల్పించాడు. ఒకసారి రైలు పట్టాలు ఎక్కిన తర్వాత ఇక దాని వేగాన్ని పెంచి తొందరగా గమ్యాన్ని చేర్చడం సరియైన నిజాయితీగల పాలకునికి సులభతరమైన సాధ్యతే. ఇక ఆ తర్వాత 2013 లో ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన జిన్‌పింగ్ చైనాను ప్రపంచ అగ్రదేశంగా మలిచే లక్ష్యంతో దాదాపు నియంత స్వభావాన్ని కఠినంగా అమలుచేస్తూ చైనాను ప్రపంచ ధనికదేశంగా రూపొందించాడు.

ఐతే జిన్‌పింగ్ చేపట్టిన అతిదూకుడు చర్యలన్నీ అతనికి అనేకమంది శత్రువులను తయారు చేసినా అతి శక్తివంతున్ని చేసి అతన్ని చైనాయొక్క జీవితకాల శాశ్వత అధ్యక్షున్ని చేశాయి. భయంతో కూడిన క్రమశిక్షణాయుత వ్యూహాత్మక ప్రస్థానమే అంతిమంగా మనిషిని విజయుణ్ణి చేస్తుందని జిన్‌పింగ్ సిద్ధాంతం.

'ఆర్ట్ ఆఫ్ వార్' పుస్తకంలో చైనీయుల ఆరాధ్య దైవమైన సన్ టు చెప్పినట్టుగా 'సకల యుద్ధ తంత్రాలన్నీ కేవలం వంచన మరియు మోసాలపైననే ఆధారపడి ఉంటాయి' అన్న సూత్రాన్ని జిన్‌పింగ్ పూర్తిగా విశ్వసించి ఆచరిస్తున్నట్టు ప్రస్తుతం చైనా అనుసరిస్తున్న విధానాలు చెబుతున్నాయి.

రాజ్యాలను, ప్రాంతాలనూ ఆక్రమించుకుని వాటిని స్వంతం చేసుకోవడం కేవలం యుద్ధాలతో మాత్రమే కాదనీ మభ్యపెట్టి ఒట్టి నిస్సహాయులను చేసికూడా మనుషులనూ, దేశాలనూ పాదాక్రాంతం చేసుకోవచ్చని జిన్‌పింగ్ ఋజువుచేస్తున్నాడు. ఆకలి అవుతున్నవానికి అన్నం పెట్టి ప్రతిగా వాణ్ణి బానిసను చేసుకోవడం అతని పాలసీ. ముందు ఆక్రమణ లక్ష్యాలను స్పష్టంగా నిర్వచించుకుని ఆ గమ్యాన్ని చేరడానికి దీర్ఘకాలిక వ్యూహాన్ని బోనులో ఎరగా పెట్టి అంతిమంగా ప్రపంచాన్ని జయించాలన్న కుతంత్రంతో ప్రస్తుతం చెస్ ఆడుతున్నాడు పింగ్. బయటి ప్రపంచానికి చైనాలో ఏమి జరుగుతోందో ఎవరికీ తెలియదు. మీడియా, ప్రెస్, ఇతరేతర సమాచార వ్యవస్థలన్నీ కూడా ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటై. ఎదిరించినవాడు 'కాలగర్భంలో కలిసి పోతాడంతే.

చేతికి రక్తమంటదు.. మనిషి మాయమైపోతాడు.

దేశాలకు దేశాలనే నిర్వీర్యం చేస్తూ జనాన్ని ఎట్లా వెధవలను చేయాలో అల్రెడీ మన భారతదేశంలో చేసి చూపించాడు జిన్‌పింగ్. ఇక్కడి ప్రజలు నిద్రపోకుండా నిజమైన సోయితో ఉంటే అంతా అర్థమౌతుంది సులువుగానే.

"గుడ్మార్నింగ్ మేడం" అన్న అలికిడితో వకుళ వెనక్కి తిరిగి చూచింది.



కథ

ఎదుట ఆశ. తన అసిస్టెంట్. పి.హెచ్‌డి చేస్తోంది తన దగ్గర.. 'ఇంటర్నేషనల్ స్ట్రాటజిక్ ప్లానింగ్' అన్న అంశంపై.

"ఈ రోజు నీకు ఒక విలువైన పాఠం చెబుతాను ఆశా. గెట్ రెడీ.. వన్ డే ప్రోగ్రాం" అంది వకుళ.

"థాంక్యూ మేడం.."

"ఒక ఏ ఫోర్ షీట్ కాగితం తీసుకో. దెన్ రైట్‌డౌన్"

పూర్తిగా తయారై ఇక బయటికి వెళ్ళడానికి సిద్ధమై వకుళ అంది "ఈ మధ్య.. ప్రత్యేకించి ఈ కోవిడ్ కాలంలో మనందరం వింటున్న రెండు మూడు విషయాలు చెప్పు ఆశా" అని.

ఒకటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అది కోవిడ్ కాదు చైనా వైరస్ అని పదే పదే అనడం. రెండవది.. చైనా విపరీతంగా భారతదేశమంతా విస్తరించిన సత్యాన్ని ఇన్నాళ్ళ మొద్దు నిదుర వీడి కేంద్ర ప్రభుత్వం ఉక్రోషంగా 'బాయ్‌కాట్ చైనా' అని పిలుపునివ్వడం...

"చైనా విపరీతంగా విస్తరించడం గురించి నీకు తెలుసా?"

"కొంత విస్తరించడం గురించే తెలుసు. దాదాపు జనాన్ని మోసంచేసే, దగా చేసే ఆప్‌లన్నీ చైనావేనని"

"అట్లా కాదు. మన డైలీ రొటీన్ లైఫ్‌లో ఎక్కడెక్కడ ఈ చైనావాడు మనకు తారసపడ్తున్నాడో ఒక రియాల్టీ చెక్ చేద్దాం మనం పద. కారెక్కు"

ఆశ డోర్ తెరిచి వకుళ ఎక్కిన తర్వాత తనుకూడా ప్రక్క సీట్‌లో కూర్చుని.

"ఇంతకు ముందు గ్రోసరీస్ లిస్ట్ చెప్పినగదా. మొత్తం ఎన్ని సరుకులు."

"అన్నీ కలిపి అరవైరెండు ఐటంస్ మేడం"

"ఎవరికి పంపుతున్నావ్ ఆన్‌లైన్లో"

"ఎప్పటిలాగే బిగ్ బాస్కెట్ వాళ్ళకే"

కార్ స్టార్టై....

"చెబుతా విను.. బిగ్ బాస్కెట్ అనేది భారతదేశంలో దాదాపు 40% మార్కెట్ షేర్‌ను కలిగి ఉన్న అతిపెద్ద గ్రోసరీ ఆన్‌లైన్ షాప్. అందులో చైనాకు చెందిన

**"రేపు నేను ఢిల్లీకి పోవడానికి నువ్వు మేక్ మై ట్రిప్. కాం వాడుతావు కదా, భారతీయ మార్కెట్‌లో దీని షేర్ 51%. ఈ కంపనీలో చైనాకు చెందిన సి ట్రిప్‌ది 55 % వాటా. ఇక హెూటెల్ బుకింగ్ రంగంలో మనం ఏ సిటీకి వెళ్ళినా కనబడేది ఓయో బోర్డులే. ఇది మహమ్మారిలా వ్యాపించి భారతీయ జనాన్ని తినేస్తోంది. ఇది 68% హెూటెల్ బుకింగ్స్‌ను హస్తగతం చేసుకుంటుంది.**

బిగ్ ట్రైకూన్ అలీబాబా స్టేక్ 30% ఉంది.. ఇప్పుడు మన ఆర్డర్‌ను జియోమార్ట్‌కు పంపు".

"ఇప్పుడు మన ఆఫీస్‌కు పోదాం"

ఇద్దరూ ఆఫీస్ మెట్లెక్కుతున్నపుడే మేనేజర్ బన్సల్ ఎదురై "మేడం ఓలా క్యాబ్ తీసుకుని సెక్రెటేరియట్‌కు వెళ్తున్నా" అని చెబుతూ పరుగెత్తాడు.

"నోట్ డౌన్ ఆశా.. మనదేశంలో ఓలా మార్కెట్ షేర్ 56.2 % ఉంది. దీనిలో చైనాకు చెందిన టెన్‌సెంట్, చీనా-యురేసియన్ ఎకనామిక్ కోపరేషన్ ఫండ్ మొత్తం గరిష్టంగా 62% ఉంది"

"ఆఫీస్‌లోకి వెళ్ళిన తర్వాత వకుళ అడిగింది ఆశను" మన ఆఫీస్‌లో స్టాఫ్ దాదాపు ఏ బ్రాండ్ మొబైల్స్‌ను వాడుతారు ఆశా " అని.

ఆశా అంది "మిడిల్ రేంజ్ మేడం.. వివో. ఒప్పో, రెడ్మీ, షామి, వన్ ప్లస్ వంటివి"

"కదా.. భారతీయ మార్కెట్‌లో ఈ చైనా బ్రాండ్స్ షేర్ దాదాపు 72%"

"మనం రోజూ స్టాఫ్‌కు జొమాటో వాళ్ళకేగదా లంచ్ ఆర్డర్ పెడ్తున్నది"

"ఐతే విను జొమాటో మార్కెట్ షేర్ ప్రస్తుతం 52%. స్విగ్గీ షేర్ 43%. ఈ రెండు కంపనీలలో చైనాకు చెందిన అలీబాబా వాటా, టెన్సెంట్, హిల్‌హౌజ్ క్యాపిటల్ వాటాలున్నయ్."

"ఇక వీళ్ళకు డబ్బు చెల్లిస్తాంగదా. అందుకు ఎక్కువగా paytm వాడుతారు చాలామంది. దీంట్లో చైనా అలీబాబా షేర్ 40%. చాలా పాప్యులర్ ఆన్‌లైన్ షాపింగ్ కంపనీ ఫ్లిప్ కార్ట్ గురించి.. ఇందులో 55% టెన్సెంట్ హెూల్డింగ్స్, స్టెడ్ వ్యూ క్యాపిటల్ ఉన్నాయి. స్నాప్‌డీల్ కంపనీలో అలీబాబా ఎఫ్ ఐ హెచ్ వాళ్ళది మేజర్ షేర్."

"రేపు నేను ఢిల్లీకి పోవడానికి నువ్వు మేక్ మై ట్రిప్. కాం వాడుతావు కదా, భారతీయ మార్కెట్‌లో దీని షేర్ 51%. ఈ కంపనీలో చైనాకు చెందిన సి ట్రిప్‌ది 55 % వాటా. ఇక హెూటెల్ బుకింగ్ రంగంలో మనం ఏ సిటీకి వెళ్ళినా కనబడేది OYO బోర్డులే. ఇది మహమ్మారిలా వ్యాపించి భారతీయ జనాన్ని తినేస్తోంది. ఇది 68% హెూటెల్ బుకింగ్స్‌ను హస్తగతం చేసుకుంటుంది. OYO కంపనీలో చైనా లాడ్జింగ్ కంపనీ, దీదీ చుక్సింగ్ కంపనీ మేజర్ స్టేక్ హెూల్డర్స్."

"మేడం ఈ చైనావాడు మన దేశాన్నంతా అప్పడంలా నమిలేస్తు న్నాడుగదా.. ఎట్లా" అంది ఆశ దిమ్మ దిరిగిపోతున్నట్టు ముఖాన్ని జారేసి.

"అప్పుడే ఐపోలేదు తల్లీ.. ఇంకా ఉంది భారతం.. మన దేశంలో కరోనావల్ల బాగా లాభపడ్డ ఏకైక సంస్థ బైజు ఎడ్యుకేషన్ కంపనీ. అది ఆన్‌లైన్ క్లాస్‌లు నిర్వహిస్తూ షారుక్ ఖాన్ అంబాసిడర్‌గా దోచుకుంటోంది. దీనిలో మేజర్ స్టేక్ టెన్సెంట్ హెూల్డింగ్స్‌ది. ఇక ఆప్స్‌కు వస్తే ప్రపంచంలోనే అతి ప్రాచుర్యం పొంది ఆత్మహత్యలకు కూడా కారణమైన 'Tik Tok' ఒక్క భారతదేశంలోనే 48% డౌన్ లోడ్స్‌ను పొంది ప్రతి మూడు మాసాలకు 100 కోట్ల రూపాయలను కొల్లగొట్టింది. అలాగే DREAM 11 స్పోర్ట్స్ గేం, PUBG విపరీతమైన పిచ్చితో పిల్లలూ పెద్దలూ ఆడే గేం.. వీటన్నింటిలోనూ అధిక స్టేక్ టెన్సెంట్ హెూల్డింగ్స్, స్టెడ్ వ్యూ కంపెనీలదే. ఇవిగాక పాలసీ బజార్.. ఇన్సూరెన్స్ కంపెనీ, స్వికర్, 80% ఫార్మా API, 60% మెడికల్ డివైజెస్, 85%

టాయ్స్, ఎలక్ట్రికల్ మెషినరీ, సోలార్ సిస్టంస్, ఫర్నిచర్, ఐరన్ అండ్ స్టీల్, గ్రానైట్, ప్రతి ముప్పై స్టార్టప్ కంపనీలలో 18 కంపనీలకు చైనా ఫండింగ్.. ఈ రకంగా ప్రతి నెల వంద మిలియన్ డాలర్ల వ్యాపారం భారతదేశంతో"....

ఆశ నిట్టూర్చింది తట్టుకోలేక. "ఏమిటిది మేడం.. ఎన్నెన్ని రంగాల్లో ఈ చైనా విస్తరించి మనకు కేన్సర్ రోగంలా పట్టుకుంది." అంది నీరుగారిపోతూ.

"దీన్నే స్ట్రాటజిక్ ఓవర్ పవరింగ్ అంటారు. ఇక్కడ ఒక ఖాళీ ఏర్పడగానే దాని మరుక్షణమే తమ వస్తువులతో, తెలివితో, పెట్టుబడులతో, సమయస్ఫూర్తితో కొత్త అలవాట్లను పరిచయం చేస్తూ.. దూసుకొచ్చి కొల్లగొట్టడం. ఇప్పుడు చెప్పు మన శరీరంలో రక్తంలా వ్యాపించుకుపోయిన చైనాను బాయ్‌కాట్ చేయడం సంభవమేనా. ఇక్కడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, కంపనీలు, అధికారులు, జనం, ముఖ్యంగా యువత, ప్రజలు ఏకోన్ముఖులై ఎదుర్కుంటే తప్ప చైనా రాక్షసిని మనం తరిమేయలేము."

"ఈ రోజు పాఠం చాలా భయంకరంగా ఉంది మేడం.. నాణెం రెండోవైపు కనబడింది."

"దాన్నే జ్ఞానం అంటారు" అంది వకుళ.

తపః సమాధిలో తనను తాను కోల్పోయినట్టున్న యోగినిలా చెబుతూపోతున్న వకుళను నిశ్శబ్దంగా వింటూ రాసుకుపోతోంది ఆశ.

ఆయుధం అంటే ఆత్మరక్షణకోసమేనని భారతీయ ప్రాణసమమైన వేదవిజ్ఞానం చెబుతోంది. కాని అధికార దాహంతో రగిలిపోయే ప్రాచ్యదేశాలన్నీ ఆయుధాలంటే శత్రువులపై యుద్ధం చేయడానికి మాత్రమే ఉపయోగిస్తూ ఆక్రమణలను కొనసాగించడానికేనని అర్థంచేసుకుని ఉపయోగిస్తున్నాయి శతాబ్దాలుగా. ఇక్కడే ధర్మం, నీతి, నైతికత, న్యాయం వంటి ఉదాత్తమైన మానవీయ ప్రస్తావనలు భారతదేశంలో ధ్వనిస్తూంటాయి ఎప్పుడూ. అందుకే భారతదేశాన్ని వేదభూమి అని సంబోధించారు మన పూర్వీకులు. ఈ విషయాన్ని గత వందల సంవత్సరాలకు పూర్వం జ్ఞాన సముపార్జనకోసం ఈ పుణ్యభూమిని సందర్శించిన మెగస్తనీస్, హుయాంత్సాంగ్ వంటి విదేశీ పర్యాటకులు ప్రస్తుతించారు, స్తుతించారు కూడా. మౌఖికంగా వెలసిన వేదజ్ఞానం నాల్గు వేదాలు ఋగ్, యజుర్, సామ మరియు అధర్వణ వేదాలుగా ఉద్భవిస్తే వాటి ఉపాంగాలైన ఆరు జ్ఞానగ్రంథాలు శృతి, స్మృతి, ఆగమం, పురాణం, ఇతిహాసం మరియు సిద్ధాంతంగా వెలసి గణితం, ఫిజిక్స్, జీవశాస్త్రం, ఫిలాసఫీ, ఖగోళ శాస్త్రం, భాషా శాస్త్రం వంటి సైన్స్ అండ్ టెక్నాలజీ జ్ఞానాన్ని సమగ్రంగా ఈ మానవజాతికి అందించింది భారతదేశం. 510 C.E నాటికే ఆర్యభట్టుడు సున్నా అన్న భావనను ప్రస్తావించి జగత్తుకు ఒక కొత్త దిశను ప్రసాదిస్తే, వేగం దూరం/కాలం అన్న సమీకరణాన్ని రూపొందిస్తే దాన్నే వేయిఏండ్ల తర్వాత గెలీలియో గెలీలి 1638లో కొత్తగా ప్రపంచానికి తెలియజేసినట్టు.. వక్రీకరించబడ్డ చరిత్ర చెబుతూండగా...



చైనాది మొదటి నుండీ దురాలోచనే. ఆక్రమణ, అధికార తాపత్రయం, కుత్సిత తత్వం, వంచన, నమ్మించి వ్యూహాత్మకంగా ద్రోహం చేయడం.. ఇవన్నీ దాని సహజ లక్షణాలు. 2000 సంవత్సరాలనాడు ఆసియా ఖండంలో కనెక్టివిటీని పెంచి అన్ని దేశాలూ వృద్ధిచెందాలనే సత్సంకల్పంతో హాన్ డైనాస్టీ ప్రారంభించిన 'సిల్క్ రోడ్' అలోచనను పునరుద్ధరించి 2013 లో 'BELT AND ROAD INITIATIVE- BRI పేర 140 బీద, చిన్న దేశాలకు అభివృద్ధి బూచిని చూపి ప్రపంచ వ్యాప్త ఇంఫ్రాస్ట్రక్చర్, పవర్ ప్రాజెక్ట్‌లు, పోర్ట్‌లు, రిఫైనరీలు, రైల్వేలు, ఏర్‌పోర్ట్‌లు నిర్మించి ఇస్తూ అందరినీ అప్పులపాలు చేస్తూ అణచివేతను కొనసాగిస్తూ అప్రత్యక్షంగా అన్ని చోట్లా తన సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకుంటూ... ప్రపంచ అగ్రరాజ్యంగా వెలిగిపోవాలని తపిస్తున్న దాహార్తి... చైనాను విచక్షణ హీనుణ్ణి చేస్తోంది. జిన్‌పింగ్ మౌనంగా ఉంటూ ఈ రాక్షస క్రీడను నడుపుతూ... ఆసియా దేశాలను రెండు ధృవాలుగా సమీకరిస్తున్నాడు. అటు హాంగ్‌కాంగ్ పై దౌర్జన్యం చెలాయిస్తూనే భారతదేశం చుట్టూ ఒకటి.. చైనా పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (CPEC). దీనివల్ల పాకిస్తాన్ తన దాయాది దేశమైన భారత్‌పైకి చైనాను ఉసిగొల్పి శక్తివంతమైన ప్రచ్ఛన్న యుద్ధం చేస్తుంది. Pakistan Occupied Kasmeer

కథ

ద్వారా ఇప్పటికే చైనా వందల కిలోమీటర్ల రోడ్ వేసి కరాచి పోర్ట్‌నూ, గ్వదర్ నౌకాశ్రయాన్నీ గిల్గిట్ ద్వారా ఒక సైనిక స్థావరంగా మార్చి 62 బిలియన్ డాలర్లను ఖర్చు చేసి ఇండియాకు వాయవ్య దిశలో పొంచిఉన్న పులిలా తయారు చేసుకుంది. రెండు.. బంగ్లాదేశ్ చైనా ఇండియా మయన్మార్ ఎకనామిక్ కారిడార్. (IMEK). దీనివల్ల ఇండియాకు తూర్పు తీరంగుండా తన సైనిక బలగాలను పంపి భవిష్యత్తులో దాడి చేయడానికి మార్గం సుగమం చేసుకుంది. మూడు.. ట్రాన్స్ హిమాలయన్ ఎకనామిక్ కారిడార్ (THEC). ఈ ప్రాజెక్ట్ కింద చైనా తన కెరుంగ్ నగరంనుండి నేపాల్‌ను పాలుపోసి పెంచిన పాములా తయారు చేసుకుని ఆ దేశంద్వారా ఖట్మండూ, బైరేని, లుంబిని, పొఖారా నగరాలను కలుపుతూ.. అద్భుతమైన రోడ్లను నిర్మించి ఇచ్చి హిమాలయ ప్రాంతాల్లో వ్యూహాత్మక సైనిక గ్రామాలను నిర్మించింది. ఉత్తరం నుండి ఇండియా పైకి గురి పెట్టబడ్డ అణ్వాయుధ దాడికి ఇది స్థావరం. నాల్గవది.. మార్టైం సిల్క్ రోడ్. (MSR). దీనితో బంగ్లాదేశ్ నుండి అండమాన్, శ్రీలంక, ఖంబట్ ఇండియా, ఒమన్ లను కలుపుతూ హిందూ మహాసముద్ర జలాలగుండా అంతర్జాతీయ మార్గం ఆవిష్కృతమౌతుంది. దీనిలోనే శ్రీలంక 1.4 బిలియన్ డాలర్ల చైనా అప్పును తీర్చలేక 99 ఏండ్లకు లీజ్ రాసిచ్చిన హంబన్‌టోటా నౌకాశ్రయం, కొలంబో పోర్ట్ లీజ్, కొలంబో సిటీ నిర్మాణం.. అన్నీ క్షిప్తమై ఉన్నయ్. ఈ నాలుగుగాక అటు పైన భారతదేశ తూర్పున ఉన్న అరుణాచల్ ప్రదేశ్ మాదే అని చైనా ఎప్పటినుండో వాదిస్తున్న పంచాయితి ఉండనే ఉంది. ఈ ఐదు కారిడార్ల నిర్మాణంతో చైనా ఇండియాపై అన్ని వైపులనుండి మూకుమ్మడి దాడికి క్షిపణులను వర్కబుల్ రేంజ్‌లో నుండి ప్రయోగించే అనుకూలతను సాధ్య పర్చుకుని పొంచి ఉంది ఆకలిగొన్న పులిలా.

> **అమెరికాకు కూడా సాధ్యం కాని ధ్వని వేగానికంటే 5 రెట్ల వేగంతో పయనిస్తూ ఏ రాడార్ వ్యవస్థకూ చిక్కని హైపర్‌సానిక్ క్షిపణులను తయారు చేసి మొన్న జూలై 21న, ఆగస్ట్ 13న ప్రయోగించి ప్రపంచాన్ని నివ్వెరపర్చింది చైనా. కార్బన్ న్యూట్రాలిటీని కూడా సాధించింది. టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై సీరియల్ డ్యాంలను నిర్మించి ప్రపంచం లోనే అతిపెద్ద 60 గిగా వాట్స్ జలవిద్యుత్ కేంద్రాన్ని స్థాపించి అనుకుంటే కృత్రిమ వరదలనూ, కరువులనూ సృష్టించి పొరుగు దేశాలను శాసించగలిగే స్థితికి ఎదిగింది.**

ఇక యుద్ధ తంత్రం విషయంగా చైనా సాధించిన ప్రగతి అనన్య సామాన్యమైంది. అమెరికాకు కూడా సాధ్యం కాని ధ్వని వేగానికంటే 5 రెట్ల వేగంతో పయనిస్తూ ఏ రాడార్ వ్యవస్థకూ చిక్కని హైపర్‌సానిక్ క్షిపణులను తయారు చేసి మొన్న జూలై 21న, ఆగస్ట్ 13న ప్రయోగించి ప్రపంచాన్ని నివ్వెరపర్చింది చైనా. కార్బన్ న్యూట్రాలిటీని కూడా సాధించింది. టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై సీరియల్ డ్యాంలను నిర్మించి ప్రపంచంలోనే అతిపెద్ద 60 గిగా వాట్స్ జలవిద్యుత్ కేంద్రాన్ని స్థాపించి అనుకుంటే కృత్రిమ వరదలనూ, కరువులనూ సృష్టించి పొరుగు దేశాలను శాసించగలిగే స్థితికి ఎదిగింది. దాదాపు 1000 న్యూక్లియర్ వార్ హెడ్స్‌తో యుద్ధానికి సన్నద్ధమై ఉంది చైనా ఇప్పుడు. ఇంతవరకు ఏ దేశమూ సాధించని 'బ్రెయిన్ కంట్రోల్ ఆయుధాలను' తయ్యార్ చేసి సిద్ధంగా ఉంచుకుంది. యుద్ధంలో రోబట్ ట్యాంకులనూ, రోబట్ సైన్యాన్నీ వాడడం చేయగలదిప్పుడు చైనా. ప్రపంచానికి తెలియని రహస్య బయో ఆయుధాల సంపద తన వూహాన్ ల్యాబ్‌లో సిద్ధంగా ఉండనే ఉంది.

ఇక జిన్‌పింగ్ విలాసంగా విషపు నవ్వును చిందిస్తూ.. నిరామయంగా కనిపించక ప్రపంచ ప్రజలకు ఇంకెలా కనిపిస్తాడు.

యథా యథాహి ధర్మస్య.,

ఇక్కడ మన భారతదేశంలో మాత్రం మనం.,

OTTల్లో బూతు సినిమాలూ, వీడియోలూ చూస్తూ పగలబడి నవ్వుతూ.. రాత్రి పబ్బుల్లో ఆడామగా తప్పతాగి తూలుతూ కార్లు నడుపుతూ అడ్డువచ్చిన ఎవన్నైనా గుద్ది చంపుతూ మర్నాడే బెయిల్‌పై విదుదలై నవ్వుతూ వెళ్లిపోతాం.. మన బుద్ధిమంతులైన రాజకీయ నాయకులు ప్రజలను మరిచిపోయి ముఖ్యమంత్రులను కూడా 'ఒరేయ్ లుచ్చా, లఫంగా, సువ్వర్‌కే బేటా, బోసిడికే' వంటి అచ్చమైన తిట్లుతిట్టి మైమర్చిపోతూ.. బడి పోరగాండ్లు ఆన్‌లైన్ క్లాసులకోసం పెద్దలు కొనిచ్చిన స్మార్ట్ ఫోన్లలో పాఠాలు తప్ప నిరంతరం గూగుల్ గురు ఫ్రీగా అందించే బూతు బోల్డ్ బ్యూటీల అందాలనూ.. రహస్యంగా సంభోగ కథనాలనూ, భంగిమలనూ వీక్షిస్తూ ఓహో.. ఇదేనా ప్రేమంటే అని ఆశ్చర్యపోతూ.. సంక్షేమ పథకాల డబ్బుతో ఫుల్లుగా తాగి తాగి.. పౌరులందరూ పరవశులై ఉండగా.. పెద్దలు ఈ దేశ శేష వ్యవస్థలను కార్పోరేట్లకు అమ్మేస్తూ.. బ్యాంకులను మాల్యాలు, మోడీలు కొల్లగొట్టి హాయిగా పరిహసిస్తూ.. అంతా సుభిక్షమే. సమస్త లోకా సుఖినోభవంతు.

"ఇక రాయడానికేమీ లేదు ఆశా. నిద్రస్తోంది. నువ్వు కూడా ఈ అందరు భారత పౌరుల్లా హాయిగా నిద్రపో.. గో" అంది వకుళ నిశ్శబ్దంగా దుఃఖిస్తూ. ది ఎక్స్‌ఫర్ట్, ఇండో-ఫసిఫిక్ స్ట్రాటజిక్ అఫైర్స్.

భారతదేశం ఇప్పుడు అడ్డూ అదుపూ లేని 'అతిస్వేచ్ఛ' అనే భయంకరమైన వ్యాధితో కుళ్ళిపోతోంది.

సాహితీ శిఖరం

కావ్యాలలో సంస్కృతికి పట్టాభిషేకం చేసిన

# వినాయక కృష్ణ గోకాక్

జ్ఞానపీఠ పురస్కార (1990) గ్రహీత



1909 ఆగస్ట్ 9న జన్మించిన వినాయక కృష్ణ గోకాక్ కన్నడ రచయిత. ఆంగ్లం మరియు కన్నడ సాహిత్యాలలో గొప్ప పండితుడు. గోకాక్ 1990లో, ఆయన రచన "భారత సింధు రష్మి"కి జ్ఞానపీఠ్ అవార్డు అందుకున్నారు. "భారత సింధు రశ్మి" మహా కావ్యం. ఇది 12 ఖండాలు, ముప్పై అయిదువేల పద్యపాదాలున్న కావ్యం. ఋగ్వేద కాలం నాటి జనజీవన విధానాన్ని గురించి వ్రాసిన గ్రంథం. విశ్వామిత్ర ఈ కావ్యంలోని నాయకుడు. 1961లో భారత ప్రభుత్వం గోకాక్‌కి పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. గోకాక్ కన్నడ సాహిత్యంలోకి ప్రవేశించిన ప్రారంభ సమయంలో ఆయనకు మార్గదర్శకత్వం వహించిన కన్నడ కవి డి.ఆర్. బేంద్రే చే తీవ్రంగా ప్రభావితమయ్యాడు. గోకాక్ "వినాయక" అనే కలం పేరుతో 'సముద్ర గీతాలు', 'బాలదేగులదల్లి', 'అభ్యుదయ', 'ధ్యవ పృథ్వీ' మరియు 'ఊర్ణాభ' వంటి అనేక కవితా సంకలనాలు రాశారు. గోకాక్ యొక్క రచనలు మతం, తత్వశాస్త్రం, విద్య మరియు సంస్కృతుల పట్ల ఆయన ఆసక్తిని ప్రతిబింబిస్తాయి. ఆయన 1992 ఏప్రిల్ 28న మరణించారు.

వర్ణ వివక్షపై సంధించిన అక్షరాయుధం...

# నాడైన్ గోర్డిమర్

నోబెల్ బహుమతి (1991) పురస్కార గ్రహీత



1923 నవంబర్ 20 న జన్మించిన నాడైన్ గోర్డిమర్ దక్షిణాఫ్రికా కి చెందిన రచయిత మరియు రాజకీయ కార్యకర్త. ఆమె 1991లో సాహిత్యంలో నోబెల్ బహుమతిని అందుకుంది. గోర్డిమర్ యొక్క రచనలు నైతిక మరియు జాతి సమస్యలు, ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష గురించి చర్చిస్తాయి. గోర్డిమెర్ జోహాన్నెస్‌బర్గ్ వెలుపల ఉన్న ఈస్ట్ రాండ్ మైనింగ్ టౌన్ అయిన గౌటెంగ్‌లోని స్ప్రింగ్స్ సమీపంలో జన్మించారు. గోర్డిమర్ యొక్క మొదటి నవల, "ది లైయింగ్ డేస్", 1953లో ప్రచురించబడింది. ఆమె వర్ణవివక్ష వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొంది. గోర్డిమెర్ తన రచనలకు శాశ్వత అంతర్జాతీయ గుర్తింపును పొందింది.

ఈమె రచనలు రాజకీయ సమస్యలతో పాటు "జాతిపరంగా విభజించబడిన దక్షిణాఫ్రికా లో ని నైతిక మరియు మానసిక ఉద్రిక్తతలతో" వ్యవహరిస్తాయి. గోర్డిమెర్ సాధారణ వ్యక్తుల కథలను చెబుతారు, ఆమె పాత్రల పేర్లలో సూక్ష్మ వివరాలను కూడా వేస్తుంది. గోర్డిమర్ తన 90 సంవత్సరాల వయస్సులో 13 జూలై 2014న నిద్రలోనే మరణించారు.

ముఖాముఖి

# రచయిత మనిషిగా ఎదిగిన అప్పుడే గొప్ప సృజన వస్తుంది...

## - వేణు సంకోజు




సాగర్ల సత్తయ్య
79891 17415


తెలంగాణ రాష్ట్ర సాధనకు అనేకులు అనేక విధాలుగా పోరాటం చేశారు. కొందరు తమ రచనలతో ప్రజలను ప్రభావితం చేశారు. ఇంకొందరు తమ వాగ్ధాటితో ప్రజల్లో చైతన్యం కలిగించారు. మరికొందరు ఉద్యమాల ద్వారానే తెలంగాణ సాధ్యమని తలచారు. ఈ మూడింటినీ సాధనాలుగా చేసుకుని తమ కలం ద్వారా గళం ద్వారా ముందుండి ప్రజలను నడిపించడం ద్వారా తెలంగాణ సాధనకు అహర్నిశలు పోరాటం చేసిన వారు ఇంకొందరు. సరిగ్గా ఈ కోవకు చెందినవారే నల్లగొండకు చెందిన ప్రముఖ కవి, రచయిత, వక్త, విమర్శకులు వేణు సంకోజు. వేణు సంకోజు అనగానే నరనరాన తెలంగాణవాదాన్ని పుణికిపుచ్చుకున్న మేధావిగా సాహితీవేత్తగా ఉద్యమకారుడిగా తెలంగాణ ప్రజలకు సుపరిచితం. మనిషిగా పూచే మట్టి, మనం, నేలకల, ప్రాణప్రదమైన మొదలైన కవిత్వ సంపుటాలతో పాటు స్పర్శ కథల సంపుటితో తెలంగాణ సాహిత్యంలో తనదైన ముద్రవేసిన వేణు సంకోజుతో ముఖాముఖి.



**మీ బాల్యం విద్యాభ్యాసం గురించి తెలియజేయండి.**

నేను నల్గొండ జిల్లా చండూరు లో జన్మించాను. అమ్మ శాంభవి. నాన్న వీరబ్రహ్మం. పుట్టింది చండూరు లోనే అయినా బాల్యమంతా సికింద్రాబాద్ కంచర బస్తీ లోనే గడిచింది. ఒకటి నుంచి పదో తరగతి (హెచ్.ఎస్.సి) వరకు కళాసిగూడ ప్రభుత్వ హైస్కూల్లో చదువుకున్నాను. ఐదవ తరగతి వరకు తెలుగు మాధ్యమంలోనే చదువుకున్నాను. ఆరవ తరగతిలో ఆంగ్ల మాధ్యమంలో చేరడానికి దరఖాస్తు పెట్టుకున్నాను. ఆంగ్ల మాధ్యమంలో చేరితే ఫెయిల్ అవుతావని ఉపాధ్యాయులు బయటపెట్టారు. అయినా పట్టుబట్టి ఆంగ్ల మాధ్యమంలో చేరాను. పట్టుదలతో చదివి తరగతిలో మొదటి స్థానం సాధించాను. మనసులో ఏదైనా అనుకుంటే అది తప్పక సాధించాలనే తపన ఆనాడే నాకు మొదలైంది. హెచ్.ఎస్.సి తర్వాత పి.యు.సి సికింద్రాబాద్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో పూర్తి చేశాను. ఏవీ కాలేజీలో సాయంకాలం కళాశాలలో డిగ్రీ చదువుకున్నాను.

**మీ ఉద్యోగ ప్రస్థానాన్ని వివరించండి.**

1964లో నాన్నగారు మరణించిన తర్వాత కుటుంబ భారం నాపై పడింది. తమ్ముళ్ల చెల్లెళ్లను పోషించడానికి ఒకవైపు సాయంకాలం కళాశాలలో చదువులు కొనసాగిస్తూనే మరోవైపు చిన్నాచితకా ఉద్యోగాలు చేస్తూ వచ్చాను. పెట్రోల్ బంక్ బాయ్‌గా నేను ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టాను. సికింద్రాబాదులో నెలకు నలభై రూపాయల జీతానికి పెట్రోల్ బంక్‌లో చేరాను. అది ఎక్కువ కాలం చేయలేకపోయాను. అరవై రూపాయల వేతనానికి బుక్ బైండర్ గా జాయిన్ అయ్యాను. అక్కడి నుండి మరికొంత కాలానికి వంద రూపాయల వేతనానికి ఒక మార్వాడి దగ్గర చెక్కులు రాయడానికి గుమస్తాగా చేరాను. ఈ ఉద్యోగాలు చేస్తున్న సమయంలోనే డిగ్రీ పూర్తి చేసుకున్నాను. పోటీ పరీక్షలు రాసి ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్‌లో ఎల్.డి.సి గా ప్రభుత్వ ఉద్యోగం లో చేరాను. అదే ఆఫీసులో ఉద్యోగోన్నతిపై హెడ్ క్లర్క్‌గా ఎదిగాను. హైదరాబాద్ గుంటూరు ప్రాంతాలలో పని చేశాను. ఈ ఉద్యోగం

ముఖాముఖి

నాకు ఎంత మాత్రం సంతృప్తినివ్వలేదు. అధ్యాపకుడిగా చేరాలనే తపన నాకు మొదటి నుండి ఉండేది. 1982లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాను. నల్లగొండ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ నియామకం. తర్వాత మహబూబ్ నగర్ నర్సాపూర్‌లలో పని చేశాను. నర్సాపూర్ లో పని చేస్తుండగా ఇంటర్మీడియట్ బోర్డ్‌కు డిప్యుటేషన్ పై ఆడియో విజువల్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పంపించారు. అక్కడి నుండి సంగారెడ్డికి బదిలీ అయ్యాను. సంగారెడ్డి నుండి పదోన్నతి పై డిగ్రీ కళాశాల సహాయ ఆచార్యుడిగా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లాను. అక్కడి నుండి బదిలీపై ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నల్లగొండలో పదవీ విరమణ చేశాను. కాకతాళీయమే అయినా నల్లగొండ మహిళా డిగ్రీ కాలేజీలో ప్రారంభమైన నా అధ్యాపక ప్రస్థానం మళ్లీ అదే కాలేజీలో ఉద్యోగ విరమణతో ముగిసింది.

**మీరు కేవలం సాహిత్యం వైపు మాత్రమే కాక కళారంగాల వైపు కూడా మీ కృషిని కొనసాగిస్తున్నారు. ఈ దిశగా మిమ్మల్ని ప్రభావితం చేసిన అంశాలు ఏమిటి?**

సికింద్రాబాద్ వాతావరణం, జీవనవిధానం నన్ను ఇలా మలచింది. ముఖ్యంగా సినిమా నన్ను కళల వైపు తిప్పింది. మా మేనత్తలు మేనమామలు చిన్నమ్మలు చిన్నాన్న లు ఎవరు సినిమాకి వెళ్ళినా నన్ను తీసుకెళ్లేవారు. ఆ రోజుల్లో సినిమాలు ఎన్నో విలువలు కలిగి ఉండేవి. వ్యక్తిత్వ నిర్మాణానికి సినిమా గొప్ప మాధ్యమం అని భావిస్తాను. మా ఇంట్లో జరిగే సినిమా చర్చలు నన్ను సాంస్కృతిక విలువల వైపు నడిపించాయని అనుకుంటాను. నాలో కళాతృష్ణ పెరగడానికి మరో ముఖ్య కారణం మా నాన్నగారు. మా నాన్న వృత్తి రీత్యా ఇత్తడితో వస్తువులు తయారు చేసే కళాకారుడు. తన పనిలో ఎప్పుడూ నవ్యత్వాన్ని కోరుకునేవాడు. మొట్టమొదటి సారిగా సికింద్రాబాదులో హోటల్‌లో వాడే ఇత్తడి హాట్ కేసులు తయారుచేసింది మా నాన్నగారే. షోలాపూర్ బాయిలర్‌ల తయారీలో సిద్ధహస్తుడు. దేవాలయాలలో వాడే ధారా పాత్రలు, శివలింగం చుట్టూ ఉండే నాగఫణులను మిక్కిలి కళాత్మకంగా తయారు చేసేవారు. ఇత్తడి వెండి పాత్రల తయారీలో నిపుణులు. ఈ కళాత్మకమైన పని నా జీవితంలో నాపై ఎంతో ప్రభావం చూపింది.

**1969 ఉద్యమ అనుభవాలను వివరించండి.**

1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నాను. అంగ్రేజీ బజార్‌లో శ్రీనివాస్ అనే ఒక పెద్దాయన ఉండేవాడు. ఆయన నన్ను మా స్నేహితులను అధ్యయనం వైపు మళ్లించాడు. నేను నా స్నేహితుడు నరేష్ ఆయన వద్దకు రోజూ వెళ్తుండేవారం. ఆయన జ్ఞాన సిద్ధాంతం కమ్యూనిస్ట్ మేనిఫెస్టో వంటి ప్రగతి కాముక సాహిత్యాన్ని మాచే చదివించే వారు. ఎన్నో చర్చోపచర్చలు చేసేవారం. 1969 ఏప్రిల్ 4వ తేదీన మా ప్రాంతంలోని దర్గా దగ్గర బూరుగు మహదేవ్ హాల్లో ప్రత్యేక తెలంగాణ సభ జరిగింది. అనేక మంది తెలంగాణ వాదులు ఆ సభలో పాల్గొన్నారు. ఉద్యమ కారులను చెల్లాచెదురు చేయటానికి పోలీసులు లాఠీఛార్జి చేశారు. అనేక మందిని అరెస్టు చేశారు. ఉద్యమ జ్వాలలు చల్లార్చడానికి ఆ ప్రాంతంలో కర్ఫ్యూ విధించి కనబడితే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేశారు. నా ఆత్మీయ మిత్రుడు ప్రకాష్ ఆ సమయంలో మా ఇంట్లోనే ఉన్నాడు. వాతావరణం ఉద్రిక్తత తగ్గింది అని భావించి బయటకు వెళ్లాడు వెళ్ళిన కొద్ది క్షణాల్లోనే మా ఇంటికి సమీపంలోనే ప్రకాష్ పోలీసుల తూటాలకు బలి అయినాడు. అతి దగ్గర నుంచి మూడు తూటాలు ప్రకాష్ శరీరంలోకి వెళ్ళాయి. అక్కడికక్కడే నేలకొరిగాడు. కిందపడ్డ ప్రకాష్ చేతిలో అగ్గిపెట్టె, దూది పెట్టి పోలీసులు అరాచకవాదిగా ముద్ర వేసే ప్రయత్నం చేశారు. ప్రకాష్ మరణం నన్నెంతో కలచి వేసింది. తెలంగాణ ప్రజా సమితి నిర్వహించిన సభల్లో తరచుగా పాల్గొనేవాడిని. మాపై పోలీసుల నిఘా పెరిగింది. ఒకరోజు మా ఇంటిపై పోలీసుల దాడి కూడా జరిగింది. ఎన్నో విలువైన పుస్తకాలను ఎత్తుకెళ్లారు. నన్ను నా మిత్రుడు నరేష్ ను పోలీసులు ఒక రహస్య ప్రాంతంలో విచారించారు. ఆధారాలు లభించకపోవడం వల్ల నన్ను వదిలి వేశారు.



**సాహిత్య పరంగా రాజకీయ పరంగా మిమ్మల్ని ప్రభావితం చేసిన వ్యక్తులు**



ఎవరు?

వ్యక్తులతో పాటు పుస్తకాలూ నా ఆలోచనా సరళిని ప్రభావితం చేశాయి. కమ్యూనిస్ట్ మేనిఫెస్టో కంటే కూడా మహాప్రస్థానం నన్ను ఎక్కువగా ఆకర్షించింది. శ్రీశ్రీ ఆలోచనా విధానం, అభ్యుదయ వాదులతో స్నేహం, మరీ ముఖ్యంగా కాళోజీ జీవితం, సాహిత్యం నా పై ఎంతో ప్రభావాన్ని చూపాయి. 'వారీ... వేణు! ఈ కవిత్వం నీకెట్లా పట్టుబడిందిరా?' అనే ఆయన ప్రేమపూర్వక పిలుపు ఇప్పటికీ నా చెవుల్లో మ్రోగుతూనే ఉంటుంది.

**మలి తెలంగాణ ఉద్యమంలో మీ పాత్ర ఏమిటి?**

మలిదశ తెలంగాణ ఉద్యమంలో నా వంతు పాత్రను నిర్వహించానని అనుకుంటున్నాను. ముఖ్యంగా జనాల్లో చైతన్యం కలిగించడానికి కావలసిన సైద్ధాంతిక పరమైన మద్దతు నా వైపు నుంచి ఉందనే మిత్రులు అంటూ ఉంటారు. నల్లగొండ కేంద్రంగా ఏర్పడిన ఐక్య కార్యాచరణ కమిటీ లో అధికార ప్రతినిధిగా నా వంతు బాధ్యతలు నిర్వహించాను. ఉమ్మడి నల్లగొండ జిల్లానే కాక తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక సభలలో పాల్గొన్నాను. దీనితోపాటు వీర తెలంగాణ పత్రిక ప్రధాన సంపాదకుడిగా 18 నెలల పాటు పత్రిక వెలువరించడం ద్వారా భావజాల పరమైన చైతన్యాన్ని కలిగించే గలిగాము. ఈ వీర తెలంగాణా పత్రికను ఆనాటి తెలంగాణ ఉద్యమ నాయకుడు నేటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేతుల మీదుగా ఆవిష్కరించాం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన ఆత్మగౌరవం, అవకాశాలలో సమానత్వం సాధించడానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవశ్యకమని భావించాం. పోరాట ఫలితంగా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించామన్న సంతృప్తి వెలకట్టలేనిది.

**వీర తెలంగాణా పత్రికను ఆనాటి తెలంగాణ ఉద్యమ నాయకుడు నేటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేతుల మీదుగా ఆవిష్కరించాం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన ఆత్మగౌరవం, అవకాశాలలో సమానత్వం సాధించడానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవశ్యకమని భావించాం. పోరాట ఫలితంగా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించామన్న సంతృప్తి వెలకట్టలేనిది.**

**అధ్యాపకుడిగా మీకు సంతృప్తినిచ్చిన అంశాలు ఏమిటి?**

నా జీవితంలో నాకు మిక్కిలి సంతృప్తినిచ్చిన అంశం నా తరగతి గది. నా విద్యార్థులను సృజనశీలిగా మలచడానికి ఏ అవకాశాన్ని వదులుకోలేదు. ముఖ్యంగా నల్లగొండ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు రచయిత్రులుగా విమర్శకులుగా చలనం పుస్తకాన్ని వెలువరించడం అత్యంత సంతృప్తి నిచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పౌరశాస్త్రం పాఠ్య పుస్తక రచయితల బృందం సభ్యుడిగా, ఒకటి నుండి పది తరగతుల పాఠ్య పుస్తకాలకు పాఠ్యాంశ నిర్ణాయక కమిటీ సభ్యుడిగా సేవలందించడం సంతృప్తిని కలిగించింది. అనేక జాతీయ స్థాయి సదస్సులలో పత్ర సమర్పణ చేయడమే గాక కొన్ని సదస్సులను నిర్వహించే అవకాశం కూడా నాకు కలిగింది. తెలంగాణ ఏర్పాటు అనంతరం తెలంగాణ చరిత్ర సంస్కృతిపై ప్రత్యేక సదస్సులు నిర్వహించి విద్యార్థినీ విద్యార్థులు పరిశోధకులచే పత్ర సమర్పణ చేయించాను.

**మీ కవిత్వ ప్రస్థానాన్ని వివరించండి.**

విద్యార్థి దశలో ఉన్నప్పటినుండే నాకు అధ్యయనం పట్ల ఆసక్తి. ఆ అధ్యయనమే నన్ను సాహితీ సృజన వైపు మళ్లించింది. నేను పాఠశాల విద్యార్థిగా ఉన్న రోజుల్లో జవహర్‌లాల్ నెహ్రూ మరణించినప్పుడు వారిపై ఒక ఎలిజీ రాశాను. నాకు గుర్తున్నంత వరకు ఇది తొలి రచన. తర్వాత కాలంలో అనేక కవితలు వివిధ

ముఖాముఖి

పత్రికల్లో అచ్చవుతూ వచ్చాయి. కానీ వాటిని పుస్తక రూపంలో తీసుకు రాలేకపోయాను. 1995లో మనిషిగా పూచే మట్టి నా తొలి కవిత్వ సంపుటి. ఈ శీర్షికలోనే ఈ నేలపట్ల ప్రేమ, మానవత్వం స్ఫురిస్తాయి. ఈ కవిత్వంలోనూ అవే కవితా వస్తువులు. ఈ సంకలనాన్ని కాళోజీ గారు ఆవిష్కరించడం నా అదృష్టం. దీనికి విశేషమైన ఆదరణ లభించింది. ముద్రించిన కొద్ది నాళ్లలోనే పుస్తకాలన్నీ అయిపోవడం దీనికి నిదర్శనం. నా రెండవ కవితా సంపుటి మనం 2001లో అచ్చయింది. ఈ సంపుటిలో కవితలు నిడివి దృష్ట్యా సంక్షిప్తంగా ఉండి సాంద్రతరమైనవిగా పాఠకుడ్ని లోతైన ఆలోచనకు గురిచేసే ఈ విధంగా ఉన్నాయి. దీనిలో తాత్విక చింతన నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. తెలుగు విశ్వవిద్యాలయం వారు కూడా ఈ గ్రంథానికి పురస్కారం ఇచ్చి గౌరవించారు. 'మనం' ద్వారా కవిగా నన్ను నేను పునర్మూల్యాంకనం చేసుకున్నాను. అది నాకు సంతృప్తినిచ్చింది. 2008లో



ప్రాణప్రదమైన నేల కల అనే రెండు కవితా సంపుటాలను ఒకేసారి వెలువరించాను. అప్పటికే మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్రరూపం దాల్చుతోంది. ఆ ఉద్యమ ప్రభావం ఈ సంకలనాలలో ప్రస్ఫుటంగా చోటుచేసుకున్నది.

**కవిగా లబ్దప్రతిష్ఠులైన మీరు కథల వైపు వెళ్లడానికి కారణం ఏమిటి?**

> **2010 ప్రాంతంలో శ్రీశ్రీ శతజయంతి సభలు జరపవలసి వచ్చినప్పుడు ప్రతి నెలా ఒక కార్యక్రమం చొప్పున లబ్దప్రతిష్టులైన, శ్రీశ్రీతో అనుబంధం కలిగిన, శ్రీశ్రీ సాహిత్యం పై అధికారం కలిగిన సాహితీవేత్తలను ఎందరినో నల్లగొండకు పిలిచి ప్రతి నెలా సభలు చేసి వారి ప్రసంగ పాఠాలను 'ప్రజల పక్షాన ప్రతిజ్ఞ' పేరుతో నా సంపాదకత్వంలో తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా మిగిలిపోయే పుస్తకాన్ని అందించ గలిగాం.**

నా ఉద్దేశం లో కథ గొప్పదా? కవిత గొప్పదా అన్న ప్రశ్న ఉదయించదు. ప్రక్రియ ఏదైనా పాఠకుని చేరే మాధ్యమం మాత్రమే. కవితతో పోల్చినపుడు కథలో వ్యథను వ్యక్తం చేయడానికి అవకాశం ఉంటుంది. కవిత ఒక విద్యుత్తును రగిలిస్తుంది. కథ మనిషిని ఆలోచింపజేస్తుంది. కవిత కంటే కథా విస్తృతమైన వస్తువులు పాఠకునికి అందిస్తుంది. కవిత్వానికి కొన్ని పరిమితులు ఉండవచ్చు. కవిత్వంలో ఇమడలేని జీవితానుభవాలను నేను చూసిన జీవితాలను కథలుగా మలిచాను. నేను ప్రాథమికంగా కవిని మాత్రమే. నేను తీవ్రంగా చలించిపోయిన సందర్భాలనే కథలుగా మలిచాను. ఇవే స్పర్శ కథల సంపుటి గా వెలువరించాను. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత గారు ఈ కథా సంపుటిని ఆవిష్కరించారు. స్పర్శ కథల సంపుటి పై పచ్చిమట్ల రాజశేఖర్ అనే పరిశోధక విద్యార్థి ఎంఫిల్ పరిశోధన చేశాడు.

**హనుమంతు జీవిత చరిత్ర రాయాలని ఎందుకనిపించింది?**

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సుద్దాల హనుమంతును నేను స్వయంగా చూశాను. వారితో సభలలో పాల్గొన్నాను. ఆయన నిరాడంబరమైన ఉద్యమ జీవి. తన జీవితాన్ని పేదల కోసం ధారపోసిన త్యాగజీవి. సాహిత్య కళా రంగాలను ఉద్యమానికి వేదికలుగా చేశాడు. తన బుర్ర కథలతో పాటలతో ప్రజలను ఉర్రూతలూగించాడు. ఆయన జీవితం ఆదర్శప్రాయమైనది. అందుకే ఆయనను అధ్యయనం చేశాను. కేంద్ర సాహిత్య అకాడమీ వారి కోరిక మేరకు జీవిత చరిత్రను రాశాను. వారి జీవితాన్ని తెలుగుఅకాడమీ కూడా ప్రపంచ సభల సందర్భంగా తిరిగి నాచే రాయించింది.

**సాధారణంగా రాజనీతి శాస్త్ర అధ్యాపకులు చేసే పరిశోధన ఆ శాస్త్ర పరిధిలోనే ఉంటుంది. కానీ మీరు చేసిన పరిశోధనా సాహిత్యం రాజనీతి శాస్త్రం సన్నిహితమైనట్లుగా కనిపిస్తుంది. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?**

మీరన్నది నిజమే. నా వృత్తి రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు. ప్రవృత్తి సాహిత్యం. అందుకే ఇలాంటి విలక్షణమైన అంశాన్ని ఎంచుకున్నాను. 'తెలుగు నవలల్లో చిత్రమైన రాజ్యము మరియు రాజ్యాంగం (state and administration in India; perception in the Telugu novel) అనే ఈ అంశాన్ని అంబేద్కర్ విశ్వవిద్యాలయం కూడా తొలుత అంగీకరించలేదు. కానీ పరిశోధన కేవలం ఒక శాస్త్రానికి పరిమితం విధించటం సమంజసం కాదని వాదించి వారిని ఒప్పించగలిగాను. కీలుబొమ్మలు, రాబందులు రామచిలుకలు, the incredible goddess, రాజా మహిషీ, అధికారులు ఆశ్రిత జనులూ, యమపాశం ఖాకీవనం మొదలైన నవలల్లోని రాజ్య స్వభావాన్ని విశ్లేషించాను. ఇది కొంత విలక్షణమైన పరిశోధన గానే

ముఖాముఖి

భావిస్తాను.

**సంపాదకుడిగా మీరు చేసిన కృషిని వివరించండి.**

నేను అనేక పుస్తకాలకు సంపాదకుడిగా వ్యవహరించాను. వీర తెలంగాణ మాస పత్రిక ప్రధాన సంపాదకుడిగా పనిచేశాను. నన్ను ఎంతగానో ప్రభావితం చేసిన కవులు శ్రీశ్రీ, కాళోజీలు. వారి శత జయంతి ఉత్సవాల సందర్భంగా సంవత్సరం పొడుగునా నెల నెల కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, జ్ఞాపికలు, ఆ పుస్తకాలను కూడా ప్రచురించాం. అది నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చిన అంశం. ముఖ్యంగా 2010 ప్రాంతంలో శ్రీశ్రీ శతజయంతి సభలు జరపవలసి వచ్చినప్పుడు ప్రతి నెలా ఒక కార్యక్రమం చొప్పున లబ్దప్రతిష్ఠులైన, శ్రీశ్రీతో అనుబంధం కలిగిన, శ్రీశ్రీ సాహిత్యం పై అధికారం కలిగిన సాహితీవేత్తలను ఎందరినో నల్లగొండకు పిలిచి ప్రతి నెలా సభలు చేసి వారి ప్రసంగ పాఠాలను 'ప్రజల పక్షాన ప్రతిజ్ఞ' పేరుతో నా సంపాదకత్వంలో తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా మిగిలిపోయే పుస్తకాన్ని అందించగలిగాం. ప్రజల పక్షాన ప్రతిజ్ఞ గ్రంథంలో శ్రీశ్రీ గురించిన కవిత్వం, శ్రీశ్రీ సాహిత్యం పై ప్రామాణిక వ్యాసాలున్నాయి. వరవరరావు, ఆచార్య ఎన్.గోపి, ఎన్ వేణుగోపాల్, పీ. శివలక్ష్మి, నిఖిలేశ్వర్, కే. శ్రీనివాస్, తిరుమల రావు కాత్యాయనీ విద్మహే, పెన్నా శివరామకృష్ణ వంటి లబ్దప్రతిష్ఠులైన సాహితీవేత్తల రచనలు ఈ గ్రంథంలో ఉన్నాయి. ఇదే తరహాలో 2014 ప్రాంతంలో కాళోజీ శతజయంతి సందర్భంగా కూడా నేను ఇలాంటి నెలనెలా కార్యక్రమాలు నిర్వహించాను. అయితే సభలకు కేవలం నల్లగొండ మాత్రమే కార్యస్థానం కాకుండా తెలంగాణలో అనేక చోట్ల కాళోజీ సభలు నిర్వహించాం. హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, సూర్యాపేట, చిట్యాల, రామన్నపేట, తిరుమలగిరి, కోదాడ, హుజూర్ నగర్ మొదలైన ప్రాంతాలలో



కళాశాల విద్యార్థులతో సభలు నిర్వహించి కాళోజీ కవిత్వ తత్వాన్ని ప్రచారం చేసాం. ఆ రోజులలో తెలంగాణా ఉద్యమం విద్యార్థుల లోకి మరింతగా చొచ్చుకు పోవడానికి ఈ సభలు ఎంతగానో దోహదం చేశాయి. ఈ సభల అనంతరం కూడా సంవత్సర కాలంలో వివిధ సభల్లో వచ్చిన ప్రసంగ పాఠాలు, కాళోజీపై వచ్చిన కవిత్వం ప్రముఖ సినీ దర్శకులు బి. నరసింగరావు సహకారంతో రెండు వినూత్నమైన సంకలనాలు 'కాళోజీ ఉత్సవ్' పేరుతో ప్రచురించాం.

**'జయమిత్ర' సాహిత్య సంస్థ గురించి చెప్పండి.**

రచయితలకు ఆలోచన, గళం రెండు ఉంటాయి. వారి గళాన్ని వెలుగులోకి తేవడానికి సాహిత్య సంస్థలు ఉండాలి. 'జయమిత్ర' ఆ పని చేస్తూ వచ్చింది. జయమిత్ర తాను స్వయంగా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడమే కాక అనేక సాహిత్య సంస్థలను ఏకతాటిపైకి తీసుకువచ్చి సమన్వయంతో పని చేసింది. ఈ సంస్థకు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా ఉన్నాను. కనుక అనేక కార్యక్రమాలు మా మేడ పైనే నిర్వహించు కున్నాం. జిల్లా రాష్ట్ర స్థాయి అనేక సాహిత్య సభలు పుస్తకావిష్కరణ సభలు నిర్వహించాం. సాహిత్యంలో లబ్ద ప్రతిష్టులైన అనేక మంది సాహితీ వేత్తలను సృజన కారులను రప్పించి ఉపన్యాసాలు ఇప్పించాం. వట్టికోట, కాళోజీ, అలిశెట్టి వంటి తెలంగాణ కవులే కాక రావూరి భరద్వాజ, అద్దేపల్లి రామ్మోహన్ రావు వంటి ఆంధ్ర ప్రాంత సాహితీవేత్తల జయంతి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాం. చార్లీ చాప్లిన్, లతామంగేష్కర్, ఎమ్మెస్ సుబ్బలక్ష్మి వంటి అంతర్జాతీయ జాతీయ ప్రముఖుల సంస్మరణ సభలు నిర్వహించాం. అనేక మంది కొత్త రచయితలకు కవులకు ప్రోత్సాహం అందించాం జయమిత్ర పక్షాన సుమారు సుమారు 50కి పైగా పుస్తకాలు ప్రచురించాం.

**తెలంగాణ రచయితల వేదిక కార్యదర్శిగా మీ పాత్ర ఏమిటి?**

తెలంగాణ అస్తిత్వానికి సాహిత్య ప్రయాణానికి ఒక రాష్ట్ర స్థాయి వేదిక ఉండాలని అమ్మంగి వేణుగోపాల్, చెన్నకేశవ రెడ్డి, గురజాల రామ శేషయ్య, గురజాల వెంకటేశ్వర్లు మొదలైన మిత్రులను కలిసి చర్చించాం. ఫలితంగా తెలంగాణ రచయితల వేదిక 2001లో నందిని సిధారెడ్డి అధ్యక్షుడుగా నేను ప్రధాన కార్యదర్శిగా ఏర్పడింది. 2002 జూలై 7న నల్లగొండలో ప్రథమ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించాం.

కవిత

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తికి ఇది ఒక క్రియాశీలక వేదికగా నిలిచింది. కవులు కళాకారులు మేధావులు ఉద్యమానికి మద్దతు పలకడానికి తెరవే చేసిన కృషి గొప్పదిగా భావిస్తున్నాను.

**మీరు చేసిన సాహిత్య కృషికి తగిన గుర్తింపు లభించిందని భావిస్తున్నారా?**

నేను ఎప్పుడూగుర్తింపు ఆశించి పనిచేయలేదు.నా పని నేను చేస్తూ వెళ్లాను. నేను చేసిన పని నాకు సంతృప్తినిచ్చింది. ప్రజలు పాఠకుల గుర్తింపు ఉంది అనే భావిస్తున్నాను. ఇక అవార్డుల విషయం అంటారా? వాటిని నేను ఎప్పుడూ పట్టించుకోలేదు. అయినా తెలుగు యూనివర్సిటీ పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్ పురస్కారం, కాళోజి స్మారక సాహిత్య పురస్కారం అందుకోవడం సంతృప్తినిచ్చిన అంశాలు.

**నేటి తరం రచయితలకు మీరిచ్చే సూచనలు ఏమిటి?**

ఎప్పటికైనా మనిషి కంటే కాలమే గొప్పది. మనిషి గురించి మాట్లాడినప్పుడు కాల పురుషుడా కాదా అన్నదే ప్రధానాంశం. రచయిత మనిషిగా ఎదిగిన అప్పుడే గొప్ప సృజన వస్తుంది. నా దృష్టిలో సృజనకారుడే మానవుడు. సృజనకారుడు అంటే కళ్లకు కనిపించే అంశాలనేగాక అమూర్తమైన అంశాలను సైతం హృదయాన్ని తాకేలా చెప్పగల వాడు. కవి ప్రజల పక్షాన నిలవాలి. కవి హృదయం లోని నెనరు ఆచరణలో కనిపించాలి. విలువలతో కూడిన సృజన మాత్రమే కాలాన్ని తట్టుకుని నిలుస్తుంది.



కవిత

# గారడి చక్రం



**రోహిని వంజరి, 90005 94630**



ఓ క్షణం వెలుగు పూల సంబరం
మరుక్షణం చీకటి నీడల భయం
ఓ క్షణం శిఖరాగ్రం వైపు చూపులు
మరుక్షణం పాతాళంలోకి అడుగులు
ఓ క్షణం స్వేచ్ఛా పరిమళాలు
మరుక్షణం బందీ అయిన ఊపిరులు
ఓ క్షణం విజయోల్లాసం
మరుక్షణం ఓటమి సలుపుతున్న గాయం
ఓ క్షణం ఎక్కుతున్న ఆశల నిచ్చెన
మరుక్షణం నిరాశ మిగిల్చిన వేదన
ఓ క్షణం నిండిన పూర్ణకుంభం
మరుక్షణం ఎండిన శూన్య శకలం
ఓ క్షణం వసంత శోభల చిగురు హరితం
మరుక్షణం శిశిరపు ముడుతల వార్ధక్యం
ఓ క్షణం పిండారబోసుకున్న వెన్నెల్లో విహారం
మరుక్షణం కాటుక పులుముకున్నకాళరాత్రిలో పయనం
ఓ క్షణం నమ్మిన ఆదర్శాల వెంట ఉరకలెత్తే గమనం
మరుక్షణం కూలిన ఆశయాల కుప్పమీద చలనం లేని శవం
ఇది జీవిత రహదారిలో కోరికల గుర్రాల వెంట
పరుగులు తీసే మనిషి మనసుకి కళ్లెం వేసి
కాలం తనచుట్టూ తిప్పుకునే అంతులేని వింతైన గారడి చక్రం
మనిషి జీవితం...

కథ

# పోలీస్ - రియల్ వారియర్

పోలీసులలో ఉన్న రెండవ కోణం తెలుపుతున్న కథ...




సుధీర్ గంగడి
93944 86053


ఫోన్లో కరోనా మెస్సేజ్‌లు చదివి చదివి బోర్‌తోపాటు భయం కూడా వేస్తోంది. చైనా వణికిపోతుంది... ఇటలీ ఊడ్చుకుపోతుంది... అమెరికా ఆపలేకపోతుంది వంటి హెడ్డింగులు మరింత భయపెట్టిస్తున్నాయి. మన దగ్గర ఏం లేకున్నా ఈ ఫార్వర్డ్ మెస్సెజ్‌లు చదివితే రోగం రావడం మాత్రం ఖాయం అనుకుంటూ..

టైం చూసేసరికి మూడవుతుంది. ఫోన్లో పడి టైం మరిచేపోయా... "సర్, ఎస్సై ఎప్పుడొస్తాడండి? నన్ను పన్నెండింటికే రమ్మన్నారు ఎంతసేపు వెయిట్ చేయాలి... నేను ఊరెల్లాలి", అని కొంచెం అసహనంతో అడిగాను కానిస్టేబుల్ని.

"ఏంటయ్యా నువ్వు ఊరికూరికే అడిగేతే వచ్చేస్తాడా... నీ ఒక్కపనే ఉంటుందా మాకు. చానా పన్లుంటాయి, కూసామన్నా కదా" అని కానిస్టేబుల్ విసుక్కుంటుడగానే జీపొచ్చి స్టేషన్ ముందు ఆగింది. లోపలికి వస్తున్న ఎస్సైకి సెల్యూట్ చేసి అతన్తో పాటు రూంలోకెళ్ళాడు కానిస్టేబుల్.

పది, ఇరవై, ముప్పై నిమిషాలయింది. ఇక ఉండబట్టలేక నేరుగా ఎస్సై రూంలో కెళ్ళాను. నన్ను చూస్తూనే కానిస్టేబుల్ "కూర్చోమన్నా కదా... లోపలి కెందుకొచ్చావ్" అంటూ గద్దించాడు.

ఇంతలో ఎస్సై కల్పించుకొని "ఎవరితను?" అని అడిగాడు.

"అదే సార్... ఆ వెంకటాపురం పొలం గొడవ ఉందిగా! ఆ లక్ష్మణ్..." అన్నాడు.

"ఏరా కబ్జాలు చేస్తున్నావా... కేసు బుక్ చేయమంటావా...చూస్తుంటే చదువుకున్నోని లెక్క ఉన్నవ్, సిగ్గులేదురా"...అంటూ నా పేరు వినగానే తిట్ల దండకం అందుకున్నాడు ఎస్సై.

"ఏంటి సర్... నిజమేదో తెలుసుకోకుండా మాట్లాడుతున్నారు. అది నా పొలమే, మేమే సాగు చేసుకుంటున్నాము. నేను హైదరాబాద్లో సినిమా ఇండస్ట్రీలో పనిచేస్తాను. అంతేకానీ నేనేం కబ్జాకోరుని కాను".

"ఏం ఇన్ఫ్లూయన్స్ చేస్తున్నావా సినిమా ఇండస్ట్రీ అని, నువ్వెవడైతే నాకేంట్రా...? వాడు నీ మీద కంప్లైంట్ ఇచ్చిండు, సివిల్ మాటరేదన్నా ఉంటే కోర్టులో చూసుకోండి. ఇలా క్రిమినల్ ఆక్టివిటీస్ చేస్తే బొక్కలో ఎయ్యాల్సొస్తుంది".

"సర్ మీరొచ్చి ఎంక్వైరీ చేయండి... తప్పు ఎవరిదో తెలుస్తుంది. అంతేగానీ మీ స్టేషన్కొచ్చినగదాని ఇష్టమొచ్చినట్టు మాట్లాడొద్దు, నాకూ చట్టం అంటే తెలుసు", అని కొంచెం సీరియస్‌గానే రిప్లై ఇచ్చాను.

"చట్టం తెలుసుగదరా! మరి బొక్కలో ఎయ్యిమంటవా? పో..పో.. ఏం పీక్కుంటవో పీక్కో. మళ్ళోసారి నీ మీద కంప్లైంటొచ్చిందో ఎఫ్ఐఆర్ బుక్ చేస్తా నా కొడకా! పొయి మీ సర్పంచ్తో కూసొని మాట్లాడుకోండ్రి అనవసరంగా న్యూసెన్స్ క్రియేట్ చేయకుండ్రి. పో..పో" అంటూ కసురుకున్నాడు.

బయటకి వస్తూనే ఎస్సై అన్న మాటలకి విపరీతమైన కోపం వచ్చింది, 'ఈ నా కొడుకులని సినిమాల్లో అందుకే విలన్లుగా చూపిస్త్రా... డైరెక్టుగా వచ్చి లోకువయిపోయా. ఏ లోకల్ లీడర్‌తోనో..ఎమ్మెల్యేతోనో ఫోన్ చేపిస్తే కానీ రెస్పెక్ట్ ఇవ్వడు వరస్ట్ నా కొడుకు' అనుకుంటూ కార్ స్టార్ట్ చేశాను. ఫోన్ రింగవడంతో ఎవరా అని చూస్తే ప్రొడ్యూసర్ దగ్గర్నుండి ఫోన్, "ఎక్కడున్నారు లక్ష్మణ్, మీరు చెప్పిన స్టోరీ లైన్ చదివాను. బాగుంది రేపు సండే కదా! ఒకసారి రండి. కూర్చొని మాట్లాడుకుందాం" అన్నాడు.

అప్పటివరకున్న కోపమంతా ఆవిరైంది. ప్రొడ్యూసర్ ఫోన్ చేసి మరీ కథ చెప్పడానికి పిలిచాడంటే యాభై శాతం పని అయిపోయినట్టే. వెంటనే అమ్మకి ఫోన్ చేసి "హైదరాబాద్ వెళ్తున్నాను అర్జంట్ పని పడింది. ఈ కేసు సంగతి నేను చూసుకుంటాలే"... అంటూ హైదరాబాద్ బయల్దేరాను.

రేడియోలోని ఎఫ్.ఎం.లో పాటలు

ఆగిపోయి మోడీ స్పీచ్ మొదలయింది. కరోనా కట్టడి కోసం ఒకరికి ఒకరు దూరంగా ఉండాలని చెపుతూ రేపు జనతా కర్ఫ్యూ పాటిద్దామని అనౌన్స్ చేశారు మోడీగారు.

ఇంట్లోకెళ్లే సరికి మా ఆవిడ జనతా కర్ఫ్యూ సామాన్ల లిస్ట్ రాసుకొని మరీ తెచ్చుకుంది. "ఒక్కరోజు కర్ఫ్యూకి ఇంత సామానెందుకు?" అని అడిగా.

దానికి "అదేంటండి మోడీ చెప్పిన దగ్గర్నుండి వాట్సాప్‌లో జనతా కర్ఫ్యూ కోసం ఏమేం తెచ్చుకోవాలో చెప్పారు. చూడలేదా?" అని అడిగింది.

"సరె సరె" అంటూ స్నానం చేసి, రేపు ప్రొడ్యూసర్కి వినిపించే స్టోరీని మరొక్కసారి చూసుకున్నాను.

ఆదివారం పదింటికల్లా ప్రొడ్యూసర్ ఇంటికి చేరుకుందామని రోడ్డెక్కాను. జనాలు పలుచగా ఉన్నారు, రోజులో ఉండే ట్రాఫిక్లో కనీసం రెండో వంతు కూడా ఎవరూ లేరు. పన్లో పడి పట్టించుకోలేదు కానీ, జనాల్లో కరోనా భయం సీరియస్ గానే ఉందని అనిపించింది. అక్కడక్కడా పోలీసులు నిలబడి ఎవరూ రాకుండా కంట్రోల్ చేస్తున్నారు, నా కార్ని కూడా ఆపారు. 'మందులు తెచ్చుకోవాలి, మెడికల్ షాప్ కెళ్తున్నా' అంటూ సినిమాటిక్ అబద్ధం చెప్పి, వాళ్ళని ఫూల్స్‌ని చేసి తప్పించుకొన్నాననే ఆనందంతో ప్రొడ్యూసర్ని కలిసి స్టోరీ మొత్తం డిటైల్డ్‌గా డైలాగ్స్‌తో సహా చెప్పా. ఆయన కూడా ఇంప్రెస్ అయ్యాడు. అక్కడక్కడా ఆయన కొన్ని కరెక్షన్స్ చెప్పి 'నెక్ట్స్ మీటింగ్ ఆఫీస్‌లో టీంతో పెట్టుకుందాం' అని చెప్పాడు.

చాలా హ్యాపీగా ఇంటికి బయల్దేరా. వెళ్ళేసరికి టీవీలో మళ్లీ మోడీ ప్రత్యక్షమయ్యాడు. ఏప్రిల్ పద్నాలుగు వరకూ దేశాన్ని లాక్‌డౌన్ చేస్తున్నాం అని చెప్పాడు. వెంటనే టీవీల్లో కలకలం చెలరేగింది. కొంపలు మునిగి పోతున్నాయనే రీతిలో ఉదర గొడుతు న్నారు యాంకర్లు.

టీవీ కట్టేసి పడుకొన్నాను. అప్పటికే అలిసిపోయి ఉండడంతో మంచి నిద్ర పట్టింది.

తర్వాత రెండు మూడ్రోజులు స్క్రిప్ట్ వర్క్‌తో చాలా వేగంగా గడిచాయి.

**రేపనేది ఉంటుందనే ఆశతో సమాజంలో రూపాయి రూపాయి కూడబెట్టుకొని అందులోంచి ఓ పది రూపాయలు అదే సమాజానికి అందించి ఎంతో సేవ చేశామని తృప్తి పడుతున్నాం మనం. కానీ తమ జీవితాల్నే పణంగా పెట్టి సమాజం కోసం పనిచేస్తున్న ఈ అసలైన వీరులదే కదా నిజమైన సేవ.**



ఎప్పుడూ ఒకటే పనితో ఉండడంతో కొత్త ఐడియాలు తట్టక ఆ పని పక్కన పెట్టి టీవీలో న్యూస్ పెట్టాను. ఏవో చిన్నచిన్న కారణాలతో రోడ్లపైకి వస్తున్న జనాన్ని వెరైటీ వెరైటీ శిక్షలతో పోలీసులు కొడ్తున్న దృశ్యాలు చూపించారు. 'ఛీ.. ఈ శాడిస్టులు అన్నింట్లో ఇంతే! క్రైం సీన్లో నైనా... కామెడీ సీన్లో నైనా కొట్టడమే వీరి పని' అని చీదరించుకున్నా.

ఈ లోగా శ్రీమతి వేడివేడిగా మసాలా దోశ ఇవ్వడంతో తీసుకొని తింటూ... నేషనల్‌గా ఏం జరుగుతుందోనని ఇంగ్లీష్ ఛానెల్ పెట్టా...

రోడ్ల నిండా కుప్పకుప్పలుగా జనం, పనుల్లేక వందల వేల కిలోమీటర్లు నడుచుకుంటూ పోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. చిన్నచిన్న పిల్లలని మెడల మీద కూర్చోబెట్టుకొని, భుజాలకు సంచులు తగిలించుకొని, పెళ్లాం పిల్లలతో, తల్లిదండ్రులతో పనులు లేక సొంతూళ్లకు పోతున్న వలస కూలీలు వాళ్లు. దారిపొడవునా ఎవరైనా దాతలు దయతలిచి పెడితే తింటూ..., లేకుంటే పస్తులతోనే నడుస్తూ..., ఒక్కపూట తిండిలేక ఇంటిల్లిపాది పడుతున్న బాధలు చూస్తుంటే చేతిలో ఉన్న దోశ తినాలనిపించలేదు.

ఈ లోగా మా ఆవిడ చేతిలోని రిమోట్ లాక్కుంటూ, "సి.ఎం. మాట్లాడుతున్నాడంటా లైవ్లో" అంటూ ఛానెల్ మార్చింది.

సీరియళ్లకి తప్ప అంత ఆత్రంగా నా దగ్గర రిమోట్ తీసుకోని మా ఆవిడ న్యూస్ ఛానెల్ పెట్టిందంటే ఏదో పెద్ద విశేషమే ఉండి ఉంటుందంటూ ఆసక్తిగా చూశా.

గంటసేపు సాగిన సి.ఎం. ప్రసంగం అప్పుడే అయిపోయిందా అనిపించింది. అంతకుముందు నార్త్ ఇండియాలో చూసిన హృదయ విదారక దృశ్యాలతో కకావికలం అయిన మనసు, సి.ఎం. ధైర్యవచనాలతో కాస్త కుదుటపడింది. అందరికీ నేనున్నాననే భరోసానిస్తూ... ఉచితంగా డబల్ రేషన్‌తో పాటు కూరగాయల కోసం అకౌంట్లో డబ్బులు

క థ

వేస్తానని చెపుతూ.. మైగ్రేంట్స్‌ని కూడా కడుపులో పెట్టుకొని చూసుకుంటాం... అని ధైర్యం ఇస్తుంటే కొంత ఉపశమనం కలిగింది.

చివరగా ఆయన అన్న మాటలు నాలో ఆలోచన రేకెత్తించాయి. సమాజం తన బాధ్యత నిర్వర్తించాల్సిన సమయమిది. ఉన్నంతలో మన చుట్టూ ఉన్న వాళ్ల కనీస అవసరాల్ని చాతనయినంతలో తీర్చమన్న ఆయన మాటలతో మా ఊర్లో బిల్డింగ్ పని చేసే కూలీలు గుర్తొచ్చారు. వెంటనే ఊర్లో వున్న రవిగాడికి ఫోన్ చేసి వాళ్లెంతమంది ఉన్నారో కనుక్కున్నా. కిరాణా దుకాణం వెంకటేశంకి ఫోన్ చేశా. ఒక్కొక్క కుటుంబానికి నెలకి సరిపడే సామాన్లన్నింటినీ మూటలుగా కట్టి ఉంచమని చెప్పి వెంటనే డబ్బులు ఆన్‌లైన్‌లో పంపించా. రవిగాడికి వాటిని తీసుకొని ఆ కూలీల కుటుంబాలకి అందించమని చెప్పి ఫోన్ పెట్టేసా. కొంచెం తృప్తిగా అనిపించింది.

వెంటనే ఈ సామాను తీసుకుంటున్నప్పుడు వాళ్ల కళ్లలో తృప్తిని చూడాలనిపించింది. కానీ, పోలీసులని తప్పించుకొని వెళ్లాలి కాబట్టి అప్పటికప్పుడే ఓ కథ అల్లుకున్నా. అలాగే వచ్చేటప్పుడు ఊర్లో ఒక్కతే ఉన్న అమ్మని తీసుకు రావచ్చని వెంటనే రెడీ అయి, సాయంత్రం వస్తానని శ్రీమతికి చెప్పి బయల్దేరా.

మా ఊరు నేనుంటున్న ఏరియాకి యాభై కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మా గల్లీలోంచి మెయిన్ రోడ్డెక్కగానే పోలీసు నా ముందున్న బండిని ఆపాడు. వాడు ఏదో ఆశీర్వాద్ అటా కోసం వచ్చానని చెప్పడంతో లాఠీతో ఒక్కటిచ్చి వెనక్కి పంపించాడు పోలీసు. నా ముందే ఒకణ్ని కొడుతుంటే.. కొట్టే అధికారం ఎవడిచ్చాడని అడగాలనిపించింది. నా దగ్గరికి రాగానే అలవోకగా అతనికి ముందే సిద్ధం చేసుకున్న అబద్ధపు కథ చెప్పి వెళ్ళబోతూ, "కొట్టడం ఎందుకండి, చెపితే సరిపోతుందిగా" అన్నా.

"ఎవడింటున్నాడు సర్ కొట్టకపోతే..

**మా ఊరు నేనుంటున్న ఏరియాకి యాభై కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మా గల్లీలోంచి మెయిన్ రోడ్డెక్కగానే పోలీసు నా ముందున్న బండిని ఆపాడు. వాడు ఏదో ఆశీర్వాద్ అటా కోసం వచ్చానని చెప్పడంతో లాఠీతో ఒక్కటిచ్చి వెనక్కి పంపించాడు పోలీసు. నా ముందే ఒకణ్ని కొడుతుంటే.. కొట్టే అధికారం ఎవడిచ్చాడని అడగాలనిపించింది.**

సమస్యని అర్థం చేసుకోకుండా ప్రతివాడు ఏదో ఓ రీజన్ చెప్పి తిరుగుతున్నవాడే. మేం రోడ్ల మీద తిండీ తిప్పలు మాని, పెండ్లాం పిల్లలని వదిలేసి ఇరవై నాలుగ్గంటలు కాపాలా కాస్తుంది మాత్రం ఎవరి కోసం సార్... వాళ్ల కోసమేగా! ఇలా అడ్డదిడ్డంగా తిరిగి రోగం అంటించుకుంటే వానితో పాటు వాని ఇంటిల్లిపాది మొత్తం చస్తారు గదా!" అంటూ కుర్చీలో కూర్చోబోతున్నవాడు, ఇంకెవడో బండిమీద రావడం చూసి అటువైపెళ్ళాడు.

ముందుకెళ్తుంటే రోడ్డుపై జనం అక్కడక్కడా ఉన్నారు. కారు రయ్యిమని దూసుకెళ్తుంది, సర్కిల్ దగ్గరికి రాగానే బారికేడ్లు అడ్డంగా ఉన్నాయి. కొంచెం మెల్లగా కారును పోనిచ్చాను. అక్కడో అయిదారుగురు పోలీసులున్నారు. ఇంకో ముగ్గురు నలుగురు కొంచెం దూరంగా చెట్టుకింద నిలబడే టిఫిన్ తింటున్నారు. బారికేడ్లు దాటుతుంటే అర్థమయింది, ఆ టిఫిన్ వాళ్లు ఇల్లల్లోంచి తెచ్చుకుంది కాదని. అక్కడే ఆపిన పోలీసుని అడిగాను, "ఇంట్లోంచి బాక్సులు తెచ్చుకుంటున్నారా సర్?" అని.

"ఏం బాక్సులయ్యా ఇంటికి పోక వారమయింది. ఎక్కడ కరోనా అంటిస్తామో అనే భయంతో అసలు పిల్లల్ని కలవాలంటేనే భయమేస్తుంది. కంట్రోల్ రూం నుండే రావడం, పోవడం. భోజనం కూడా అక్కడినుండే వస్తుంది. అన్ని ఏరియాలు కవర్ చేయడం వాళ్ళకి కూడా కష్టమే కదా! అందుకే ఒక్కోసారి అట్లా ఎవలన్నా దాతలు ఇస్తేనే తినేది" అంటూ వాళ్ళని చూపించాడు.

ఎందుకో మొదటిసారి నాకు సిగ్గేసింది, ప్రతి సందర్భంలో పోలీసుల్ని తిట్టుకునే నాకు తొలిసారి అలా ఆలోచించినందుకు అదోలా అనిపించింది. సొంత పిల్లల్ని కూడా మనఃస్ఫూర్తిగా హత్తుకోలేని పరిస్థితుల్లో డ్యూటీ చేస్తున్న అసలు సిసలు వారియర్స్ వాళ్ళే అనిపించింది.

ఇంతలో పెట్రోల్ బంకులోకి పోయి పెట్రోల్ కొట్టిస్తుంటే... బంకు బయట ఒక పోలీసు అక్కడ అడుక్కుంటూ ఉండే ముసలాయనకి పండ్లు, బ్రెడ్డు పాకెట్లిస్తున్నాడు. బంకు పిల్లాణ్ణి అడిగితే.. "ఈ ముసలోడు ఇక్కడే అడుక్కుంటూ ఆ గుడిసెలో ఉంటాడండీ! ఇప్పుడెవరూ రావడం లేదు కదా.. పాపం ఈ పోలీసుల్లే ఆ ముసలాడికి అప్పుడప్పుడు తినడానికేమైనా ఇస్తుంటారండీ" అన్నాడు.

అలా ముందుకు సాగుతున్న నాకు ప్రతీ జంక్షన్లో, చెమటలు కక్కుతూ... మాసిపోయి నలిగిపోయిన బట్టలతో కన్పిస్తున్న పోలీసుల్ని చూసి కళ్లలో నీళ్ళు తిరిగాయి. యువకుడైన కానిస్టేబుల్ నుండి, పండిపోయిన హెడ్ కానిస్టేబుల్ వరకూ అందరూ అలా రోడ్లపై గంటలు గంటలు సమాజం బాగుండాలని నిలబడే ఉండడం చూసి వాళ్ళకి మనసులోనే సెల్యూట్ చెప్పుకున్నా.

ఊర్లో డిస్ట్రిబ్యూషన్ అయ్యాక అమ్మతో వెజిటబుల్ బిర్యానీ వండించి పాకెట్లలో పాక్ చేసుకొని వస్తూ... కనబడ్డ ప్రతీ జంక్షన్లో పోలీసులకి వాటిని అందిస్తూ వచ్చా.

రేపనేది ఉంటుందనే ఆశతో సమాజంలో రూపాయి రూపాయి కూడబెట్టుకొని అందులోంచి ఓ పదిరూపాయలు అదే సమాజానికి అందించి ఎంతో సేవ చేశామని తృప్తి పడుతున్నాం మనం. కానీ తమ జీవితాల్నే పణంగా పెట్టి సమాజం కోసం పనిచేస్తున్న ఈ అసలైన వీరులదే కదా నిజమైన సేవ.

సాహిత్యం




# బెల్‌బాటమ్

బెల్‌బాటమ్ 2021లో వచ్చిన భారతీయ హిందీ సినిమాలలో పేర్కొనదగింది. దీని దర్శకులు రంజిత్ ఎం. తివారి. కథారచయితలు అస్సీమ్ అరోరా మరియు పర్వేజ్ షేయిక్. వాసు భగంతి జాకీ భగంతి ఈ చిత్ర నిర్మాతలు. అక్షయ్ కుమార్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో లారాదత్తా, వాణీకపూర్ హుమా ఖ్యరేసి మొదలైన నటులు ఉన్నారు. బెల్‌బాటమ్ చిత్రం నిజంగా జరిగిన కిడ్నాపింగ్ సంఘటనలతో కూర్చబడింది. ఖలిస్తానీ వేర్పాటువాదులు (1980) భారతీయ విమానాలను ఫ్లైట్ 423, 405, 421 లను హైజాక్ చేసిన సంఘటన ఈ చిత్రానికి స్ఫూర్తి.

అక్షయ్ కుమార్ ఒక ఏజెంట్‌గా నటించాడు. అతని కోడ్ నేమ్ బెల్‌బాటమ్. విమానం హైజాక్‌కు గురి అయి అమృత్‌సర్‌లో ల్యాండ్ అవుతుంది. ఐదేళ్ళలో ఇది ఏడవ హైజాకింగ్ సంఘటన. ఈ సినిమా 210 (hostages) మరియు (net) నలుగురు హైజాకర్లు దీన్ని హైజాక్ చేస్తారు. ఈ ఆపరేషన్ వ్యక్తిగత విషాదానికి సంబంధించి ఉండడం వల్ల ప్రేక్షకుని మరింత సంలీనం చేస్తుంది. కుమార్ ఇతర సినిమాలు వాస్తవ సంఘటనల ఆధారంగా నిర్మించినట్టే ఈ సినిమా కూడా నిర్మించబడింది. 1970, 80లలో జరిగిన వాస్తవ సంఘటనల ప్రభావం ఈ చిత్రం మీద కనిపిస్తుంది. కరోనా విజృంభణను కూడా లెక్క చేయకుండా షూటింగ్ జరగడం మరో గమనించాల్సిన అంశం. ఒక ఆర్మీ మాన్‌లాగా కనిపించే అక్షయ్ కుమార్ ప్రవేశమే మనల్ని అలరిస్తుంది. అక్షయ్ కుమార్ భార్య వాణీకపూర్ కూడా చిత్రంలో నటించి తన పాత్రకు న్యాయం చేసింది. టెర్రరిస్ట్లు బంధించిన తను సహచరులను విడిచిపెట్టాలని, ఇంకా తమకు కావలసినంత డబ్బు కావాలనే డిమాండ్స్‌తో ఈ హైజాక్‌కు పాలుబడతారు. ఈ కేసును హాండిల్ చేయడానికి బెల్‌బాటమ్ అని కోడ్ నేమ్ కలిగిన రా ఏజెంట్‌ని నాటి ప్రధాని ఇందిరాగాంధి నియమిస్తుంది.

భారతీయ విమానం ఉగ్రవాదులు హైజాక్ చేస్తారు. ఇందిరాగాంధి (లారాదత్తా) పాకిస్తానీలతో చర్చలు జరుపుతుంది. అన్ని చర్చలను ఆపమని ప్రధానమంత్రిని కోరిన (RAW) ఏజెంట్ బెల్‌బాటమ్ హైజాక్ చేయబడ్డ విమానాన్ని సురక్షితంగా తిరిగి తీసుకువస్తాడు.

ఏజెంట్‌గా అక్షయ్‌కుమార్ నటన చెప్పుకోదగింది. లారాదత్తా ఇందిరాగాంధి పాత్రలో హుందాగా కనిపిస్తుంది. పాకిస్థానీ ఏజెంట్లుగా నటీనటులు మెప్పించారు.

సౌది అరేబియా కువైట్ మరియు ఖతార్ అనే మూడు గల్ఫ్ దేశాల్లో ఈ చిత్రం నిషేధించబడింది. చారిత్రక వాస్తవాలు తారుమారు చేశారనే కారణంతో సర్టిఫికేషన్ అధికారులు నిషేధించారు.

కాగా ఈ చిత్రం ఉత్సుకత రేపిన చిత్రంగా భారతీయ చిత్రజగత్తులో నిలిచిపోయింది. పంజాబి- పాకిస్తానీ ఉగ్రవాదుల విపరీత చర్యలు అందుకు మన ప్రభుత్వం ఏజెంట్ ద్వారా తీసుకున్న ప్రతిచర్యలు ఈ చిత్రంలో ప్రధానాంశం.

వ్యాసం

# బమ్మెర పోతన - తెలంగాణ

**పోతన ఓరుగల్లు వాడేనని మరోసారి నిరూపించిన వ్యాసం...**



రామోజు హరగోపాల్
99494 98698

నేను బమ్మెరను 2,3 సార్లు చూసాను. బమ్మెర పోతన ఊరని మనసు ఉప్పొంగింది. అంతలోనే బమ్మెర ఎక్కడివాడన్న వివాదాలు విని, చూసి, చదివి బాధ కలిగింది.

మొన్నీ మధ్యన మా కొత్త తెలంగాణ చరిత్ర బృందం బమ్మెరలో చరిత్ర యాత్ర చేసినపుడు బమ్మెర స్మారక మందిర ప్రాంగణంలో ఒక శిథిలాలయ ద్వారం వెలుగు చూసింది. ఆ ద్వార లలాట బింబంగా తిరునామాలున్నాయి. ద్వారానికి ఎడమవైపు రాతి పలకల పీఠం వుంది. పోతన అక్కడ కూర్చొని రాసుకునే వాడని ప్రజలు చెప్పుకుంటారు. ద్వారానికి కుడిపక్కన బారుకత్తులున్న వీరగల్లు ఫలకమొకటుంది. నేలమీద ముక్కలై పడివున్న వైష్ణవ భక్తుడి శిల్పం వుంది. పాతకాలపు పెద్ద ఇటుకల ముక్కలున్నాయి. పోతన సమాధి, పోతనబాయి, పోతన తల్లిపేరన లక్కమ్మ చెరువు... పోతన వంశీకులమని చెప్పుకునే వారు... ఇవి బమ్మెరలో పోతన ఆనవాళ్ళు.

గ్రామం చివర శిథిలాలయమొకటి వుంది. ఉత్తరాభిముఖంగా వున్న శివాలయం. గర్భగుడి, అంతరాళం, అర్థమంటపాలతో వున్న గుడి. గర్భగుడిలో వుండవలసిన పాతశివలింగం నేలలో కూరుకుని వుంది. అంచున పార్వతి విగ్రహం (కొత్తది), శివలింగం వున్నయి. బయటొక పాతనంది పడవేసివుంది. గుడిద్వారం మాత్రం తూర్పున వుంది.దానికిరువైపుల వుండాల్సిన ద్వారపలకలు పక్కన పడవేసివున్నాయి. వాటి మీద కలశాలు చెక్కివున్నాయి. గుడివాలకం వల్ల పునరుద్దరణకు గుర్తైనట్టు తెలుస్తున్నది. గుడి పక్కన వీరగల్లులు పడివున్నాయి. ఒక వీరగల్లు యుద్ధరంగంలో ఏనుగు శత్రుసైనికుణ్ణి దునుమాడుతున్న శిల్పం. దాని మీద 9, 10 శతాబ్దాలకు చెందిన తెలుగులిపిలో చిన్న స్మారక శాసనం వుంది.

**బమ్మెర వీరగల్లు శాసనం...**

1. స్వస్తిశ్రీ
2. చగళ
3. తి పుత్రహా
4. తం ళగణిల
5. త్ర
6. ధర్మ్మనకుగ
7. ............
8. ............ల
9. ళ.........
10. పతి.........
11. గ............
12. ..........
13. ..............

బమ్మెర ప్రాచీనతకు నిదర్శనాలెన్నో వున్నాయి. గూడూరు శాసనం 12 శతాబ్దానిదే కాని, అక్కడక్కడ గ్రామం బయట క్రీస్తుపూర్వపు మెగాలిథిక్ సమాధుల ఆనవాళ్ళు, మెన్హర్లు అగుపిస్తున్నాయి.

పోతన బమ్మెరవాడు కాడని, ఒంటిమిట్టవాడని కట్టా నరసింహులుగారు అనేకవిధాల నిరూపించే ప్రయత్నం చేసారు. బుక్కరాయలు తాను ఓరుగల్లును స్మరించి ఒంటిమిట్టను ఏకశిలానగరం అని వుంటాడని ఒక వూహ చేసారు. 'కాటుక కంటినీరు పద్యాంతంలో నిను నా కటికింగొనిపోయి అల్ల కర్ణాట కిరాట కీచకులకమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ' అన్న మాటలో ఆ కర్ణాట కిరాటకీచకులెవ్వరు? సంగమవంశం చివరికాలంలో వ్యసనపరుడైన విరూపాక్షుడై వుంటాడని సంభావించారు. పోతన విరూపాక్షునితో వేగలేకే బమ్మెర బాట పట్టివచ్చాడని, దారిలో జారిపోయిన భాగవతంలోని 4 స్కంధాలను ఓరుగల్లువారైన గంగన, సింగన, నారయ్యలు పూరించారని అభిప్రాయ పడ్డారు కట్టా నరసింహులు గారు. పోతన నాచనసోముని (బుక్కరాయల ఆస్థాన కవి) అనుకరించాడని కొన్ని పద్యాలను ఎత్తిచూపించారు.

పోతన ఒంటిమిట్ట రఘురాముణ్ణే స్మరించాడని క్రింది ఉదాహరణలిచ్చారు.

ద్వితీయ స్కంధం - రాఘవరామా

ద్వితీయ స్కంధం - రాఘవా



చతుర్థ స్కంధం- రాఘవరామా
సప్తమ స్కంధం- రఘుకులతిలకా(480)
అష్టమ స్కంధం- రాఘవరామా(740)

పోతనలు రచనలు కాని స్కంధాల్లో రఘు సంబోధనలు లేవు.

(పోతన ఒంటిమిట్టవాడే... బ్లాగు రచనః విద్వాన్ కట్టా నరసింహులుగారు. రిటైరైన భాషాపండితులు. సిపి బ్రౌన్ భాషాపరిశోధన కేంద్ర బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి. మెకంజీ కైఫీయత్తులకు సంపాదకత్వం వహిస్తున్నారు.)

పోతన బమ్మెరవాడు కాడా? ఒంటిమిట్టవాడా??

ఒంటిమిట్టలో జీవించిన పోతన రాజు విరూపాక్షునితో బాధలు పడలేక బమ్మెరకు వచ్చి స్థిరపడ్డారంటారు కట్టా నరసింహులుగారు. బమ్మెరలోనే ఎందుకున్నాడన్న దానికి కారణం వుండాలి కదా. బంధువులా, రాజాశ్రయమా ఏది కారణం? రాజాశ్రయమైతే ఓరుగల్లులోనే వుండాలికదా. మరి పోతన రాసిన భోగినీదండకం, వీరభద్రవిజయం ఎక్కడ, ఎపుడు రాసివుంటాడు. పరమమాహేశ్వర వ్రతుడైన పోతన భాగవతం ఎట్లా రాసాడు. పోతన పూర్వ జీవితమక్కడిదే అని చెప్పడమెట్లా? బొమ్మిడిగడ్డలో వుండవచ్చున్నదానికి ఆధారమేది? అక్కడనుండి ఒంటిమిట్టలో కాపురంపెట్టి వుంటాడన డానికి తగిన నిదర్శనం లేదు.

1975 ఏప్రిల్ 12 (ఉగాది) మొదలుగా జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా అకాడమీ ప్రకటించిన లఘు గ్రంథాల వరుసలో వెంపరాల సూర్య నారాయణశాస్త్రిగారు రచించిన 'పోతన' గ్రంథంలో పోతన బమ్మెరవాడనే నిరూపించబడింది.

అంతకు పూర్వం విద్వాన్ ఖండవల్లి సూర్యనారాయణశాస్త్రిగారు రచించిన 'భక్తపోతన' అనే విమర్శాగ్రంథంలో ఏకశిలానగరమంటే కడపలోని ఒంటిమిట్ట కాదని, పోతన బమ్మెరలోనే పుట్టి అక్కడ జీవించాడనే చెప్పడానికి పోతన భాగవతాన్ని అంకితమడిగిన సింగభూపతి ఓరుగంటి ప్రాంతవాసే కావడం, భాగవత శిథిలభాగ పూరణ చేసిన నారయ మొదలైనవారు ఓరుగంటి ప్రాంతవాసులు కావడం వల్లనే ఆయనకు శిష్యులవడం, 60, 70 యేండ్ల క్రితం వరకు పోతన సగోత్రీకులు బమ్మెరలో, ఓరుగంటి ప్రాంతంలో వుండడం వంటి నిదర్శనాలున్నాయన్నాడు.

పోతన క్రీ.శ.15వ శతాబ్దిలోనివాడైన రావు సర్వజ్ఞసింగ భూపాలుడు కాలంవాడేనని చారిత్రక నిర్ణయం జరిగిందన్నాడు.

పోతన ఇవటూరి సోమనారాధ్యుల వల్ల శైవదీక్షను పొందిన వాడైనందుననే 'ఇవటూరి సోమనారాధ్య దివ్యశ్రీ



వ్యాసం






పాదపద్మారాధక, కేసనామాత్యపుత్ర పోతయప్రణీ తంబయిన వీరభద్రవిజయంబను కావ్యాన్ని, తర్వాత రాజు కొరకు కారణాంతరాల వల్ల 'భోగినీ దండకం' రచించివుంటాడు. ఆ పిదప ప్రౌఢవయస్సులో చిదానందయోగివల్ల తారక మంత్రోపదేశం పొంది వైష్ణవానుయాయుడై మహాభాగవతం రాసివుంటాడు పోతన.

జనగామ ప్రెస్టన్ ఇన్స్టిట్యూట్ లో పని చేసే అనుముల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 1957లో 'బమ్మెర పోతన' జీవితచరిత్రను గురించి పరిశోధనాత్మక గ్రంథాన్ని రచించాడు. తన గ్రంథంలో పోతన జీవితకాలం, రచనలు, నివాసము, భాగవతరచన- పరిస్థితులను గురించి పోతన రచనలు

1. వీరభద్రవిజయం 2. భోగినీదండకం

3. భాగవతం ఆధారంగా

సత్యసమీక్షణం చేసినాడు.

వీరభద్రవిజయాన్ని తాను బాల్యంలోనే రచించానని, గ్రంథ పీఠికలో తన గురువు గురించి కూడా పోతన రాసుకున్నాడు.



గురువు తనను 'మత్ర్పసాద దివ్యమహిమచే నెంతైన కవిత చెప్ప లావు గలదు నీకు' దీవించాడని రాసుకున్నాడు. తండ్రి దగ్గరే చదువుకున్నానని 'జనక శిక్షితాక్షరాభ్యాసుండనై' చెప్పుకున్నాడు.

అట్లే ఒంటి మిట్టలో వుండి అయ్యలరాజు రామభద్రుడు శ్రీరాముని పేరన శతకం రాసినట్లు అతని 'రామాభ్యుదయము'లోని పీఠికలో, తుది గద్యములో 'ఒంటిమిట్ట రఘువీర శతక కర్మఠ' అని తన గురించి తెలుస్తున్నది. కాని, ఎక్కడా ఏకశిలనగరమనే పర్యాయపదం కనపడదు. అట్లే భాగవతంలో పోతన తాను గంగకు 'జని క్రుంకులిడి వెడలి మహనీయ మంజులపులిన శోభితప్రదేశంబున మహేశ్వరధ్యానంబు సేయుచుండగా' ఒంటిమిట్ట దగ్గరున్న పెన్నానదా కాదు గంగ అని పిలుచుకునే గోదావరి. ఓరుగల్లుకు సమీపంలోనే వుంది కదా.

**ఒంటిమిట్టలో జీవించిన పోతన రాజు విరూపాక్షునితో బాధలు పడలేక బమ్మెరకు వచ్చి స్థిరపడ్డారంటారు కట్టా నరసింహులుగారు. బమ్మెరలోనే ఎందుకున్నాడన్న దానికి కారణం వుండాలి కదా. బంధువులా, రాజాశ్రయమా ఏది కారణం? రాజాశ్రయమైతే ఓరుగల్లులోనే వుండాలికదా. మరి పోతన రాసిన భోగినీదండకం, వీరభద్రవిజయం ఎక్కడ, ఎపుడు రాసివుంటాడు. పరమమాహేశ్వర వ్రతుడైన పోతన భాగవతం ఎట్లా రాసాడు.**

రాచకొండరాజులలో అనపోతానాయని కుమారుడైన రెండవ సింగమనాయడు రసార్ణవ సుధాకర కర్త. అతని మనుమడు కుమార సింగమ నాయనిని 'రావు సింగక్ష్మానాథపౌత్రున్' సమీచీన రేచర్ల గోత్రాంబుజాతాత్మమిత్రున్ మహోదార చారిత్రు సర్వజ్ఞ సింగోర్వరాధ్యక్షు నీక్షించి' అని భోగినీదండకంలో పోతన వర్ణించినట్లు తెలుస్తున్నది.

బమ్మెర ప్రాచీనతను తెలిపే శాసనమొకటుంది. బమ్మెర పొరుగున వున్న గూడూరు గ్రామంలోని ప్రసిద్ధ 'గుముడూరు' శాసనంలో 'గుముడూర మల్లేశ్వర దేవర గుడిగ రంగభోగసెడె సర్వబాధాపరి (హార) సర్వసమస్యవాగి వేల్పుగొండ, వీరబడియ, బమ్మరిగయ ధారాపూర్వకం మాడిదరు' అనివుంది. ఇందులో పేర్కొన్న బమ్మరిగయనే బమ్మెర. (క్రీ.శ.1124, క్రోధి సం. పుష్యబ పాడ్యమి బుధవారం చాళుక్య పేర్మాడి

వ్యాసం

కుమార సోమేశ్వరుని ఆనతితో అతని ప్రధాని మానెవ్రెగ్గడ (కొలనుపాక నుండి చేసిన దానశాసనం)

బమ్మెరలో ఒకప్పుడు దొరలని పిలువబడిన భూస్వాములు నెల్లుట్లలో వైష్ణవం పుచ్చుకొన్నందున తమ ఇంటిపేరు నెల్లుట్లవారిగా మారినట్లు తెలుస్తున్నది. బమ్మెరలోని ఒక చెరువు పోతన తల్లి లక్కమాంబ పేరన లక్కమ్మ చెరువని పిలువబడుతున్నది.

లభిస్తున్న కావ్యాల వల్ల చారిత్రక సంఘటనల ఆధారంగా పోతన తన 50 యేండ్ల వయస్సులో దాదాపు 1460 ప్రాంతంలో భాగవతరచన చేసివుంటాడని చెప్పొచ్చు. ఆ సమయంలో మహమ్మద్ షా-2 రాజ్యానికి వచ్చాడు. తెలంగాణా మహమ్మదీయుల వశమైంది ఈ కాలంలోనే. మహమ్మద్ షా రాజులనే కాక బ్రాహ్మణుల ననేకమందిని కొండపల్లికోట ద్వారంలో అతిక్రూరంగా చంపించినట్లు చరిత్రకారుల రాతలు. పోతన కూడా ఈ ఈతి బాధలకు గురైవుంటాడేమో. ఆ సందర్భాన్నే భాగవతాన్ని భూస్థాపన చేసినందువల్ల గ్రంథం నష్టమైపోయి వుంటుంది. ఈ ప్రభువులనే పోతన కర్ణాట కిరాట కీచకులన్నాడేమో. అప్పటికి సర్వజ్ఞసింగభూపాలుడున్నాడో లేడో.

కొరవి గ్రామానికి దగ్గరలో వున్న వేముగల్లువాసియైన కసవయ్య కొడుకు కొరవి గ్రామం పేరు ఇంటిపేరైన కొరవి గోపరాజు పినతండ్రులు, సాళువ నరసింహునికి జైమినిభారతము నంకితమిచ్చిన పిల్లలమర్రి పినవీరభద్రుడు పోతనకు సమకాలికులుగా వుండే అవకాశాలున్నాయని అనుముల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రాసారు.

పోతన వంశక్రమం × మల్లయ్య × భీమన్న × అన్నయమంత్రి భార్య గౌరమాంబ × సోమన్న భార్య మల్లమ్మ

1. రేచన్న 2. అన్నయ్య

3. ఎల్లన్నభార్య మాచాంబ

4.అయ్యలన్న 5 మాచయ్య

1. కేసన్న భార్య లక్కాంబ

2.మాధవుడు

3. ఇమ్మడి

1. తిప్పన్న 2 పోతన్న

కేసన్న(ప్రౌఢసరస్వతి)

1.అప్పలమ్మ 2.వీరమ్మ

దాక్షాయణీపరిణయకర్త

1. కేసన్న 2.ఎల్లమ్మ.............

3 మల్లన్న

ఈమె అజ్జరపు పేరలింగం భార్య వీరనరసమ్మ గంగన్న.

కవిత

# గజల్



కల్లెం నవీన్ రెడ్డి, 99636 91692



మమతల మూట కట్టుకుని విహరించి చూడు!
ఎన్నెన్నో వర్ణాలు అల్లుకుని వికసించి చూడు!!

చెమ్మ గిల్లిన కళ్లకేం తెలుసు స్వప్నాల విలువ!
చెదిరిపోని మనస్సుని పూయించి చూడు!!

మరచిపోని మాటలే తోడుగా నా వెంటే నిత్యం!
కదలకుండా చేసి నా హృదయమై కవ్వించి చూడు!!

ఎంతకాలం ఈ నటన చూడలేక పోతున్నా!
అద్దం ముందు నిన్ను నీవు చిత్రించి చూడు!!

ఏల నవీన్! మనిషి నడక అలా తేలిపోతోంది?
కపటపు విన్యాసమది, కడదాకా పరికించి చూడు!

# బాలీవుడ్‌లో స్టైలిష్ విలన్ హైదరాబాదీ అజిత్‌ఖాన్

**జనవరి 27న అజిత్ అలీ ఖాన్ శతజయంతి సందర్భంగా..**

(27 జనవరి 1922 - 22 అక్టోబర్ 1998)




పొన్నం రవిచంద్ర

94400 77499


"సారా షెహర్ ముఝే లయన్ కే నామ్ సే జాన్‌తా హై"... మూడున్నర దశాబ్దాల కిందట బాలీవుడ్‌ను ఉర్రూత లూగించిన డైలాగ్ ఇది. బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ హీరోగా నటించిన 'కాళీచరణ్' సినిమాలో ఈ డైలాగ్ పలికిన విలన్ పాత్రధారి అజిత్‌ఖాన్. బాలీవుడ్‌లో స్టైలిష్ విలన్‌గా ప్రేక్షకాదరణ పొందిన ఖ్యాతి అజిత్ ఖాన్‌కే దక్కుతుంది. 200కు పైగా చిత్రాల్లో హీరోగా, విలన్ గా నటించి 4 దశాబ్దాలకు పైగా సినీ ప్రేక్షకులను అలరించారు. అజిత్‌ఖాన్ అసలు పేరు హమీద్ అలీఖాన్. బాలీవుడ్‌లో వెలుగు వెలిగిన అజిత్ మన హైదరాబాదీనే. నిజాం జమానాలో చరిత్రాత్మకమైన గోల్కొండ ప్రాంతంలో 1922 జనవరి 27న పుట్టాడు.



విద్యాభ్యాసమంతా హైదరాబాద్, వరంగల్ లలోనే సాగింది. అజిత్ తండ్రి బషీర్ అలీఖాన్ నిజాం సైన్యంలో పనిచేసారు.

1922 జనవరి 27న హైదరాబాద్‌లోని గోల్కొండలో బషీర్ అలీ ఖాన్, సుల్తాన్ జెహాన్ బేగం దంపతులకు జన్మించిన అజిత్ అసలు పేరు హమీద్ అలీ ఖాన్. అజిత్ పూర్వీకులు ఆఫ్గన్ నుంచి యుపిలోని షాజహాన్‌పూర్‌కు తరలివచ్చారు. అతని తాత నిజాం సైన్యంలో చేరడానికి హైదరాబాద్‌లోని గోల్కొండకు వచ్చి స్థిరపడ్డాడు. అజిత్ తండ్రి బషీర్ అలీఖాన్ నిజాం సైన్యంలో పరిపాలన విభాగంలో పనిచేసాడు. బషీర్ అలీ ఖాన్ నలుగురు పిల్లల్లో ఒకడు అజిత్ హమీద్ ఆలీ ఖాన్. హమీద్ అలీ ఖాన్ సినిమా ప్రపంచంలోకి అడుగుపెట్టిన తర్వాత సంపాదించుకున్న వెండితెర పేరు అజిత్. అజిత్ తన ప్రాథమిక విద్యను గోల్కొండ స్కూల్‌లో పూర్తి చేసి, నాంపల్లి హైస్కూల్‌లో హెచ్.ఎస్సీ చేసిన తర్వాత వరంగల్ జిల్లాలోని హన్మకొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివాడు. చిన్నప్పటి నుంచి నటనపై మక్కువ పెంచుకున్న అజిత్, తోటి విద్యార్థుల ప్రోత్సాహంతో చిత్ర పరిశ్రమలో ఎలాగైనా తన కెరీర్‌ను ప్రారంభించాలన్న ధృడ సంకల్పంతో హన్మకొండలో చదువుకుంటున్న సమయంలో ఇంటి నుంచి పారిపోయి, హిందీ చిత్ర పరిశ్రమకు గుండెకాయ అయిన బొంబాయి చేరుకున్నాడు. ప్రయాణ ఖర్చుల కోసం కాలేజీ పుస్తకాలను అమ్మేశాడు.

హైదరాబాద్ కు చెందిన ప్రముఖ కవి 'షాహిద్ సిద్దిఖీ', బొంబాయిలో ప్రముఖ చిత్ర దర్శకులు 'రఫీక్ ఘజ్నవీకి' రాసిన ఉత్తరాన్ని తీసుకుని బొంబాయి వెళ్ళి ఆయన్ని కలిశారు. అయితే రఫీక్ అప్పటికే ఆర్థికంగా నష్టపోయి తాను

సినిమాలు తీయడం లేదని చెప్పడంతో స్వయంగా వేషాలకోసం ప్రయత్నాలు మొదలుపెట్టి, చిన్న చిన్న సహాయక పాత్రలు ధరిస్తూ.., డాక్యుమెంటరీలలో నటిస్తూనే ప్రొడక్షన్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేశారు. అజిత్ సినిమాల్లో వేసిన సహాయక పాత్రలతో పాటు, డాక్యుమెంటరీలలో వేసిన పాత్రలు, ప్రతిభ నిర్మాతల దృష్టిలో పడటంతో 1946లో గీతాబాలీ సరసన 'షా-ఏ-మిశ్రా'లో అజిత్ కు హీరోగా నటించే అవకాశం వచ్చింది. షా-ఏ-మిశ్రా చిత్రం తర్వాత "సికందర్, హతిమ్‌తాయ్, జీవన్ సాతీ, ఆప్ బీటీ, సోనేకీ చిడియా, చందాకీ చాందిని" వంటి పలు చిత్రాల్లో హీరోగా నటించాడు. 1950లో, దర్శకుడు కె. అమర్‌నాథ్ అజిత్‌ని తన 'బెకసూర్' చిత్రంలో మధుబాల సరసన తీసుకున్నాడు, ఆ సినిమా షూటింగ్ సమయంలో పేరు మార్చుకొమ్మని ఆ చిత్ర దర్శకుడు అమర్‌నాథ్ ఇచ్చిన సలహా మేరకు హమీద్ ఖాన్ తన పేరును 'అజిత్'గా మార్చుకున్నాడు. కాగా ఈ చిత్రం 1950 లో వచ్చిన అతి పెద్ద హిట్ సినిమాల్లో ఒకటిగా నిలిచింది. అజిత్ హీరోగా 50 వ దశకంలో నటించిన



చిత్రాలలో "నాస్తిక్, తరంగ్, సర్కార్ సయ్యా, వాస్నా, ఆసబాస్, బడా భాయ్, మిలన్, బారాదరి, ధోలక్" ఉన్నాయి. వీటన్నింటిలో అజిత్ నటించాడు. ప్రముఖ బాలీవుడ్ నటి 'గీతాబాలి'తో హీరోగా ప్రస్థానం మొదలు పెట్టిన అజిత్ సికిందర్ చిత్రంలో 'వనమాల', ఆప్ బీటీ లో 'ఖుర్షీద్', చందాకీ చాందినిలో 'మోనికా దేశాయి'లతో నటించాడు. 1956 లో వచ్చిన 'మెరైన్ డ్రైవ్' చిత్రం సక్సెస్ సాధించింది. అజిత్ ఆ తర్వాత రెండవ ప్రధాన పాత్రలకు మారాడు, ఆర్థిక ఇబ్బందుల కారణంతో అజిత్ సహనటుడిగా ఈ చిత్రాలలో "నయా దౌర్, మొఘల్-ఎ-ఆజం" తదితర చిత్రాల్లో నటించారు. 1957 లో విజయవంతమైన సినిమా 'నయా దౌర్' లో దిలీప్ కుమార్ కు స్నేహితుడుగా నటించి మెప్పించగా, "మొఘల్-ఎ-ఆజం" చిత్రంలో హీరో స్నేహితుడి పాత్రను పోషించి మెప్పించాడు. ఈ చిత్రంలో పృథ్వీ రాజ్ కపూర్, దిలీప్ కుమార్ లతో పాటు అజిత్ కు కూడా తగిన గుర్తింపు లభించింది.



1946 నుండి 1966 వరకు అజిత్ హీరోగా దాదాపు 80 కి పైగా చిత్రాలలో నటించి చిత్ర పరిశ్రమలో తన స్థానాన్ని సుస్థిర పరచుకోవడానికి చాలా కష్టపడ్డప్పటికి, కొన్ని సినిమాలలో మినహా హీరోగా పెద్దగా గుర్తింపు రాకపోవడంతో అజిత్ నెమ్మదిగా విలన్ వేషాలు వేయడం ప్రారంభించాడు. తొలిసారిగా రాజేంద్ర కపూర్ హీరోగా వచ్చిన 'సూరజ్'లో విలన్‌గా కనిపించాడు. 'సూరజ్' తర్వాత "ధర్తీ, ఆద్మీ ఔర్ ఇన్సాన్, పతంగా" చిత్రాలు అజిత్ ను విలన్ గా నిలబెట్టాయి. 1973 లో వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'జంజీర్'లో విలన్ పాత్రకు మంచి గుర్తింపు వచ్చింది. 'జంజీర్'తో అమితాబ్ బచ్చన్ హీరోగా నిలదొక్కుకుంటే, అజిత్ విలన్‌గా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించాడు. 'జంజీర్' తర్వాత "యాదోంకీ బరాత్, సంఝౌతా, కహానీ కిస్మత్ కీ, జుగ్నూ" వంటి చిత్రాల్లో నటించి తన ప్రతిభను నిరూపించుకుని విలన్ గా తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. సుభాష్ ఘాయ్ 'కాళీచరణ్' చిత్రంలో 'లయన్'గా గుర్తింపు పొందాడు. సాఫిస్టికేటెడ్ వేషధారణ, నెమ్మదిగా పలుకుతూనే, ఎదుటివారి వెన్నులో వణుకు పుట్టించేలా డైలాగులు పలికే తీరు అజిత్‌ను విలన్‌లకే విలన్‌గా నిలిపాయి. ముఖ్యంగా 70వ దశకంలో వచ్చిన బ్లాక్‌బస్టర్ సినిమాల్లో అజిత్ ఎక్కువగా విలన్ గ్యాంగ్ నాయకుడి పాత్రల్లోనే ప్రేక్షకులను అలరించాడు. అజిత్ గ్యాంగులో "జీవన్, ప్రేమ్‌చోప్రా, రంజీత్, కాదర్ ఖాన్, సుజిత్ కుమార్" వంటి ఛోటా విలన్‌లు ఉండేవారు. అజిత్ తన నాలుగు దశాబ్దాల చలనచిత్ర

జీవితంలో, లెజెండరీ పృథ్వీరాజ్ కపూర్, సోహ్రాబ్ మోడీ, అమితాబ్ బచ్చన్, ఐఎస్ జోహార్, దిలీప్ కుమార్, దేవ్ ఆనంద్, షమ్మీ కపూర్, ధర్మేంద్ర, రాజ్ కపూర్ వంటి అనేకమంది నటులతో పాటు, "మీనాకుమారి, మధుబాల, వనమాల, ఖుర్షీద్, నళినీ జయవంత్, గీతా బాలి, సురయ్యా, కామినీ కౌశల్, నిమ్మీ, బీనా రాయ్, బి సరోజా దేవి మొదలైన హీరోయిన్ లతో కలసి నటించారు.

## సినిమాల్లో అజిత్ స్టైలే వేరు

స్ఫూరద్రూపం, గాంభీర్యం నిండిన కంఠస్వరం వున్నాయి కాబట్టి, అజిత్ విలన్‌గా వేసినప్పుడు కూడా హుందాగానే కనబడ్డాడు. భారతీయ చిత్ర పరిశ్రమలో విలన్ అంటే ముఖం మీద గాట్లు, గళ్ళ టీ-షర్ట్,లుంగీ భాషలో రఫ్ నెస్ కలిగి వుండేవారు. అయితే అజిత్ ఇవేవీ లేకుండా ఉన్నత విద్యావంతుడిలా, ఎప్పుడూ ఖరీదైన సూట్లు వేసుకుంటూ, హుందాగా కనిపిస్తూ, పైప్ కాలుస్తూ, డాన్‌గా వుంటూ, యితరుల చేత నేరాలు, ఘోరాలు చేయించడం తప్ప, తను స్వయంగా బలాత్కారాలు చేయడం లాటివి చేయడు. గొంతు చించుకుని పెద్ద డైలాగులు చెప్పకుండా హీరోతో సమాన స్థాయిలో కనబడేవాడు. ఆయన బంగారం స్మగ్లింగ్ చేసే పాత్రలే ఎక్కువగా ధరించారు. ఆయన గ్యాంగ్ లో క్రిష్టియన్ పేర్లు ఎక్కువగా వుండేవి. రాబర్ట్, మైఖేల్, పీటర్ వంటి పేర్లు వినిపించేవి. సినిమాల్లో విలన్ అన్నాక పక్కన వ్యాంప్ తప్పనిసరి. అజిత్ సినిమాల్లోనూ ఒక మహిళా వ్యాంప్ పాత్రధారిణి ఉండేది. తరచూ వ్యాంప్ పాత్ర పేరు 'మోనా'గానే ఉండేది. 'కళాపోషణ' సన్నివేశాల్లో 'మోనా! డార్లింగ్...', 'లిల్లీ డోంట్ బి సిల్లీ..' అంటూ అజిత్ గోముగా పలికే తీరు అభిమానులను విపరీతంగా ఆకట్టుకునేది.

బారిటోన్ వాయిస్‌లో విచిత్రమైన డైలాగ్‌లకు పేరుగాంచిన ఆయన వాటిని హింగ్లీష్ యాసలో హిందీంఇంగ్లీష్ డెలివరీ చేసేవాడు, ఇది పరిశ్రమలో మునుపెన్నడూ లేదు. అనేక సినిమాల్లో అజిత్ చెప్పిన డైలాగ్‌లు జనాదరణ పొందాయి.

విలన్‌గా కెరీర్ కొనసాగుతుండగానే 1985లో గుండెపోటు రావడంతో సినిమాలు వదిలేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదు వచ్చేశాడు. కానీ 1992లో జాకీ ష్రాఫ్-కరిశ్మా కపూర్ వేసిన "పోలీస్ ఆఫీసర్" సినిమాలో ఆఫర్



రావడంతో ఉండబట్టలేక ముంబై తిరిగి వచ్చాడు. "సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, సంజయ్‌దత్" లాంటి యువహీరోలతో కూడా కలిసి నటించాడు. దేవ్ ఆనంద్ 1995 లో తీసిన "గాంగ్‌స్టర్" అతని ఆఖరి సినిమా.

## కపూర్ కుటుంబంతో సన్నిహితంగా..

బాలీవుడ్‌లో అన్నీ రంగాలలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న కపూర్ కుటుంబంతో అజిత్ కు సన్నిహిత సంబంధాలు ఉండేవి. "మొఘల్-ఎ-ఆజం" సినిమాలో అజిత్ 'సలీం' పాత్రకు మిత్రుడు 'దుర్జన్ సింగ్'గా నటించి మెప్పించాడు. ఈ సినిమాతో కపూర్ కుటుంబంతో మొదలయిన అనుబంధం వారి నాలుగు తరాల వారితో కొనసాగింది. పృథ్వీరాజ్ కపూర్ తో "ఆనంద్ మఠ్", రాజ్ కపూర్ తో "చార్ దిల్ చార్ రహే", రణదీర్ కపూర్ తో "హీరాలాల్ పన్నాలాల్", కరిష్మా కపూర్ తో "పోలీస్ ఆఫీసర్" చిత్రాల్లో నటించారు.

## వ్యక్తిగత జీవితం

1951లో 'గ్వెన్ మాంటే' అనే ఫ్రెంచ్ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఐదేళ్ల తర్వాత విడిపోయారు. పిల్లలు లేరు. తర్వాత తండ్రి కోరిక మేరకు 'షహీదా' అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఆమెకి ముగ్గురు కుమారులు. ఆమె పోయిన తర్వాత 'జహీద' అనే ఆమెను పెళ్లి చేసుకున్నాడు. 'జహీద'కు ఇద్దరు కుమారులు కలిగారు. అజిత్ వృత్తిరీత్యా బొంబాయిలో వున్నా ఫ్యామిలీని హైదరాబాదులోనే వుంచేవాడు. అతని ఐదుగురు కుమారులు "షాహిద్ అలీ ఖాన్, జాహిద్ అలీ ఖాన్, అబిద్ అలీ ఖాన్, షెహజాద్ అలీ ఖాన్, అర్బాజ్ అలీ ఖాన్". వారిలో అర్బాజ్, షెహజాద్ అజిత్ యిష్టానికి వ్యతిరేకంగా నటులయ్యారు. షెహజాద్ ఖాన్ "అందాజ్ అప్నా అప్నా"లో తన తండ్రిని పేరడీ చేస్తూ డైలాగులు చెప్పాడు. అయితే ఈ ఇద్దరూ నటులుగా పెద్దగా రాణించలేక పోయారు.

విలక్షణమైన నటనకు, అద్భుతమైన డైలాగ్ డెలివరీకి పేరుగాంచిన అజిత్ సినిమా ప్రపంచంలో విలన్ల యాసలో విప్లవాత్మక మార్పులు తెచ్చాడు. హిందీ సినిమాల్లో నాలుగు దశాబ్దాల పాటు నటించిన అజిత్ ప్రేక్షకుల నుండి విశేష ఆదరణను పొందాడు. వందేళ్ల సినీచరిత్రలో విలన్ పాత్రలకు వన్నె తెచ్చిన బాలీవుడ్ 'లయన్' అజిత్ చిత్ర పరిశ్రమలో పూరించలేని శూన్యతను మిగిల్చి తన 76వ ఏటా అక్టోబర్ 21, 1998న తాను ఇష్టపడే హైదరాబాద్‌లో గుండెపోటుతో తుది శ్వాస విడిచారు.

కవిత

# పండగ రోజు



యెర్ర శ్రీదేవి, 99591 94224

ఇంకా చీకటి మబ్బులు వీడకముందే
నాన్న చదివిన శ్లోకాలు సూర్యకిరణాలై తట్టి లేపేవి
పేడనీటితో వాకిలంతా నానమ్మ
పరిచిన పచ్చని తివాచీపై
నా వేళ్ళు దిద్దిన రథం ముగ్గు
నానమ్మ సంతోషమై ఊరంతా
తిరిగేది
తలస్నానం చేసి తన పెద్ద నుదుట
దిద్దిన ఎర్రని గుండ్రని బొట్టుతో అమ్మ
తూర్పున ఉదయించే సూర్యబింబమయ్యేది
ఇంటి పండుగ సంబరమంతా
గుమ్మాలకు మామిడి తోరణాలయ్యేవి.
పసుపు కుంకుమ అద్దుకున్న
పెద్ద గడప వచ్చిపోయేవారికి
స్వాగత వచనమయ్యేది
గద్దెపై తులసమ్మ పేరంటానికి వచ్చి
అక్కడే కూర్చున్న పెద్ద
ముత్తైదువ అయ్యేది.
నానమ్మ నాతో నాన్న తలకు
నూనె అద్దిస్తూ నన్ను మరో అమ్మను చేసేది
ప్రసాదం ఎంగిలి కాకుండా
మమ్మి కాపలా కాసే నానమ్మ
గజదొంగలను అడ్డుకునే పోలీసయ్యేది
పండుగ రోజు పిండివంటలుగా
అమ్మ ప్రేమ మా ముందుకొచ్చేది
నాన్నకు దోసిలొగ్గి పండుగ ఇనాం
అందుకున్న నిరుపేదే పండుగ అతిథయ్యేవాడు
సాయంత్రం వేళ పండుగ అంతరార్థం వివరించే
నాన్న
మరో బృహస్పతి
అయేవాడు
కొత్త బట్టలతో సందడి చేస్తున్న
మమ్ములను నాన్న అక్కున
చేర్చుకున్నప్పుడు మేం
ప్రపంచ విజేతలమయ్యేవాళ్ళం
మళ్ళీ వచ్చే పండుగ కోసం
ఎదురుచూసేవాళ్ళం.



# రేపటి భరోసా - వాసరచెట్ల కవిత్వం

**ఎదుగుతున్న కవిత్వం వాసనల ఆస్వాదన...**

కాంచనపల్లి గో.రా.

ఇటీవలి తెలంగాణ కవిత్వం సోషల్ మీడియా వల్ల కొంత నిరాశాజనకంగా ఉంది. కాని గుర్తించవలసిన మరో కోణంలో అదే సోషల్‌మీడియా వల్ల కొన్ని కవికోకిలలు తెలుగు సాహిత్య కేదారంలో కొత్త కొత్త వసంతాలను ప్రోది చేస్తున్నాయి.

అట్లాగని ఈ కవిత్వం అదేదో భావకవితా వీచిక అని నేను చెప్పడం లేదు. కొన్ని లక్షణాలు బహుశా కాల్పనిక వాద ఛాయలలో నడిస్తే నడిచాయిగాక, ఇవి నికరమైన మానవానుభూతులకు, మానవ సంబంధాల అనులోమ మూల్యాంకనానికి బేషరతుగా పనికివచ్చే కవితలు.

వాసరచెట్ల జయంతి చాలా రోజుల నుండి సాహిత్యరంగంలో కదులుతున్న కవయిత్రి. ఇటీవలి కాలంలో ఆమె కవిత్వం మరింత నూతనంగా వికసించడం గమనిస్తున్నాను. తన పరిమళాలతో సర్వత్రా వ్యాపించడం ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నది.

వాసరచెట్ల కవిత్వంలో అడుగుపెడితే నాన్న, అమ్మ, ఊరు, బాల్యం లాంటి కవిత్వపు ముడిసరుకులు మనల్ని నిండుకుంటాయి. ఈ స్పర్శతో హృదయం మరింత తెరచుకొంటుంది. ఆమె అక్షరాలు మనల్ని తమతో మమేకం చేసుకుంటాయి. ఒక సృజనకు కావలసిన



మౌలిక ధాతువులన్నీ ఆమె తనలోకి వంపుకొన్న వైనం అర్థమవుతుంది.

చాలా మంది కవులు తమ సంస్పందనలకు కేవలం అక్షర రూపం ఇస్తున్నారు. తమ స్కూల్ ఆఫ్ థాట్ గురించిన ఎరుకపట్ల తమ అవగాహన చెప్పడం లేదు. బహుశా కవికి ఈరకమైన స్పృహ పూర్తిగా నిండుకొననవసరం లేదనుకునేవాళ్ళలో నేనొకన్ని. తమ అనుభవం (sensory experience)కి అందిన ఏ అనుభూతినైనా అక్షరించడమే కవి పని. అయితే కవికి school of thought లేకుండా ఎట్లా పోతుంది? తాను అనుభవించింది అక్షరంగా పలువరిస్తున్నప్పుడు కవి ఏ స్పృహ నుండి మాట్లాడుతున్నాడనేది ఇట్టే తెలిసిపోతుంది. దీన్ని బట్టే కవి తాత్త్విక నేపథ్యాన్ని అంచనా వేయవచ్చు.

అత్యాధునిక కవితారంగంలో విస్తరించి కనిపిస్తున్నది బహుజనవాదం. కాగా ఇది ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రతి కవి మీద తన ప్రభావం చూపెట్టింది. ఈ ప్రభావమే ఈమెతో తన ఊరి జ్ఞాపకాలని అన్యాపదేశంగా పలికించింది. ఆమె బాల్య స్మృతి ఎన్నో రోజుల తరువాత అమ్మను చూస్తున్న అనుభూతి కలిగించిందట. నాడు పలకాబలపం పట్టుకొని అక్షరాలు దిద్దిన నాటి నేస్తాల స్వచ్ఛమైన స్నేహం (బాల్యాన్ని భుజాన మోస్తూ.. కవిత) ఆమె కనుల ముందు కవిత్వమై మెదిలింది. స్మృతివనంలో బాల్యం ఓ మధురఘట్టం. ఆటలు లాంటి కవితలన్నీ ఊరిని బాల్యాన్ని చిత్రించినవే.

ప్రపంచసాహిత్యంలో ఊరి జ్ఞాపకాలను స్మరిస్తూ చెప్పిన గొప్ప కవిత్వం మనకుంది. Oliver Gold Smith 'The Deserted village' poemలో

Sweet Album, loveliest village of the plain
where health and plenty
cheared the labouring swain
where smiling spring its earliest
visit paid And parting summer's lingering blooms delayed.

గ్రామాల్లోని ప్రకృతి సౌందర్యం ఈ కవితలో మనోహరంగా వ్యక్తమైంది. labouring (పల్లె శ్రామికుడు) స్థితిని, కాలానుగుణంగా స్పందించే ప్రకృతిని

వ్యాసం

ఇందులో చిత్రించాడు. ఇంకా 'The village' John clare 'The village boy' లాంటి కవితలెన్నో ఉన్నాయి. తెలుగులో 'నను మరచిన నిను మరువను వినుకొండా' అన్న జాషువా కవిత్వం ఎలా మరచిపోగలం? నేను కూడా నా 'చేదబావి' కవితా సంకలనంలో 'పల్లె తల్లీ... జాలపల్లీ' అని నా జన్మభూమిని స్మరించుకొన్నాను. వాసరచెట్ల జయంతి ఊరి కవితలు, ఆమె నిసర్గమైన పదబంధాలు పై కవితలన్నిటినీ స్ఫురణకు తెస్తాయి పేజీ 6, (ఆనందప్రళయం, కవిత).

ఈ సంపుటిలో నాన్న గురించి 'నాన్నను చూడగానే లేగదూడ తోక ఊపుతూ నిమరమని ముందు నిలిచేది' (మాయమైన పల్లెతనం). వట్టి సాధారణమైన మాటల్లాగానే కనిపించినప్పై వాక్యాలు ఎంత గొప్ప చిత్రాన్ని బొమ్మ కడుతున్నాయి.

ఈ కవయిత్రిలో ప్రధానమైన లక్షణం ఇది. అతి సాధారణమైన వాక్యాలుగా కవిత మొదలవుతుంది. అది క్రమంగా ఒక మొగ్గ మన కళ్ళ ముందే వికసించి పూవైనట్టుగా, చీకటి మెల్లిగా విచ్చుకొని... వెలుగు మనందరినీ ఆక్రమించినట్టుగా, మన లోపలికి ప్రవహిస్తుంది.

ఈ సంపుటిలో 'నాన్న నా ధైర్యం', 'మా నాన్న ఆణిముత్యం' లాంటి కవితలన్నీ పితృవాత్సల్యాన్ని తెలియజేసేవి. ఒక అమ్మాయిగా ఈ కవయిత్రి నాన్న పట్ల చూపిన ప్రేమ సహజానుభవమే. అయినా ఆమె ఆర్తి ప్రత్యేకంగా గమనించదగినది.

తెలుగు సాహిత్యంలో నాన్న స్పృహ అమ్మతో పోలిస్తే తక్కువగా వుందనే వాళ్ళున్నారు. కాని జయంతి లాంటి కవయిత్రులు నాన్న అనుభూతిని కూడా బలంగా ప్రోది చేస్తూ కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్నారు. నాన్నతో పాటు అమ్మ కవితలు కూడా ఈ సంపుటిలో ప్రముఖంగా చోటు చేసుకున్నాయి.

ఈ కవయిత్రిలో onomatopoeia ఒనోమాటోపియా (ధ్వన్యనుకరణ)




లక్షణాలు కొన్ని కనబడతాయి. అంటే ధ్వన్యనుకరణతో ఒక Image సృష్టించడం అన్నమాట.

'ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలల్లా
వినీలాకాశం ఎగురుతూ ఉంటుంది'
(కురుచశ్వాసల నడుమ)

'చిన్నారుల అమాయకమైన మోములో
కిలకిల నవ్వుల స్వరాల సరిగమలు'
(మోహనరాగం)

లాంటి ఉదాహరణలెన్నైనా చెప్పవచ్చు. జీవితాన్ని, కన్న కలల్ని తన కుంచెలో పోసి బతుకు చిత్రాన్ని గీచే కవయిత్రి ఈమె. ఈనాడు సమాంతరంగా వస్తున్న అనేక అభివ్యక్తులకూ సర్రియలిజం లాంటి వ్యక్తీకరణలకు అతీతమైన కవిత్వం ఆమెది. సమాంతర సాహితీ పరిణామాన్ని ఆకళించుకున్నా తనకంటూ ఒక కొత్త దారి గురించిన అన్వేషణలో ఉంది. ఆ ప్రయత్నం నుంచే సరికొత్త వ్యక్తీకరణను పాదుగా నిలువబోతుంది.

ఈ సంపుటిలో నన్ను ఆకర్షించిన మరో కవిత 'వింగ్స్ ఇన్‌స్ట్రక్టర్' గిజిగానికి ప్రతీకగా వున్న ఈ పేరు ఆమె నిర్మాణ కుశలతకు సంకేతం. పసుపులో పులిమినట్టు కనిపించే/ తలకట్టు కిరీటం అంటూ మొదలయ్యే ఈ కవితలో 'ఓ పిచ్చుకా నీకు గిజిగాడు అన్న నామకరణం ఎవరు చేసారో' అన్నమాట చివరలో వచ్చి మనకు కవితా రహస్యం పట్టిస్తుంది. గిజిగాడి గురించి తెలుగు సాహిత్యంలో పద్యకవులు, వచన కవులు వ్రాసినా వాళ్ల కంటే విభిన్నంగా సాగిపోతుంది ఈ కవిత. గిజిగాని గూళ్ల నిర్మాణంలోని సాంకేతికత నైపుణ్యం

ఆడపక్షి ప్రశంస కోసం పడే పోరాటం గిజిగాడి సివిల్ ఇంజనీర్ నేర్పరితనం చిత్రించిన తీరు ఆమె సూక్ష్మ పరిశీలనకు సంకేతం. గిజిగాడి జీవితం మానవీకరించి సాధారణీకరించడం ఆమె కలానికే చెల్లింది.

కవితా రచనకు అన్నీ అర్హమే అన్న మాట మనం తరచుగా వింటుంటాం. 'కాదేదీ కవిత కనర్హం, అవునౌనోయ్ శిల్పమనర్హం' అన్న శ్రీశ్రీ మాటలు చాలామంది ఉటంకిస్తారు. కాని ప్రతి దాన్ని కవితామయం చేస్తామనడం ఒక హాస్యోక్తే అవుతుంది. ఆ ప్రయత్నం వల్ల పేలవమైన ఆశు కవిత్వమే వస్తుంది. అట్లా కాక మనం అనుభవించేది, కనీసం ఇతరుల అనుభూతి అయినా మనల్ని కదలించగలిగేంత మమేకం కలిగించేదైనా బలమైన అక్షరాలుగా హృదయాన్ని చీల్చుకొని వస్తాయి.

వాసరచెట్ల జయంతి రాసిన ప్రతి కవితా ఇట్లాంటి దగ్ధహృదయం నుంచి పాటమరించినదే. 'ప్రేమపతాకం', 'బతుకుబంతి', 'అమ్మ సంతకం', 'వన కిశోరుడు' లాంటి కవితలన్నీ ఈ కోవకే చేరుతాయి. ఆమె అత్యాధునిక లక్షణాలున్న ఒక ఇమేజ్ 'నగరం నిద్రపోతున్నవేళ'లో చూడండి.

'బుసలు కొడుతున్న నాగుబాముకటి
నగరపు వీధులన్నీ పరుగులు
పెడుతుంది' నగరం నిద్రపోతున్నవేళ)

నగరం చీకటిని, క్రౌర్యాన్ని చిత్రించడానికి ఈమె ప్రతీక ఎంత బలంగా సారస్యంగా పని చేసిందో వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

'కన్నతల్లిని కష్టపెట్టి
సుఖపడినోడు ప్రపంచంలో లేడు
కంట తడిపెట్టిన వనదేవత
శాపంతో జీవికి భవిష్యత్తు లేదు'

'వనకిశోరుడు' కవితలో సార్వజనీనక సత్యాలతో వెలువడే ఈమె కవిత్వానికి స్వాగతం. అక్కడక్కడా పొంచి ఉన్న వచనాన్ని పూర్తిగా తిరస్కరించి ఆమె రేపటి భరోసాగా నిలుస్తుందని ఆకాంక్షిస్తున్నాను.

కవిత

# సాహసం



బి. వేణుగోపాల్ రెడ్డి, 9908171441

కనిపించని గాలిలో
సూక్ష్మజీవ ప్రపంచం
కంటికి ఆనని మహా విపత్తు
ప్రశాంతంగా రాజుకుంటున్న ప్రళయం జాడ
మరణ మృదంగం మోగే వరకు తెలియదు

ఒక అణువు
విశృంఖల చర్యలతో జీవ కణాలలోకి
విచ్ఛితి అవుతూ విచ్ఛిన్నం చేస్తూ

ఛిద్రమవుతున్న దేహం
అదుపు తప్పుతున్న అవయవాలు
పట్టుతప్పుతున్న ప్రతిరక్షకాలు
వెరసి జీవాయుధ గనిగా భారీ కాయం

ఒకేసారి వందలాది మందిని
మట్టికరిపించేంత వైరల్ లోడ్ అది
శత్రువే లేని నిరాయుధ ఆవరణంలోకి
తెలియకుండానే ఉచ్చులు పేరుస్తూ
గొలుసులుగా అల్లుకుంటూ
విశాలంగా పర్చుకుంటున్న ఖాతాలోకి
వచ్చిపడుతున్న కొత్త క్షిపణులు

ఇక బలమైన అతిధేయిలుగా ఎగసిపడడం
వాహకులుగా పదులు వందలవడం
దేనికదే కొత్త పద్దుగా
విశాలత చాటడం
నిజంగా మహా విషాదం

నిర్ధారణ కాని మందులతో వైద్యం
విచికిత్సగా ముందుకు
మరణాలను నమోదు చేసుకుంటూనే
సుదీర్ఘ చికిత్సలో స్వస్థత
కాసింత ఊరట
ప్రతిరోధకత హెచ్చుతోనే సాధ్యం

సాధారణ దృష్టికి అందని జగత్తులో ఉంది మర్మం
సగం అంధత్వంతో
అగోచర కారకాలతో సహజీవనం
సాహసమే...



# సృజన

అన్నవరం దేవేందర్, 9440763479

పట్టుకోవాలనుకున్న పదచిత్రం ఎగిరిపోయింది
రాయాలనుకున్న పద్యం మిగిలిపోయింది
ఒక ఊహ వచ్చినట్లే వచ్చి ఇచ్చుక పోయింది

అన్నం తింటున్నప్పుడు పళ్ళెంలో గీతలు గీసినట్టు
గాలిలో వేలితో అక్షరాలు రాసినట్టు
పిల్ల బాటలో ఒంటిగ నడుస్తూ రాగం తీసినట్టు
కళాత్మక అంకురానికి అవి తొట్టతొలి సమయాలు

నడుస్తూ నడుస్తున్నప్పుడే ఒక ఆలోచన మెరుపు
ఏకాంతంలోనే మరోక కవితా విరుపు
రాత్రి మెళుకువలో రాలిన భావ చిత్రం
ఉదయించే సూర్యుని నుంచే సౌందర్య శాస్త్రం

నది ప్రవాహం వలనే వాక్య విన్యాసం
ఉరూ వాడలు తిరిగితే మాటలు ఏరుకోవచ్చు
దృష్టి ఉంటేనే కవి చుట్టూ కవన తేజస్సు

గాలం వేసి ఓపిక పడితేనే చేప
గురి చూసి బాణం విడిస్తేనే లక్ష్యం
మొగులు మెత్తబడితేనే ఆకాశం నుంచి వర్షం

కవిత్వం అవలీలగా కమ్ము కోవాలంటే
నులక అల్లే మెలుకువ తెలిసి ఉండాలి
తొడ మీద పగ్గం పేనుడన్నా  చూసి ఉండాలి
శ్రమైక జీవన అల్లిక, పదాల పొందికా ఒక్క తీరే

కలం కవిత్వమై పారాలంటే
మనసు నిండా కార్య సృజన నిండాలి




# పీచర సునీతారావు పురస్కార ప్రదానోత్సవం



మంచితనాన్ని చూడగలిగి మంచి మార్గాన్ని అనుసరించేవారే అసలైన రచయితలని దాశరథి అవార్డు గ్రహీత సారస్వత పరిషత్ అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి అన్నారు. రవీంద్ర భారతితో జనవరి 2, 2022న పురస్కార ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శివారెడ్డి అవార్డు గ్రహీతలను సత్కరించారు. సభకు ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన అధ్యక్ష ప్రసంగంలో పి. విజయేందర్ విశాల హృదయంతో తన దివంగత పత్ని సునీతారావు పేరు మీద అవార్డు నెలకొల్పడం గొప్ప విషయమని అన్నారు. కాంచనపల్లి గోరా మాట్లాడుతూ పీచర సునీత రావు ఆదర్శ గృహిణి అని, సాహిత్యాభిమాని అని విజయేందర్ రావు, సునీతలది ఆదర్శ దాంపత్యమని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత్రులు జూపాక సుభద్ర, శిలాలోలిత మరియు పి. రవీందర్ రావు, శ్రీనివాస్ రావు, అమరేందర్ రావు ఇంకా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ప్రముఖ సాహితీవేత్తలు ఆడెపు లక్ష్మీపతి, గుడిపాటి పాల్గొన్నారు.

ఇంకా రాజమహేందర్ రెడ్డి, మదన్‌మోహన్ రావులు సభలో ప్రసంగించారు. సభలో దేవనపల్లి వీణా వాణి, నాటెంకి రవీందర్ కవిత్వానికి, ఎం.వి. రామి రెడ్డి, కె.వి. నరేందర్ కథలకు, విహారి, రూప్‌కుమార్ డబ్బీకార్ విమర్శకు అవార్డులను స్వీకరించారు. వారితోపాటు పలువురు కవులు, రచయితలను విజయేందర్ రావు సత్కరించారు.




# విశ్వశ్రీ ఫౌండేషన్ అవార్డుల ప్రదానోత్సవం....

వ్యవస్థాపక అధ్యక్షులు వి. గురుమూర్తి మరియు ప్రధాన కార్యదర్శి బిక్కి కృష్ణ ఆధ్వర్యంలో జనవరి 2, 2022న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పురస్కార ప్రదానోత్సవం జరిగింది. పువ్వాడ రవిబాబు, తల్లాడ సాయికృష్ణ కాంచనపల్లి గో.రా., నల్లాని హేమ, క్షీరంపల్లి కృష్ణ వేణి, యన్.జి. వీరన్న కాంచనపల్లి రాజేందర్ రాజు ఈ పురస్కార గ్రహీతలలో ఉన్నారు. సినీ రచయిత భారవి, నాళేశ్వరం శంకరం, ప్రభృతులు పాల్గొన్నారు. గురుమూర్తి రచించిన కవితా సంకలనం రంగులకల ఆవిష్కరణ జరిగింది. ఇంకా సి.బి.ఐ. అధికారి జస్టిస్ చంద్రకుమార్, హిమాలయ సాయిబాబా లాంటి సామాజిక ప్రముఖులు పాల్గొన్నారు. జీవన సాఫల్య జాతీయ సాహిత్య పురస్కారం అందుకున్న కాంచనపల్లి రాజేందర్ రాజు మా ప్రతినిధితో మాట్లాడుతూ రేపటి తరానికి, తరతరాలకి దిక్సూచి కేవలం సాహిత్యమే అని ఉద్వేగ పూర్వకంగా అన్నారు.




# జయంతి వాసరచెట్ల రచించిన కవితా సంపుటాలు ఆవిష్కరణ

చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో జయంతి వాసరచెట్ల రచించిన కవితా సంపుటాలు నేల విమానం, తురాయిపూలు ఆవిష్కరణ జనవరి 6వ తేదీన జరిగింది. త్యాగరాయగానసభ సౌజన్యంతో చందన పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో కళాసుబ్బారావు వేదిక మీద ఈ కార్యక్రమం జరిగింది. ఆవిష్కర్తలుగా ప్రముఖ సాహితీ వేత్తలు నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డిలు వ్యవహరించగా ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం సభాధ్యక్షులుగా వ్యవహరించారు. సాహిత్య అకాడెమీ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వి.యస్. జనార్దన మూర్తి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఇంకా సభలో చీదెల్ల సీతాలక్ష్మి, పైడిమర్రి గిరిజ, ఘనపురం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సమాచారం

# తెలంగాణకు కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారాలు



**వెంకన్న తన కవితా సంకలనం 'వల్లంకితాళం' (రిథమ్ ఆఫ్ కామన్ స్నిప్)కు అవార్డును గెలుచుకోగా, వరంగల్ జిల్లాకు చెందిన దేవరాజు మహారాజు 'నేను అంటే ఎవరు' (నేను ఎవరు) నాటకానికి బాల సాహిత్య పురస్కారం లభించింది. యువకవి, ఉపాధ్యాయుడు తగుళ్ల గోపాల్ రచించిన 'దండకడియం' (కంకణం) పుస్తకానికి యువ సాహిత్య పురస్కారం లభించింది.**



తెలంగాణకు చెందిన ముగ్గురు సాహితీమూర్తులకు కేంద్ర సాహిత్య అకాడెమీ 2021 అవార్డులు ప్రకటించింది. అందులో సుప్రసిద్ధ వాగ్గేయ కారుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఎం.ఎల్.సి. గోరేటి వెంకన్న తన 'వల్లంకి తాళం' గ్రంథానికి ఈ పురస్కారం గెలుచుకున్నారు. వరంగల్లుకు చెందిన డా॥ దేవరాజు మహారాజు బాలసాహిత్య పురస్కారం అందుకోనున్నారు. ఆయన రచించిన 'నేను అంటే ఎవరు?' అనే పొత్తానికి ఈ పురస్కారం ప్రకటించారు. అదే విధంగా యువ కవి తగుళ్ళ గోపాల్ 'దండకడియం' కవిత్వ సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం లభించింది.

ఈ సాహితీవేత్తలలో గోరటి వెంకన్న, తగుళ్ళ గోపాల్ పాలమూరు జిల్లాకు చెందిన వారే కావడం విశేషం.

గోరేటి వెంకన్న తన స్వీయగానంతో గొంతెత్తి వల్లంకి పిట్టల పాటలతో అలరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా గౌరవెల్లి గ్రామానికి చెందిన వెంకన్న అనేక సినీ గీతాలు రచించారు. 'పల్లే కన్నీరు పెడుతుంది, కనిపించని కుట్రల...', 'ఇద్దరం విడిపోతే భూమి బద్దలౌతుందా', 'కంపరేగు తీపివోలె', 'ఓ నల్ల తుమ్మా' లాంటి అనేక పాటలు పాఠక, శ్రోతలను అలరించాయి.



యువ పురస్కార గ్రహీత తగుళ్ళ గోపాల్ 'దండకడియం' యాదవ కుల సంస్కృతిని ప్రతిఫలించిన కావ్యం.

బాలసాహిత్య పురస్కార గ్రహీత దేవరాజు మహారాజు సుప్రసిద్ధ సాహితీవేత్త, శాస్త్రవేత్త. హేతువాదం, శాస్త్రీయ దృక్పథం ఆయన రచనలలో ప్రతిఫలిస్తాయి. తెలంగాణ భాషలో కూడా ఆయన కవితా రచన కొనసాగింది. ఈయన తెలంగాణ భాషలో రాసిన కవితా సంపుటి 'గుడిసె గుండె'కు దేవులపల్లి రామానుజరావు పురస్కారం (1974) కూడా అందుకున్నారు. ముఖ్యమంత్రి కె.సి.ఆర్. మరియు పలువురు రాజకీయ, సాహిత్య ప్రముఖులు పురస్కార గ్రహీతలను అభినందించారు. 'తంగేడు' ఈ సాహితీ విజేతలను హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తోంది.

స్వీ
కా
రం




## కార్తీకంలో కాశీయాత్ర

సంధ్య ఎల్లాప్రగడ

**వంగూరి ఫౌండేషన్స్ ఆఫ్ అమెరికా**
వెల : రూ.150/-



## దశ్శాలువాకప్పంగ కథలు

ఆర్.సి. కృష్ణస్వామి రాజు
సెల్ : 9393662821

**విశాఖ ప్రియమైన రచయితల**
**సాహిత్య సంక్షేమ సంఘం**
విశాఖపట్నం
వెల : రూ.140/-




## మేఘసందేశమ్

రఘువర్మ (డా॥ టి. లక్ష్మీనారాయణ)
సెల్ : 9290093933

**నవోదయ బుక్ హౌస్**
హైదరాబాద్
వెల : రూ.70/-




## కలిసుందామా....

లలితా వర్మ
సెల్ : 99496 72671

**జె వి పబ్లిషర్స్**
వెల : రూ. 120/-




## అనంత సాహితీమూర్తి ఆశావాది

డా॥ పి. రమేష్ నారాయణ
సెల్ : 94413 83888

**డా॥ ఆశావాది ప్రకాశరావు**
పెనుకొండ, అనంతపురం జిల్లా
ఆంధ్రప్రదేశ్
వెల : రూ.100/-




## కొత్త కవితలు - 2

180 వరల్డ్ తెలుగు పోయట్స్

**నవోదయ బుక్ హౌస్**
హైదరాబాద్
వెల : రూ.300/-




## కోకిల

ప్రొ॥ మసన చెన్నప్ప
సెల్ : 9885654381

**తెలంగాణ సారస్వత పరిషత్**
హైదరాబాద్
వెల : రూ.100/-




## కృష్ణశాస్త్రి సాహిత్యం-సౌందర్యతత్త్వం

డా॥ సూరి సీతారామయ్య (రామసూరి)
సెల్ : 94412 16050

**నవోదయ బుక్ హౌస్**
హైదరాబాద్
వెల : రూ.200/-




## కథాకేళి

జెవి పబ్లికేషన్స్ : జ్యోతి వలబోజు
**హైదరాబాద్**
80963 10140

వెల : రూ. 300/-



భారత స్వాతంత్ర్య సమరవీరులలో అగ్రగణ్యుడు,
అలుపెరుగని పోరాటంతో ఓటమి ఎరుగని వ్యక్తిత్వంతో,
మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన

**మహానేత నేతాజీ సుభాష్ చంద్రబోస్**

(జయంతి : 23 జనవరి, 1897)